అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 19-6-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 118 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50






## అంబేద్కర్ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

### సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-చంద్రుగొండ

అంబేద్కర్ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పెద్దిన్నే వేణు డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ గతంలో 11 కెవి విద్యుత్ వైర్లు తొలగించి స్తంభాలు తీయటం చేయలేదు, 20 సంవత్సరాల నుంచి వీధిలైట్లు లేక ఆ వీధి ప్రజల అవస్థలు పడుతున్నారన్నారు. ఆ స్తంభాల కైనా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అదేవిధంగా రాత్రిపూట చిమ్మ చీకట్ల నివసించవలసి వస్తుందని, దీనికి తోడు కుక్కలు, కోతుల బెడదతో, పాములు సంచరించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, అనేకమార్లు పంచాయతీ పాలకవర్గానికి కార్యదర్శికి అనేకమార్లు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మీరు స్పందించకపోతే పంచాయతీ ఆఫీస్ ముందు కాలనీ వాసులతో నిరసన తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, బత్తుల నాగేశ్వరరావు, రాయి రాజా, దాసరి సీతారాములు, అబ్దుల్ రెహమాన్, రామడుగు వెంకటాచారి, అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు చంగల యశోద, కుమారి, ఏసు మని, సీతమ్మ, కునమ్మ రెడ్డి పోగు మాధవి పాల్గొన్నారు.

## నీరే ప్రాణాధారం

### పూబెల్లి, బొజ్జాయి గూడెంలలో ఘనంగా మంచినీళ్ళ పండుగ



నవతెలంగాణ-ఇల్లందు

జీవకోటి మనుగడకు నీరే ప్రాణాధారమని సర్పంచులు మూతి వెంకట నర్సు, చీమల వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని పూబెల్లి, బొజ్జాయి గూడెం గ్రామ పంచాయతీలలో ఆదివారం వేరువేరుగా మంచి నీళ్ళ పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గం, గ్రామస్తులతో కలిసి పంచాయతీ కార్యాలయం నుండి మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కల్తీ మహేష్ తదితర పంపు ఆపరేటర్లకు పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 4వేల లీటర్ల మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులు నిర్మాణం జరిగిందన్నారు. దీని మూలంగా గ్రామంలో ఇంటింటికి పంపు కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఉచితంగా పరిశుభ్రమైన మంచినీరు సరఫరా జరుగుతోందన్నారు. ప్రతిరోజు నీటి సరఫరా జరగటం వలన గ్రామాల్లో సమస్య తీరిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ విజయవంతమై ప్రజలు ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. పంచాయతీల్లో సురక్షిత మంచినీరు సరఫరా చేయడానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే హరిప్రియ, సీఎం కేసీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ మంచినీటి కష్టాలు తీర్చిన సర్పంచులను, ప్రభుత్వాన్ని, అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పూబెల్లి ఉప సర్పంచ్ ఝాన్సీ రాణి, గ్రామస్తులు ముత్యాలు, రామస్వామి, చీమల పొట్టయ్య, కల్తీ ముత్యాలు, పూబెల్లి పంచాయతీ కార్యదర్శి కృష్ణ చైతన్య, బొజ్జాయిగూడెం పంచాయతీ కార్యదర్శి షర్మిల బేగం, డీఎస్‌పీఓ రాజీవ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు కుల ధృవీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి

### దరఖాస్తు చివరి తేదీని పొడిగించాలి

### సీపీఐ(ఎం) డిమాండ్



నవతెలంగాణ-భద్రాచలం

ప్రభుత్వం ప్రకటించిన బీసీ వృత్తిదారులకు లక్ష రూపాయలు సాయం పథకంలో దరఖాస్తు చేసుకోవడం కోసం బీసీలు కుల ధృవీకరణ, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ సర్వర్లు పనిచేయడం లేదని సర్టిఫికెట్లు ఆలస్యంగా ఇస్తున్నారని, ఆలస్యం కాకుండా వెంటనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సీపీఐ(ఎం) భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధికారులకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎం) 16వ జోన్ కమిటీ సమావేశం డి.సీతాలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన లక్ష రూపాయల సాయం పథకం దరఖాస్తు చివరి తేదీని పొడిగించాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ లక్ష రూపాయల సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్నవారు తమ పనులు సైతం వదులుకొని రోజు మీసేవ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని గడువు తేదీలోపు సర్టిఫికెట్లు వస్తే దరఖాస్తు చేసుకోవడానికి వీలవుతుందని ఆలోచనతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. అందుకే దరఖాస్తు గడువు తేదీ పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, నాదెళ్ళ లీలావతిలు మాట్లాడారు. సమావేశంలో ఎం.వి.ఎస్ నారాయణ, కోరాడ శ్రీనివాస్, బేగం, కనక శ్రీ, డి.రామకృష్ణ, రాంబాబు, లక్ష్మీకాంత, హైమావతి, సౌభాగ్యంలు తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ డబుల్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

### సీపీఐ(ఎం) మండలం కార్యదర్శి బత్తుల



నవతెలంగాణ-బూర్గంపాడు

ఇల్లు, ఇళ్ల స్థలాలు, డబల్ బెడ్ రూములు కట్టించి నిరుపేదలకు ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సారపాకలో గల భాస్కర్ నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2014 నుండి డబల్ బెడ్ రూమ్ ప్రతి ఒక్కరికీ నిరుపేద కుటుంబాలకు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారని ఆయన అన్నారు. ఇంత వరకు ఆ హామీ నెరవేరలేదని ఆయన పేర్కొన్నారు. అక్కడక్కడ నూటికి 5 శాతం ఇచ్చారని, 95 శాతం నిరుపేదలకు అందరికీ అందే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నుండి రూ.10 లక్షలు తెలంగాణ ప్రభుత్వం నుండి రూ.5 లక్షలు మంజూరు చేసి అందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్రూంలు కట్టించి ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుంజి నరసమ్మ, పెట్ల మంగ, గుంజి లక్ష్మి పల్లప శేషమ్మ, వెంకటేశ్వర్లు, పెట్ల లక్ష్మి, వెంకటమ్మ పెట్ల ధన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బందికి వేతనాలు నిర్ధారించాలి

- టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి
- నిరాహార దీక్షకు మద్దతు



నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచ మున్సిపాలిటీలో మూడు సంవత్సరాలుగా పారిశుధ్య డ్రైవర్స్, హెల్పర్స్‌గా పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు నిర్ధారించాలని కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ బంగారు తెలంగాణ కేసీఆర్ చేస్తారో లేదో తెలియదు కానీ పట్టణాలను అద్దంలా చేయడంలో సహకరించే పారిశుధ్య కార్మికులకు వేతనాలను ఇవ్వలేక పోతుందని, పట్టణంలో రోగాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పారిశుధ్య డ్రైవర్లు, వారి సహాయకులకు కొత్తగూడెంలో ఇచ్చిన విధంగా వేతనాలను ఇవ్వాలని, ఇంటింటికీ వెళ్లి అడుక్కోమని అధికారులు చెప్పడం హేయమని, ప్రపంచంలో ఏ విషయం అయిన తనకు తెలిసినంతగా ఎవరికి తెలియదని అనుకునే మన తెలంగాణ మునిసిపల్ శాఖ మాత్యులకు పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలని తెలియడం లేదా అని ఎద్దేవా చేశారు. ఈ సమస్యపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేపు కలెక్టర్‌ను కలుస్తామని, వారు స్పందించకుండా ఉంటే కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉండి వారి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కోసం కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిన ప్రభుత్వం వీరికి జీతాలను నిర్ధారించడంలో జాప్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జలీల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, బత్తుల వెంకటేశ్వర రావు, చంద్రగిరి సత్యనారాయణ, నియోజకవర్గ సోషల్ మీడియా కో కో-ఆర్డినేటర్ ఎస్కే.షఫీ తదితరులు పాల్గొన్నారు.

## నీరు మానవ మనుగడకు ప్రధమం

### నీరు లేకుండా జీవనమే ప్రశ్నార్ధకం



నవతెలంగాణ-చర్ల

నీరు నిత్యవసరాలతో పాటు మానవ మనుగడకు చాలా ప్రథమం అని పలువురు అభిప్రాయపడ్డారు. ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చర్ల మండల కేంద్రంలో జరిగిన మంచినీళ్ళ పండుగ సందర్భంగా స్థానిక రైతు వేదికలో సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు అభిప్రాయపడ్డారు. స్థానిక మిషన్ భగీరథ సంపు వద్ద సాయి నగర్, విజయ కాలనీ గ్రామాలకు నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక నీటి వసతిని ప్రారంభించి మాట్లాడారు. మిషన్ భగీరథ నీరు తాగడం వలన ఆరోగ్యంగా ఉంటారని ఆర్వో ప్లాంట్ నీటిని తాగడం వలన దేహంలో అనేక రుగ్మతలు ఏర్పడటమే కాకుండా ఎముకల బలహీనత, గ్యాస్టిక్ వంటి వ్యాధులు వస్తాయని మిషన్ భగీరథ ఏఈ రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దొడ్డిహరి నాగ వర్మ, సంతోష్, ఎంపీడీవో రవీందర్ ప్రసాద్, ఏవో శివప్రసాద్ పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల భూములు విధ్వంసం

- పొడైన చెరువులు, కుంటలు
- కరకట్ట పేరుతో యదేచ్ఛగా దోపిడి
- ఆందోళనలో రైతులు







నవతెలంగాణ-మణుగూరు

మండలంలోని రాయి గూడెం శివారు నుండి అన్నారం వరకు గోదావరి కరకట్ట పేరుతో రైతుల భూముల్లో ఇష్టానుసారం తవ్వకాలు నిర్వహించి శశిరాం ఇన్ఫ్ రా కంపెనీ పేరుతో విధ్వంసం సృష్టించారు. మొదట రైతులకు అనేక ఆశలు చూపి వ్యవసాయ భూములలో మట్టి తవ్వకాలు జోరుగా నిర్వహించారు. కరకట్ట పేరుతో యదేచ్ఛగా దోపిడి నిర్వహించారు. రైతులకు ఎలాంటి సమాధానం చెప్పకుండా సీతారామ ప్రాజెక్టు ఆగిపోవడంతో మణుగూరు నుంచి ఊడయించేందుకు సిద్ధమవుతున్నారు. అటవీ శాఖ అనుమతులు లేకుండా ఫారెస్ట్ భూములలో అక్రమ గ్రావెల్ మట్టితో నిర్వహించారు. రాయి గూడెంలో గోదారివద్దు కరకట్ట వెంబడి ఉన్న రైతుల భూములలో యంత్రాలు ఉపయోగించి భారీగా మట్టి తవ్వకాలు నిర్వహించారు. రైతు తమ ఆవేదన గోడు ఎవరికి చెప్పుకోలేక కరకట్ట పనులు నిర్వహిస్తున్న శశి రామ్ ఇన్ఫ్రా కంపెనీకి మొరపెట్టుకోగా తూతూ మంత్రంగా చదును చేశారు. ఆ పొలంలో వ్యవసాయం చేయాలంటే సాధ్యమయ్యే పరిస్థితి లేదని భారీ స్థాయిలో నీరు నిల్వ ఉంటుందని చెరువులు తలపించే విధంగా నీళ్లు నిలువ ఉంటాయని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కమలాపురం-అన్నా రం మార్గమధ్యంలో ప్రధాన రహదారి నుండి సింగనకుంట వైపుగా సుమారు 20మంది రైతుల భూములలో మట్టి తవ్వకాలు నిర్వహించారు. రైతుల పొలాల్లో గట్లన్నీ విధ్వంసం అయ్యాయి. రైతుల మధ్యన సరిహద్దులు చెరిగిపోయాయి. వ్యవసాయం చేయాలంటే సాధ్యమయ్యే పని కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా భారీగా విధ్వంశం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను కుంటలను కూడా వదలకుండా యదేచ్ఛగా నిర్వహించారు. కమలాపురం, అన్నారం మధ్యన ఉన్న సింగనకుంటలో భారీ తవ్వకాలు నిర్వహించడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ గోతులలో నీరు నిల్వ ఉండడం కారణంగా గేదెలు వేసవి తాపాన్ని తట్టుకోలేక గోతుల్లో దిగుతున్నాయి తప్ప పైకి ఎక్కడం లేదు దీని కారణంగా మూగజీవాలు ఇబ్బంది పడుతున్నాయి. భారీ గోతులు కారణంగా పశువులకు, మనుషులకు వర్షాకాలంలో తీవ్ర ప్రమాదం పొంచి ఉందని స్థానికులు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నారం గ్రామంలో ఉన్న బూరుగుకుంట సుమారు 50 ఎకరాలలో విస్తరించి ఉన్నది. రైతులకు మాయమాటలు చెప్పి చెరువులలో భారీగా తవ్వకాలను నిర్వహించారు. గ్రామంలో బొంద్రాయి వేసుకుంటే సహాయం చేస్తానని హామీ ఇచ్చి చెరువుని విధ్వంసం చేశారు. వేసవిలో చేపలు విరివిగా ఉండే ఈ కుంటలో చుక్క నీరు లేకుండా చేశారు. రాబోయే కాలంలో చేపలు పట్టాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని జాలర్లు తెలుపుతున్నారు. మణుగూరు ఓసీల నుండి మణుగూరు చెరువుకు భారీ నీరు చేరుతుంది. అక్కడినుండి దాల్వ పంటకు నిరంతరం నీటి సరఫరా కారణంగా ఆ నీరు బూరుగుకుంట కొస్తుంది. దాన్ని మళ్లించకుండా తూములు నిరంతరాయంగా తీయడంతో వ్యవసాయ భూములు తీవ్రంగా నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారులు పోలీసు యంత్రాంగం కలగజేసుకోవాలని చెరువులలో ఉన్న అధిక గోతులను చదును చేయాలని అన్నారం రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిచో రాయి గూడెం, అన్నారం, కమలాపురం గ్రామాల ప్రజలతో ప్రత్యక్ష ఆందోళన దిగుతామని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.



**పొలాలు పాడైపోయినాయి : రైతు బండ్ల విజయ్ కుమార్**

కరకట్ట నిర్మాణ వలన భారీ యంత్రాలు రాకపోకలతో పంట పొలాలు పాడైపోయినాయి. చెరువులను గోతులు గోతులు తీశారు. ఇబ్బందికరంగా ఉంది. వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులకు డబ్బులు ఇస్తామన్నారు. ఇవ్వలేదు. వ్యవసాయ పొలాలలో గట్లు పోస్తామన్నారు, పోయలేదు. రైతులకు ఏ పని కూడా చేయలేదు. భవిష్యత్తులో చేపలు కోసం చెరువులు పనికిరాకుండా పోయాయి. కరకట్ట నిర్మాణ వలన పంట పొలాలు చెరువులు దెబ్బతిన్నాయి.

# పోడు భూముల్లో మొదలైన రగడ

### ఫారెస్ట్ అధికారులు, పోడు రైతులకు మధ్య వాగ్వాదం



నవతెలంగాణ-పినపాక

పచ్చని పల్లెల్లో పోడు రగడ మళ్ళీ ప్రారంభమైంది. ఆదివారం తెల్లవారుజామున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జానంపేట గ్రామపంచాయతీ సర్దట్ పల్లిలో పోడు భూముల్లోకి వెళ్లిన రైతులకు, ఫారెస్ట్ అధికారులు వెళ్ళవద్దు అంటూ అడ్డుపడ్డారు. పొలాలకు గట్లు వేస్తున్న ట్రాక్టర్ తాళాలను సైతం తీసుకున్నారు. పోడుభూములకు రావద్దు అంటూ ఫారెస్ట్ అధికారులు అడ్డుపడుతున్నారంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ప్రభుత్వం రెండు రోజుల్లో పోడు భూములకు పట్టాలు ఇస్తానని చెబుతుంటే ఇప్పుడు ఫారెస్ట్ అధికారులు ఎందుకు ఇలా చేస్తున్నారో అర్థం కావడంలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పూట తీవ్ర ఎండలుగా ఉండడంతో తెల్లవారుజామున గట్లు వేసుకుంటున్నామని వర్షం పడితే నీరు నిలవ ఉండడం కోసం గట్లు పెడుతుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఫారెస్ట్ అధికారులు డబ్బులు తీసుకోవడం కోసమే ఇలాంటి పనులు చేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు ముందుగా పోడు భూములకు వెళ్ళవద్దని ఆదేశాలు ఇస్తే ఖచ్చితంగా వెళ్లమని కానీ ఎంతోకాలంగా ఈ భూములను సాగు చేస్తూ ఈ భూములపై కేసులు కాగా జైలుకు సైతం వెళ్ళామని గిరిజనులు తెలుపుతున్నారు. భూమి పూర్తిగా సర్వే అయి పోడు పట్టాలలో పేరు కూడా వచ్చిందని ఇలాంటి భూములపై కూడా పంట వేయకుండా ఆపడం ఏమిటని ఫారెస్ట్ అధికారులపై స్థానిక గిరిజనులు మండిపడ్డారు. ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని కలిసి తమ ఆవేదన చెబుతామని గిరిజనులు తెలిపారు. ఇది ఇలా ఉండగా ఒకసారి అటవీశాఖ అధికారి కత్తి పట్టుకుని వచ్చాడని కత్తి పట్టుకుని ఎందుకు వచ్చాడో అర్థం కావడం లేదని పోడు రైతులు తెలియజేస్తున్నారు.

గతంలో ఒక ఫారెస్ట్ అధికారి ట్రాక్టర్లు ఆపి డబ్బులు కూడా తీసుకున్నాడని ఆ వివరాలు కూడా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు తెలుపుతామని గిరిజనులు బహిరంగంగానే తెలిపారు. ఏది ఏమైనా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరుపుతూ ఉంటే పోడు భూముల్లో ఇలాంటి రగడలు జరగటం బాధాకరమైన విషయమే. ఇప్పటికైనా ప్రభుత్వ విప్ రేగా కాంతారావు తన పరిధిలో జరుగుతున్న ఈ సమస్యను పూర్తిస్థాయిలో విచారించి తమకు న్యాయం చేయాలని గిరిజనులు వేడుకుంటున్నారు.

**అటవీ భూమి దున్నుతున్నారని సమాచారంతోనే అక్కడికి వెళ్లాం**

**ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని**

అటవీ భూమిని కొంతమంది గిరిజన రైతులు దున్నుతున్నారని కార్యాలయానికి ఫోన్ రావడంతో సిబ్బందిని అక్కడికి పంపామన్నారు. సర్వే చేసిన భూమిలో రైతులు సాగు చేస్తుంటే ఆపమని చెప్పలేదన్నారు. ఫారెస్ట్ అధికారి చేతికి కత్తి ఎలా వచ్చింది అన్న విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు. అధికారిపై తప్పు ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాము. ఏ అధికారి బెదిరించిన, ఎవరైనా లంచం ఇచ్చి ఉంటే తెలియజేయాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నడుచుకుంటాం.



## మానవత్వానికి మారుపేరు చేయూత ట్రస్ట్

### అంజిరెడ్డి వైద్యానికి రూ.11 వేలు వితరణ

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో బొడ్డు అంజిరెడ్డి అనే యువకుడికి వైద్య ఖర్చులు నిమిత్తం మోరంపల్లి బంజర్‌కు చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.11 వేలు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. గత నెల రోజుల క్రితం తాటి చెట్టు నుండి జారిపడి తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్ ఆస్పత్రిలో సుమారు ఎనిమిది లక్షల రూపాయల వరకు ఖర్చు చేసి బతికించు కోవడం జరిగింది. నేటి వరకు కూడా నడుము, కాళ్లలో స్పర్శ లేకుండా మంచానికే పరిమితం అయ్యాడని వైద్య ఖర్చు లకోసం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మేజర్ వైద్యానికి 8 లక్షలు కాగా ఇప్పుడు కోలుకోవడానికి సుమారు రెండు, మూడు లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్ తెలపడంతో ఆ కుటుంబం మనోవేదన చెందుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం అంజిరెడ్డి కుటుంబం లక్ష్మీపురం గ్రామంలో యువకులు ఒక గ్రూప్ క్రియేట్ చేసి అంజి రెడ్డికి ఆర్థిక సహాయం చేయాలని సోషల్ మీడియాలో పెట్టడంతో సోషల్ మీడియాలో వచ్చిన సమాచారానికి ప్రతి ఒక్కరు స్పందిస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. ఈ విషయం మోరంపల్లి బంజరు గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ దృష్టికి రాగానే వెంటనే 11,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి మానవ త్వానికి మారుపేరుగా నిలిచింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలు కష్టాల్లో ఉంటే ప్రతి ఒక్కరూ తమకే చేతనైనంత సాయం అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఏఎస్సై వివి సత్యనారాయణ, కైపు నాగిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, కె.వెంకటేశ్వర్లు (కేవీ), కె.బాలఅచ్చి రెడ్డి, సాయిబాబు, హనీఫ్, బిజ్జం వెంకట్రామిరెడ్డి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, సెనగ మల్లేష్, మూల లక్ష్మిరెడ్డి, గాదే నర్సిరెడ్డి, గణేష్, వెంకట రమణారెడ్డి, నర సింహారెడ్డి, వెంకట్రెడ్డి, లక్ష్మీపురం పంచాయతీ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తునికాకు కార్మికులకు కూలి డబ్బులు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

తునికాకు కార్మికులకు ఆకు కోసిన కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు బానోతు ఊక్లా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తునికాకు సేకరించి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ తునికాకు కార్మికులకు ఆకు కోసిన డబ్బులు చెల్లించకుండా, ప్రభుత్వం, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి గిరిజనులకు ఇతర పేదలకు రెండవ పంటగా తునికాకు సేకరణ ఉంటుందని దాని ద్వారా వచ్చే ఆదాయంతో వేసవికాలంలో కుటుంబ పోషణకు పిల్లల చదువులకు వైద్య ఖర్చులకు ఉపయోగపడాల్సింది పోయి నేటికీ వారికి డబ్బులు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 45 యూనిట్లలో ఆకు సేకరణ జరిగిందని, దాదాపు 60 కోట్ల రూపాయలు వరకు పేదలకు అందాల్సి ఉందని, వాటిని వెంటనే తునికాకు కార్మికులకు చెల్లించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏకెఎమ్ఎస్ జిల్లా నాయకులు భూక్య హర్ష, పేనక రామస్వామి, అమర్ సింగ్, నర్సింగ్, లింగ, జాంబు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథతో తీరిన నీటి కష్టాలు

- మంచినీళ్ళ పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

తాగునీటి సమస్యతో దశాబ్దాల పాటు ఇబ్బందులు పడ్డ ప్రజలకు 'మిషన్ భగీరథ'తో సీఎం కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపించారని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. మున్సిపాలిటీ 2వ వార్డులో ఆదివారం ఏర్పాటు చేసిన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంచినీళ్ళ పండగ కార్యక్రమం నిర్వహించారు. తొలుత కాళీ మాత గుడిలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కమిషన్ అంకుషావళి వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలోని ప్రతి మారుమూల పల్లెకు, ప్రతి ఇంటికి నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుతోందన్నారు. ప్రజలకు 100శాతం తాగునీరు అందిస్తున్న అతి పెద్ద రాష్ట్రంగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పట్టణంలోని మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా 5,565 కనెక్షన్స్ కాగా 465 పెండింగ్ కనెక్షన్స్ ఉన్నాయి. గతంలో వేసవిలో వారానికి ఒకసారి పంపు వచ్చేదని, నేడు మిషన్ భగీరథ చెరువు, సింగరేణి 47 లెవెల్ ద్వారా పట్టణానికి రోజు విడిచి రోజు మంచినీళ్ల అందిస్తున్నామన్నారు. మిషన్ కాకతీయ భాగంగా చెరువు పూడికలను తీసి భూగర్భ జలాలను పెంచి చెరువులలో నిండు వేసవిలో కూడా నీళ్లు ఉంటున్నాయి అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల కోసం కొన్ని కోట్ల ఖర్చుపెట్టి నీటి కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్ల నీటిని ఉచితంగా అందిస్తూ అభినవ భగీరధుడుగా సీఎం కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, మున్సిపల్ కమిషనర్ అంకుశవాలి, మిషన్ భగీరథ డీపీఎం విజయ్, ఒకటి, రెండో వార్డ్ కౌన్సిలర్‌లు వార రవి, కటకం పద్మావతి, దళిత బంధు కమిటీ అధ్యక్షులు మేకలు శ్యామ్ సోషల్ మీడియా ఇన్చార్జి గిన్నారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వృత్తి దారుడు మృతి

నవతెలంగాణ-చంద్రుగొండ

చంద్రుగొండ గ్రామానికి చెందిన దడిగల రాములు (50) చౌర వృత్తి దారుడు. అనారోగ్యంతో మృతి చెందాడు. మండల నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు సంతాపం తెలిపి నివాళులర్పించారు. మంచి నైపుణ్యత గల పని వాడిని కోల్పోయామని అన్నారు. ఆయన లేని లోటుని ఎవరు భర్తీ చేయలేరు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు కొల్లి పాక అప్పారావు, సోమన్నపల్లి మధు దడిగల మల్లేష్, కడియాల పుల్లయ్య, వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పెద్దిని వేణు, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రాజ, దాసరి సీతారాములు, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

## వికలాంగులకు బస్ పాసులు అందజేత

నవతెలంగాణ-బూర్గంపాడు

రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో వికలాంగులకు బస్ పాసులను ఆదివారం అందజేశారు. ఆర్టీసీ డిపోలో వికలాంగులకు సారపాక రోటరీ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ఉచితంగా రూ.18 విలువ గల పాసులను అందజేశారు. అనంతరం ఈ బస్ పాస్‌లకు సంబంధించిన పూర్తి ఖర్చును రూ.18 వేలు విలువ చేసే చెక్‌ను డిపో మేనేజర్ రామారావు కు రోటరీ క్లబ్ ఇన్ భద్రా ఆఫ్ సారపాక కార్యదర్శి డా.విజయ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ తరుపున ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 360 వికలాంగులకు లబ్ధి చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సభ్యులు సత్యనారాయణ, సాయి రామ్, ఖాదర్, వై.సుధాకర్ రెడ్డి, ఆర్టీసి అధికారులు అల్లం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతమైన చిన్నపిల్లల వైద్య శిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల కేంద్రమైన లక్ష్మీనగరం గ్రామంలో గల శ్రీ దాసాంజనేయ స్వామి వారి ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన చిన్న పిల్లల వైద్య శిబిరం విజయవంతమైంది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన వైద్య శిబిరంలో భద్రాచలం పట్టణానికి చెందిన స్వాతి హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యులు పిన్నింటి రాజశేఖర్, వైద్యాధికారి అనిల్ రెడ్డి ఆద్వర్యంలో వైద్య సిబ్బంది చిన్నపిల్లలకు, పెద్దలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆద్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి తెల్లం సీతమ్మ, లక్ష్మీనగరం గ్రామపంచాయితీ సర్పంచ్ సరియం రాజమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ శీరపు వీరరాఘవ రెడ్డి, సభ్యులు వాకచర్ల బుజ్జి దల్లి హరిబాబు, గుడ్ల శ్రీనివాసరెడ్డి, గుడ్ల తాతారావు, నటరాజస్వామి, పిలకా వెంకటరమణారెడ్డి, ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు..




అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 19-6-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 118 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 10 పేజీలు వెల : 6.50


# పేదల జోలికొస్తే ఖబడ్దార్

## భూపోరాటం నుంచి వెనక్కి తగ్గం

- జీవించే హక్కు కోసం మహిళలు పోరాడాలి
- బీజేపీపై పోరులో కేసీఆర్ సర్కారుకు తోడ్పాటు
- కానీ గుడిసెలపైకి బుల్డోజర్లు పంపితే ఊరుకోం..
- మోడీ విధానాలతో ప్రమాదంలో లౌకికవాదం : మహబూబాబాద్ బస్సుయాత్ర సభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

### బస్సు యాత్రను అడ్డుకునేందుకు ఖాకీల కుట్ర

- గంటసేపు పోలీసు స్టేషన్‌లో బస్సు డ్రైవర్‌పై దాడి
- గిరిజన సంఘం నేత శ్రీరాంనాయక్ అరెస్ట్, విడుదల
- రియల్టర్ల ప్రోద్బలంతో మహబూబాబాద్ పోలీసుల ఓవర్ యాక్షన్
- బ్రేకులేస్తే బస్సు ఆగుద్దేమో.. యాత్ర కాదు : ఎస్. వీరయ్య



వివరాలు 7లో..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భూపోరాటం నుంచి వెనక్కి తగ్గమని, పేదల జోలికొస్తే ఊరుకోమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ స్పష్టం చేశారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన బస్సు యాత్ర ప్రారంభ బహిరంగసభకు బృందా కరత్ హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కును దేశ పౌరులందరికీ ప్రసాదించిందన్నారు. జీవించే హక్కు కల్పించడమంటే పౌరుడి రక్షణకు నీడ కల్పించడమని వివరించారు.. మరి నీడలేని పేదలు గుడిసెలేసుకుంటే దాడులెందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లాలో 40 శాతం గిరిజనులున్నారన్నారు. వీరంతా పేదరికంలో ఉన్నారని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో పేదలు గుడిసెలు వేసుకుంటే పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళలపై దాడులు చేసే అధికారం ఎవరిచ్చారని ...5లో



### పోరాటం ఆగదు : ఎస్.వీరయ్య

ఎన్ని దాడులు చేసినా భూపోరాటం ఆగదని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక నేతృత్వంలో ఈరోజు నుంచి ...7లో

### కబ్జా భూముల్లో ఎర్రజెండాలు పాతుతాం : జి. నాగయ్య

మహబూబాబాద్ పట్టణంలో సర్వేనెంబర్ 551, 287, 255లోని 3 వేల ఎకరాలు, మరో పది సర్వేనెంబర్‌లలో 2 వేల ఎకరాల భూములున్నాయని, ...7లో



# ముంచేశారు

## 12 లక్షలకోట్లు ఎగ్గొట్టిన పెద్దమనుషులు..



- మోడీ పాలన వారికి స్వర్గధామం
- బ్యాంకులను మోసగిస్తున్నా పట్టించుకోరు

**మోడీ ప్రభుత్వ హయాంలోని తొలి ఎనిమిది సంవత్సరాలలో బ్యాంకులు రూ.12 లక్షల కోట్లకు పైగా నష్టాన్ని చవిచూశాయి. ఇవేమీ కాకి లెక్కలు కావు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కరద్ ఈ నెల 15న 'ది వైర్' పత్రికకు రాసిన సవివరమైన లేఖలోని వాస్తవాలే. 2013-14 నుండి 2022 డిసెంబర్ 31 వరకూ ప్రభుత్వ, ప్రైవేటు, విదేశీ బ్యాంకులు రూ.12,09,606 కోట్ల నష్టాన్ని మూటకట్టుకున్నాయని ఆ లేఖలో తెలియజేశారు. మరి బ్యాంకులను ఆ మేరకు మోసం చేసిన ఘనులపై ఏం చర్యలు తీసుకున్నారన్నదే ఇప్పుడు ప్రశ్న. వాస్తవానికి బ్యాంకులను నట్టేట ముంచుతున్న బడా బాబులపై చర్యలు తీసుకోవడానికి బదులు ప్రభుత్వం వారిని కాపాడుతూ వస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే రుణాల ఎగవేతదారులకు మోడీ పాలన స్వర్గధామంలా కన్పిస్తోంది. బ్యాంక్ సంఘాలు, ఆర్థిక పరిశీలకులు, పౌర సమాజం ఎంత అరచి గీపెట్టినా సరే చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా ఉంటోంది.**

**న్యూఢిల్లీ :** స్వతంత్ర భారత చరిత్రలో బ్యాంకులకు ఇంత పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లిన దాఖలాలు గతంలో లేవు.

ఉద్దేశపూర్వకంగా అప్పు ఎగవేసిన వారిని, మోసం చేసిన వారిని నిషేధ జాబితాలో పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆర్‌బీఐ 2019 జూన్ 7న చిట్టచివరిసారిగా బ్యాంకులకు లేఖలు రాసింది. ఇది సాధారణంగా జరిగే తంతే. ఆర్‌బీఐ కేవలం కాగితం పులిగా మాత్రమే వ్యవహరిస్తోంది. బ్యాంకులను మోసం చేసిన వారు మరింత ధనవంతులుగా మారుతున్నా కేంద్ర బ్యాంక్ పట్టించుకుంటున్న పాపాన పోలేదు. కానీ ఆర్థిక ఇబ్బందులతో రుణాలు సకాలంలో చెల్లించలేకపోతున్న చిన్నకారు రైతులపై,సామాన్య ప్రజలపై మాత్రం ప్రతాపం చూపుతోంది.

**వీరంతా ఎగవేతదారులే**

నీరవ్ మోడీ, మేహుల్ చోక్సీ, నిషాంత్ మోడీ, అమి మోడీ వంటి బడా గుజరాతీ పారిశ్రామికవేత్తలు పంజాబ్ నేషనల్ బ్యాంక్, అనుబంధ సంస్థల నుండి రూ.11,400 కోట్ల రూపాయలు దోచుకున్నా ఎవరూ నోరు మెదపడం లేదు. వీరందరూ ఏదో ఒక సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితులే. ఇక ప్రధానికి సన్నిహితుడైన జతిన్ మెహతా 2014లోనే కుటుంబంతో కలిసి దేశం విడిచి పరారయ్యాడు. ఆయన యాజమాన్యంలోని విన్‌సమ్ డైమండ్స్ సంస్థ బ్యాంకులకు రూ.7000 కోట్లు ఎగవేసింది. గుజరాత్‌కే చెందిన ఫార్మా కంపెనీ స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్ సైతం రూ.8,100 కోట్లు ఎగనామం పెట్టింది. వీరందరూ మోడీతో తమకున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకొని బ్యాంకులకు టోకరా వేశారు. పర్యటనల సమయంలో మోడీతో కలిసి ఫొటోలు దిగి అవసరం వచ్చినప్పుడల్లా వాటిని బయటకు తీస్తూ ...7లో

### అంతా ప్రజల సొమ్మే

మోడీ హయాంలో బ్యాంకులకు బకాయిలు కొండలా పెరిగి రూ.67.66 లక్షల కోట్లకు చేరాయి. వీటిలో ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందినవి రూ.54.33 లక్షల కోట్లు కాగా మిగిలినవి ప్రైవేటు, విదేశీ బ్యాంకులవి. వీటిలో ఇప్పటికే రూ.12.10 లక్షల కోట్లను పారు బకాయిలుగా ప్రకటించి రద్దు చేశారు. మోడీ పాలనలో గాలికి కొట్టుకుపోయిన ఈ పారు బకాయిల మొత్తం ప్రపంచంలోనే గరిష్టం! ఇదంతా ప్రజల పొదుపు సొమ్మే. ప్రభుత్వం అప్పుడప్పుడూ బ్యాంకులకు కొంత పెట్టుబడి పెడుతూ, ఈ నష్టాన్ని పూడుస్తూ ఉంటుంది.

అయితే ఆ డబ్బు ఎక్కడిది? మనం పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మే కదా. అంటే చివరికి నష్టపోయేది ప్రజలే. బ్యాంకు లావాదేవీలలో జవాబుదారీతనం వచ్చే వరకూ ప్రజల సొమ్మును ఇలాంటి పెద్దలు స్వాహా చేస్తూనే ఉంటారు. చట్టానికి చిక్కకుండా విదేశాలకు పలాయనం చిత్తగిస్తూనే ఉంటారు. పాలకుల అండదండలు ఉన్నంతవరకూ వీరి ఆటలు ఇలా సాగుతూనే ఉంటాయి.

# జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మనోళ్లే

## హైదరాబాద్ జోన్‌కు చెందిన వావిలాల చిద్విలాస్ రెడ్డికి మొదటి స్థానం



- రెండో ర్యాంకూ మనదే
- టాప్-10లో ఆరుగురు తెలుగువారే..!

వివరాలు 7లో..





# అమృత్‌కాల్ అంటే ఇదేనా..?

## పీఎస్‌యూల్లో రెండు లక్షల ఉద్యోగాలు మాయం

- ఇది ఏ రకమైన ప్రగతి అవుతుంది?
- ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరణ చేసే కుట్ర కాదా? : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** దేశంలోని నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి నిప్పులు చెరిగారు. ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూలు) నుంచి రెండు లక్షల ఉద్యోగాలను తొలగించడం ఏ రకమైన ప్రగతి అవుతుందని ప్రశ్నించారు. దేశంలో ఉద్యోగాలు తగ్గిపోవడం దేనికి ...8లో

## అన్నదాత



నాగళ్లను గొర్రు కొయ్యలను
దువ్వెన్లుగా చేసి
నేలతల్లి కురులు నేర్పుగా దువ్వుతాడు
ఆకుపచ్చని అంకురాల రిబ్బన్లతో
అందంగా జుట్టేస్తాడు
ఆతడో గొప్ప అలంకారికుడే
పరిచయం చేయాలనుకుంటే....

**ఆ పసి హృదయానికి**

**లాలపోసే పనిని**
**మేఘాలకు అప్పగించి**
**జోల పాడే గొంతవ్వమని**
**పక్షులను ఆదేశించి**
**అక్కడక్కడే తిరుగుతూ**
**అన్నీ పర్యవేక్షిస్తుంటాడు**
**తానో గొప్ప సంగీత విద్వాంసుడే**
**గుంభనంగా గుర్తు చేయాలనుకుంటే....**

మట్టి తల్లి
పంటపొలాలను తివాచీలుగా పరిచి

అతన్ని ఆహ్వానిస్తే
గాలి తనంతట తానుగావచ్చి

సంగీత కచేరి నిర్వహించి
మనోల్లాసం కలిగిస్తుంది
ఆతడే మా అతిథేయుడని
చాటుకోడానికి

**అప్పడే నిద్ర లేచి**
**దొండపండోలె నిగనిగలాడుతూ**
**ఉదయగిరి మీద నిలబడి**
**నిట్టూర్పు విడుస్తూనే**
**పంటపొలాలపై వాలి**
**బంగారు పూతపూసే పనిలో పడ్డాడు**

**లోకమంతా**
**తన రాకకోసం ఎదురుచూస్తే...**
**అతని కోసం ఎదురుచూసే**
**లోకబాంధవుడు**
**ఇంతకంటే గొప్ప ఏముంటుందని?**
**చెప్పకోడానికి**

తాను పెంచుకున్న తరువు నీడలో
దేహాన్ని మట్టిపెడ్డల మంచానికి
కట్టబెట్టి
మధ్యాహ్న వేళ మగత నిద్రకు పిలుపునిస్తే

చెమట పూలు పూసిన చొక్కాను
జెండాచేసి చెట్టుమీద ఎగరేస్తాడు

**అతడు కొత్తగా పరిచయం**
**చేయనక్కర్లేని ఊరి పాట**
**మట్టినే నమ్ముకుని నిలబడ్డ**
**పరిమళాల పూదోట**
**ఎంత పాతదైనా...**
**తియ్యగా పలకరించే పద్యం**
**ఎంత దూరమైనా...**
**ఆప్యాయతలకు అసలైన అర్థం**

**పల్లె తల్లికి అతడంటే ప్రాణం**
నగరాన్ని నడిపించే చేయూత
ఆతడే మన అన్నదాత
అతడికోసం...
ఎన్ని యాగాలు చేసినా
ఎన్ని త్యాగాలు చేసినా
ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా
ఎన్ని కావ్యాలు సృజియించినా
తక్కువే
అతడంటే అందరికీ మక్కువే

**- కమలేశ్, 9160396596**



## అభావం

ప్రతిరాత్రి...
కిటికీఅద్దం, వంతెనపై వెలుతురు బెజ్జాల
పిల్లంగోవిలా సాగిపోయే,
ఇస్మాయిల్ కవి రైలును చూపుతూ హాయిని పంచేది.

ఇవాళ మెరుపుల కత్తిలా..
సరాసరి నా గుండెల్లోకే దూసుకొస్తున్నది.

ఆ ఘటనను తలచుకుంటేనే..
రాస్తున్న కవితావాక్యం
గీత దాటి వక్రమార్గంలో
అక్షరాలు ఒకదానిపై ఒకటిపడి దొర్లుతూ
నుజ్జునుజ్జయి పోయి
అభావంగా అర్థరహితమై
మిగిలిపోయిన వికృత భావన.

నీకేం..? విశ్వగురుత్వాకర్షణ సిద్ధయోగివి.
ఎప్పటిలా.. ఎక్కడ ఉన్నా..
వందేభారత రైలుగీత మాలపిస్తూనే ఉంటావు.

మళ్లిమళ్లీ బుల్లెట్ రైలు వేగంతో
దూసుకు రావడమే పరమావధిగా,
ప్రైవేటు పక్షాలతో ఎగురుతూ..
పై వైపు చూపులతో నిరీక్షిస్తూనే ఉంటావు.

చేతుల కంటిన నెత్తురును
లక్షల కరెన్సీ నోట్లతో తుడిచేసుకుని,
యథావిధిగా..
అసమర్థతకు ముసుగు కప్పి,
అనుకూలపు ఫైల్స్ సృష్టికై
మంత్ర రాజదండం తిప్పుతునే ఉంటావు.

ఆగిన గుండెల ఆఖరు స్పందనలు,
అడ్రసు లేని శవాలు,
బతికి చచ్చినవాళ్ల భయంకరమైన భవిష్యత్తు,
ఆఖరి పోరులోను ఓడిన ఆకలి వలసలు,
చెదిరిన గూళ్లు, చెల్లాచెదురైన బతుకులు..
ఎలా అని..? ఎందుకని..?
ఇవేవీ నీకు పట్టవు.


ఎప్పటి మాదిరిగానే
ప్రైవేటును స్వాగతిస్తూ
పచ్చ జెండా పుచ్చుకు ఊపుతూ ఉంటావు.
నిన్నూ.., నీ తీరునూ.. అడ్డుకునేందుకనే
సామాన్య డిపుడు
ఎర్ర జెండాతో సిద్ధమౌతున్నాడు.

**- మడిపల్లి రాజ్‌కుమార్, 9949 699 215**




# రచయితల అడుగు
# పాఠకుల జాడ తెలిసిన ఆడెపు లక్ష్మీపతి

**- డా. సంగిశెట్టి శ్రీనివాస్**



**తెలుగులో నాన్ అకడెమిక్ విమర్శకులు అరుదు. అధ్యయన, అధ్యాపనాల్లో ఉన్నటువంటి ఆచార్యులు తమ వృత్తిలో భాగంగా భిన్న ప్రక్రియలను, వస్తు, అంశాలను, భావజాలాలను, ఉద్యమాలను, సాహితీ సిద్ధాంతాలను పరిశీలిస్తూ, సమన్వయం చేస్తూ సంక్లిష్టమైన పాఠ్య పఠనాన్ని, పాఠ్యాంశాన్ని సుబోధకంగా మారుస్తూ ఉంటారు. పాఠకులకు, రచయితలకు మధ్యన విమర్శకులు అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తారు. ఇది వారి వృత్తి, జీవనోపాధి కాబట్టి తెలుగు సాహిత్య సమాజం గౌరవించింది. కె.వి.రమణారెడ్డి మొదలు కె.కె.ఆర్ వరకు ఈ కోవలోని వారే! అదే నాన్ అకడమిషీయన్లు విమర్శారంగంలో చేసిన కృషి అంతే గొప్పదైనా పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఈ కొరతను కొంతమేరకైనా 'దిక్చక్రం' సాహిత్య వ్యాసాల రచయిత ఆడెపు లక్ష్మీపతికి తెలంగాణ సారస్వత పరిషత్తు 'ఉత్తమ విమర్శా గ్రంథ అవార్డు' ప్రకటించింది. విద్యా రంగంతో సంబంధం లేని వారు సైతం మంచి విమర్శ రాస్తారని గుర్తించింది. తెలుగు సాహితీ ప్రపంచం అనేక పూర్వనిర్ధారిత అభిప్రాయాలతో, స్వీయ పరిధి, పరిమితి విధించుకున్న ప్రస్తుత సందర్భంలో ఈ అవార్డు ప్రకటన ఒక మేలైన మలుపు. కొత్త తొవ్వలు సైతం లక్ష్యం వైపు నడిపిస్తాయని చెప్పే భరోసా. అవార్డు రావడానికి సాహిత్యేతర అంశాలు గాకుండా రచనే ప్రధానమని కూడా 'దిక్చక్రం' నిరూపించింది.**

పాశ్చాత్య సాహిత్యాన్ని, ముఖ్యంగా ఉద్యమ స్ఫూర్తిని, నిత్య జీవిత ఘర్షణలను భిన్న కోణాల్లో, ఆర్తితో ఆవిష్కరించే లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసిన ఆడెపు లక్ష్మీపతి వాటి వెలుగులో తెలుగు సాహిత్యాన్ని అందులోనూ ప్రధానంగా కథా సాహిత్యాన్ని విమర్శించిండు. తన దైన ముద్రతో, హేతు బద్ధతతో, కార్య-కారక సంబంధాల లోచూపుతో ఏది మంచి సాహిత్యం, ఎందుకు మంచిది? లేదంటే ఎందుకు మంచిది కాదు అని తన అనుభవైక అధ్యయనంతో నిగ్గు తేలిన విషయాలను నిష్కర్షగా చర్చించిండు. శషబిషలకు తావు లేకుండా తేల్చి చెప్పిండు. తెలంగాణ తడిగల ఆత్మతో విషయ విశ్లేషణ చేసిండు. ఖాళీలు పూరించే విధంగా ఇంకా చెప్పాలంటే కొత్తది నేర్చుకునే విధంగా విమర్శ రాసిండు. స్వతహాగా కథకుడు కాబట్టి రచనలో వాక్య నిర్మాణం పెద్దన్న బుద్ధి చెబుతున్నట్టే ఉంటుంది గానీ, గిల్లి, తొడపాశం పెట్టినట్టుగా ఉండదు. విమర్శ చేయడం అదీ నిక్కచ్చిగా చెప్పడమంటే ఇవ్వాళ సాహితీ లోకం నుంచి శత్రుత్వాన్ని ఆహ్వానించడమే! అయినా దేనికీ వెరవకుండా తాను పాశ్చత్య సాహిత్యం, విమర్శ అధ్యయనం ద్వారా నేర్చుకున్న విషయాలను తనదైన జ్ఞానాన్ని జోడించి తెలుగు పాఠకులకు అందించిండు. అత్యంత అవసరమైన కొత్త తరానికి సాహిత్య విమర్శనాస్త్రాలను కొయిసగ చేసి అందించిండు.




50 ఏండ్లుగా సాహితీ రంగంలో ఉన్నాడు. తనదైన ముద్ర ఉన్న 'త్రిభుజపు నాలుగో కోణం' (2023) కథా సంపుటాన్ని వెలువరించాడు. 1997లో 'నాలుగు దృశ్యాలు' కథా సంపుటిని వెలువరిం చిన నాటి నుంచి కథకుడిగా తెలుగు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్టుడు. అయితే ఆయన గత 25 ఏండ్లుగా అడపాదడపా విమర్శ రాస్తూ ఉన్నప్పటికీ అవన్నీ ఒక్క దగ్గర పోగు పడక పోవడంతో ఆ రంగంలో ఆయన చేసిన కృషి సరిగ్గా రికార్డు కాలేదు. న్యాయంగానే రికార్డు కాని విషయాలకు పెద్దగా విలువ ఉండదు. ఎంత గొప్ప విమర్శకుడైనా తన వ్యాసాలు పుస్తకంగా వెలువరించనట్లయితే ఆయన గురించి సాహితీ లోకానికి ఒక కచ్చితమైన అంచనా ఉండదు. ఆడెపు లక్ష్మీపతి మేలైన విమర్శకుడు కూడా అని నిరూపిస్తూ ఇప్పుడీ 48 వ్యాసాల 'దిక్చక్రం' వెలువడింది. విమర్శకుడిగా ఆయన స్థానం గురించి లెక్కగట్టేందుకు ఇదొక కొలమానంగా పనికి వస్తుంది.

లక్ష్మీపతి సీరియస్గా కథలు రాయడం ఆరంభించింది 1990ల్లో, విమర్శపై మక్కువ పెంచుకున్నది 1997 తర్వాత. ఏక కాలంలో సృజనాత్మక సాహిత్యం, విమర్శా రంగంలో రాణించడం చాలా కష్టసాధ్యమైన పని. అందుకే ఈయన గత రెండు దశాబ్దాల కాలంలో కేవలం మూడు కథలు మాత్రమే రాసిండు. కథా సాహిత్యపు లోటుని కొంతమేరకు ఈ విమర్శ ద్వారా తీర్చుకున్నడు అని చెప్పవచ్చు.

కవిత్వం, కథ, నవల, వాదాలు, తాత్విక ధోరణులపై రాసిన 48 వ్యాసాలు ఇందులో ఉన్నాయి. స్వయంగా కథకుడు కాబట్టి కథా సాహిత్యంపైనే ఇందులో ఎక్కువ వ్యాసాలు న్నాయి. కథా సాహిత్యంపై 21 వ్యాసాలున్నాయి. ఇందులో ఆయన చేసిన కొన్ని నిర్ధారణలు పాఠ్యపుస్తకాల్లోకి ఎక్కాల్సిన అవసరమున్నది. "దళిత వెనుకబడిన కులాల నుంచి, వివిధ వృత్తివర్గాల నుంచి కవులు రచయితలు రంగ ప్రవేశం చేయడంతో సాహిత్యంలో విస్తృతి పెరిగి రచనల్లో వస్తు వైవిధ్యానికి ఆస్కారం ఏర్పడింది". "తెలంగాణ భాష పట్ల అంతటా చిన్న చూపు, తెలంగాణ కథకులను నిరుత్సాహ పరిచే పత్రికలు, ఇతర మీడియాలు; తెలంగాణ కథలకు సరైన నిష్పత్తిలో ప్రాతినిధ్యం కల్పించని విశ్వ విద్యాలయాలు, ప్రచురణ సంస్థలు, ఇతర సాహితీ వేదికల సంకలనాలు.. ఈ వివక్షను నిరసిస్తూ కవులూ, రచయితలు భాషాసంస్కృతులపై కోస్తాంధ్రుల పెత్తనాన్ని ప్రశ్నించారు". "అనుభవం, అనుశీలనం స్పందించే గుణానికి కారణాలైతే, అధ్యయనం సమాజ గమన సూత్రాలను విశ్లేషిం చుకోవడానికి తోడ్పడుతుంది" అంటూ తెలంగాణ ఆత్మీయ తను అద్దుతూ రాసిన ఆణిముత్యాల్లాంటి మాటలు ప్రతి వ్యాసంలోనూ కండ్ల మందట కదలాడుతాయి. మెదక్ జిల్లా కథా సంకలనంకు రాసిన ముందుమాట ఇక్కడ సాహిత్య సృజనను నిర్మొహమాటంగా లెక్కగట్టిండు. ఎలాంటి కాంప్లెక్సులకు లోనుగాకుండా, ఇమేజి భ్రమలకు గురికాకుండా సాపేక్షికంగా రాసిండు. తెలంగాణ ఉద్యమం ఊపుమీదున్న దశలో ఇట్లా నిర్మమకారంగా రాయడమంటే కత్తిమీద సాము లాంటిది. స్థితప్రజ్ఞతకు గుర్తు. ఉద్వేగానికి గురికాకుండా ఉన్నది ఉన్నట్టు, కొత్తది నేర్చుకోవాలని చెప్పే విధంగా రాయడం, అట్లా రాసి కూడా గౌరవాన్ని నిలబెట్టుకోవడం అరుదైన విషయం. ఈ గౌరవాన్ని సాధించడంలో ఆడెపు లక్ష్మీపతి కృతకృత్యుడయ్యాడు. ఉప్పల నరసింహం కథా సంపుటి 'మట్టి మనిషి'కి ముందు మాట రాస్తూ 'అంతా సవ్యంగానే ఉన్నది' అనుకునే వాళ్ళు సాహితీ సృజన చేయలేరు అని తేల్చి చెప్పిండు. 2008లో వచ్చిన కథా సాహిత్యాన్ని విహంగ వీక్షణం చేస్తూ ఏది మంచి కథ అంటే "చదివించే, ఆలోచింప చేసే, పాఠకుని అవగాహనకు కొత్త విస్తృతి యివ్వగలిగేదే" అని అభిప్రాయపడ్డాడు. కథా (కాల్పనిక) రచనకు సంబంధించి జర్మన్ నాటక విమర్శకుడు గుస్తావ్ ఫ్రీటాగ్ వివరించిన ఆరు దశలను రేఖా రూపంలో చిత్రిస్తూ వాటిని తెలుగు కథానిక రచనకు అన్వయిస్తూ చేసిన విమర్శ ఆయన తాత్విక, విశ్లేషణ, వివేచనకు నిదర్శనం. దీన్ని శీలా వీర్రాజు కథలకు అన్వయిస్తూ చెప్పాడు. అట్లాగే పులికంటి కృష్ణారెడ్డి కథలను సైతం కూలంకషంగా విశ్లేషించిండు. పాత తరమే కాదు కొత్త తరానికి చెందిన వారి రచనలను 'ఈతరం'లో ఎందరో కథానాయకులు, సమకాలీన తెలుగు కథ ప్రయోగాలు (2000-2010), తెలంగాణ కథ ఒక పరిశీలన, కూరాడు కథా సంకలనంపై విలువైన విమర్శ రాసిండు. కూరాడు కథల గురించి రాస్తూ "దేశ బహుళత్వానికి మత-భాష-ప్రాంతీయ భిన్నత్వానికి, ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన సెక్యులరిజం ఇవాళ ప్రమాదపుటంచుల్లో పడింది. ప్రజలు ఏమి తినాలో, ఏమి వినాలో, ఏమి తాగాలో, ఏమి పలకాలో, ఏమి చూడాలో అన్నింటిని కాషాయ సిద్ధాంతం శాసిస్తున్నది" అని తాను ఎటువైపు నిలబడి మాట్లాడుతున్నాడో తేల్చి చెప్పిండు. అంటే మాట్లాడితే చాలు ప్రమాదంలో పడతావు, రాస్తే ఇంకా ఎక్కువ ముప్పు ఉంటుంది అని తెలిసి కూడా తాను చెప్పదలుచుకున్నదేదో శషభిషలు లేకుండా కుండ బద్దలు కొట్టినట్లు రాసిండు. తాను రాసిన నిక్కచ్చి విషయాలనే జీవితంలోనూ ఆచరిస్తూ ఉన్నాడు. ఆచరించడమే కాదు సృజనాత్మక సాహిత్యంలోకి వాటిని తీసుకొచ్చిండు. అందుకు ఆయన రాసిన 'ముసల్దాని ముల్లె' కథ నిదర్శనం. ఇందులో ముసల్దాని ముల్లె మీద సైతం విమర్శ వ్యాసమున్నది. అట్లాగే కొట్టం రామకృష్ణారెడ్డి 'నూనె సుక్క'కు రాసిన ముందుమాట, అయోధ్యరెడ్డి కథా సంపుటి 'అక్కన్నపేట రైల్వేస్టేషన్' ఆవిష్కరణ సభలో చేసిన ప్రసంగ పాఠం కూడా తెలంగాణ కథల్లోని తడిని ఆవిష్కరించాయి.

**కవిత్వం, కథ, నవల, వాదాలు, తాత్విక ధోరణులపై రాసిన 48 వ్యాసాలు ఇందులో ఉన్నాయి. స్వయంగా కథకుడు కాబట్టి కథా సాహిత్యంపైనే ఇందులో ఎక్కువ వ్యాసాలు న్నాయి. కథా సాహిత్యంపై 21 వ్యాసాలున్నాయి. ఇందులో ఆయన చేసిన కొన్ని నిర్ధారణలు పాఠ్యపుస్తకాల్లోకి ఎక్కాల్సిన అవసరమున్నది.**




ఇవే గాకుండా ఏనుగు నరసింహారెడ్డి 'మూల మలుపు', బాణాల శ్రీనివాసరావు 'కుంపటి', సిద్ధార్థ 'బొమ్మలబాయి' కవితా సంపుటాలపై ఒక అంచనా ఉన్నది. కకావికలవుతున్న పల్లె సంబంధాలు, వృత్తి జీవితాలు, తెలంగాణ బతుకు వెతలు ఇందులో విశ్లేషించాడు. అట్లాగే నవలా సాహిత్యంపై కూడా తనదైన ముద్రతో విమర్శ రాసిండు. ఇందులో జ్వాలాముఖి 'వేలాడిన మందారం', నవీన్ 'అంప శయ్య', సలీం 'పడగనీడ', 2017 తానా అవార్డు పొందిన నవలలకు నిర్ణేతగా ఉన్నాడు. అందుకే నీల, శప్తభూమి, ఒంటరి నవలల గురించి విశ్లేషించిండు. పాతతరం నవల భాస్కరభట్ల కృష్ణా రావు రాసిన 'వెల్లువలో పూచిక పుల్లలు' గురించి కూడా రాసిండు. తెలంగాణ నవల-శిల్పంపై మరో వ్యాసం ఉన్నది. ఈ వ్యాసంలో నవలా ప్రక్రియపై కూలంకషంగా చర్చించారు.

వీటన్నింటితో పాటు తాత్విక ధోరణిలో కాఫ్కా లాటిన్ అమెరికన్ రచయితలపైనా మాజిక్ రియలిజం, సైన్స్ ఫిక్షన్ మరికొన్ని పాశ్చాత్య నవలలపై విశ్లేషణ అందించాడు. ఆడెపు లక్ష్మీపతి విమర్శపై పాశ్చాత్య రచనలు, విమర్శకుల ప్రభావం బాగా ఉందని చెప్పుకున్నాము. అయితే వీరి ప్రభావాన్ని, అందులోని భావాల్ని తెలుగులోకి చేసే సందర్భంలో ఇంగ్లీషు పదాలు విస్తృతంగా వాడిండు. ఇవి అందరికీ అంత ఈజీగా అర్థమయితాయని నేననుకోను. వాటికి తెలుగులో సమానార్థాలు ఇవ్వాలంటే ఒక పదంలో గాకుండా పూర్తి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పనిని బ్రాకెట్లలో పూర్తి వివరణ ఇచ్చినట్లయితే బాగుండేది. ఆడెపు లక్ష్మీపతి ఒక స్టాండర్డ్ పాఠకులను దృష్టిలో పెట్టుకొని ఈ రచనలు చేసినట్లు ఉన్నది. అకడెమిక్లో సైతం ఇవ్వాళ పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మాతృభాషలో అర్థమయ్యే విధంగా బోధన చేస్తున్నారు. అట్లాంటిది ఇందులో విరివిగా వాడిన ఇంగ్లీషు పదాలు సులభతరం చేసినట్లయితే ఎక్కువ మంది తెలుగు సాహితీ ప్రియులకు ప్రియంగా ఉండేది. ఏది ఏమైనా తెలుగు పాఠకుల జాడ తెలిసి, సాహిత్యాన్ని పాశ్చాత్య లోచూపు, తనదైన ముద్రతో మన ముందుకు తీసుకొచ్చిన లక్ష్మీపతికి అభినందనలు.

# సంవేదనా భరితం దేవకీదేవి కథలు

**- శిలాలోలిత**




**ఆత్మగౌరవానికి ప్రతీక తిరునగరి దేవకీదేవి. సమాజంలోని దురన్యాయాలను నిర్భయంగా ఎత్తిచూపే మనిషి. మనసులో ఉన్న విషయాన్నే స్పష్టంగా కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పే మనిషి. తనలో ఉన్న నిజాయితీ ఆమె రచనల్లోనూ కన్పిస్తూ ఉంటుంది. రిటైర్ ఐన తర్వాత ఖాళీ సమయాన్ని వృథాగా పోనీక రాయడం చదువడంపై దృష్టి పెట్టారు. జీవనానుభవం జీవితానుభవం కలిసి ఒక పరిణితిని సాధించారు.**

'పిడికిటి ఇసుక' పేరుతో కథా సంపుటిని 2022లో తీసుకొచ్చారు. 'బాధ్యులెవరు' దగ్గరి నుంచి 'కంచె చేను మేస్తే' వరకు మొత్తం ముప్పై కథలున్నాయి. ఇవి బతుకు కథలు. మొత్తం కథల్ని కాకుండా మూడు కథల్ని చర్చించుకుందాం. అవి అక్కసు, గోడదెబ్బ, చెంపదెబ్బ. ఇవి చాలా విలక్షణమైన కథల పేర్లు. ఇద్దరు ఇష్టపడి పెళ్లి తంతు లేకుండా ఒప్పందాల మధ్య దండల మధ్య కలిసి బతుకడం మొదలుపెట్టిన క్రమంలో సమాజం పెద్దగా పట్టించుకోలేదు. వారిది ఆదర్శ వివాహం అన్నంత వరకు వచ్చారు. కానీ భర్త మరణానంతరం మనిషిని కట్లపాములా మతం ఆచారాలు అలవాట్లు మూఢనమ్మకాలు స్వార్థం ఎలా చుట్టుముడుతాయో ఈ కథలలో స్పష్టంగా కనిపిస్తాయి. ఇది ఒకరు, ఇద్దరు వ్యక్తుల కథ కాదు. ఎందరెందరో జీవితాల ప్రతిబింబాలు. అందుకే అక్షరాలు ప్రాణవంతంగా ఉన్నాయి. ఆత్మగౌరవ ప్రతీకగా నడుచుకున్న ఆ స్త్రీ జీవితంలో వచ్చిన పరిణామ సామాహారమే ఇదంతా.



'అక్కసు' కథలో ఉక్రోషాలు ఏ స్థాయికి వెళ్లగలవో స్పష్టంగా చెప్పారు. దగ్గర బంధువులలో సహితం వ్యతిరేకత. కర్మకాండలు జరుపకపోతే వారి వారి కుటుంబాలకు నష్టం వాటిల్లగలదనే నమ్మకాలతో ఇష్టం వచ్చినట్లుగా మాటల్ని కుమ్మరించారు. భర్త చనిపోయిన తర్వాత స్త్రీకి 'పునిస్త్రీ' గుర్తులుగా చెప్పబడే గుర్తులను తొలగించే నీచత్వాలను ప్రతిఘటిస్తూ ఆమె కొడుకు పోరాడుతూనే ఉంటాడు. మా అమ్మకు అలాంటివేమి చేయడం లేదు. "నాన్న అవయవాలను ఆయన ఇష్టప్రకారమే దానం చేసాం. నాన్న మంచి ఆలోచనలు మనమందరం మరొకసారి మననం చేసుకోవడంతో పాటు అవయవదానం గురించి చెప్పడానికే మిమ్మల్నందరిని పిలిచాం. నాన్న మీద గౌరవముంటే తిని వెళ్ళండి. అది మీ ఇష్టం" అని రేపటి తరం పిల్లవాడి మాటలు విని అంతా నిశ్శబ్దమై పోతారప్పుడు. వాళ్ళను మాటలతో కన్విన్స్ చేయడానికి చాలా సమయమే పట్టింది. మనుషులు మారారనుకుంటాం ప్రోగ్రెసివ్ అనుకుంటాం. కానీ మరింత వెనక్కి వెనక్కి పోతున్నారు. ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు మూఢ నమ్మకాలలో కూరుకు పోతున్నారనిపిస్తోంది.

ఇక గోడదెబ్బ కథ చాలా హృదయ విదారకంగా నడుస్తుంది. ఐసీయూలో ఒక ప్రాణి పోరాడుతున్న దయనీయ స్థితిని భరించలేక కునారిల్లి పోయిన మానసిక ఘర్షణను కన్నీళ్ళొలికే విధంగా రాసారు. తన చెలికాడు కనిపించడన్న నిజాన్ని విషంలా మింగుతూనే, అతనికి విముక్తి కలగాలని కోరుకోవడం వెనక ఆమె దుఃఖం ఎవర్నైనా కరిగిస్తుంది. ఇన్నాళ్ళు సమాజం, వ్యక్తులు, న్యాయం, పేదలు, చదువు కోసం తపన పడుతూ ఎన్నో పోరాటాలు చేసిన వ్యక్తి ఈనాడిలా పెనుగు లాడడం ఆమె చూడలేకపోతుంది. వెంటిలేటర్ తీస్తే అతను లేడు. అతను లేకపోతే ఆమె సగం మనిషి. అతను కోరుకు న్నట్లుగానే ఊరి మెడికల్ కాలేజీకి 'మనిషి' గా కాక పార్థివ దేహంగా డొనేట్ చేయడంతో కథ ముగుస్తుంది.




**భర్త చనిపోయిన తర్వాత సమాజం ఎలా ఆమె పట్ల చిన్న చూపు చూస్తుంది. ఆచారాలు ఎట్లా రుద్దడానికి ప్రయత్నిస్తుంది అనేది అక్కసు కథలో చూసాం కదా! ఇప్పుడు అతని మర ణానంతరం ఆమె జీవితంలో రాబోతున్న మార్పులు చెప్పినవే చెంపదెబ్బ**

భర్త చనిపోయిన తర్వాత సమాజం ఎలా ఆమె పట్ల చిన్న చూపు చూస్తుంది. ఆచారాలు ఎట్లా రుద్దడానికి ప్రయత్నిస్తుంది అనేది అక్కసు కథలో చూసాం కదా! ఇప్పుడు అతని మర ణానంతరం ఆమె జీవితం లో రాబోతున్న మార్పులు చెప్పినవే చెంపదెబ్బ ఒకటి, రెండు, మూడులు.

పక్కింటి అమ్మమ్మ మనవడిని ఆమె దగ్గరికి పంపి 'ఈ రోజు మంచిరోజో కాదో తెలుసుకొని రమ్మంది. మిమ్మల్ని పలకరిస్తుందట' అని అడిగినపుడు ఆమెకు ఎంత కోపం వస్తుందో? (విధవకు ఈ పదాన్ని వాడడం నేనింక పడను) భర్త చనిపోయిన వారికి బట్టలు పెట్టడం ఆనవాయితీ సరే కాని పునీత స్త్రీలు (భర్తలున్న స్త్రీలు) పెట్టకూడదట. వాళ్ళ భర్తలతో పెట్టిస్తారట. ఎవరు చెప్పారివన్నీ? ఇది ఆ స్త్రీని అవమానించడం కాదా? కకావికలమైన మనసుతో ఐనా సరే ఆమె ఆత్మగౌరవాన్ని మాత్రం కోల్పోలేదు. ఓటములన్నిటినీ ఎదుర్కొంది. రక్త మాంసాలున్న మనిషిగా నిలబడింది. తన సహచరుడిపై ఉన్న అపారమైన ప్రేమ, గౌరవం ఆమెను ఒక దీపశిఖను చేసింది. చెప్పాలంటే ఆయన కూడా ఆమెను సమాజంలో ఒక మనిషిగానే చూస్తాడు. కథ చివరలో "నాకు మాత్రం నా ఆత్మగౌరవం నాదిగా కొనసాగడం ఒక లక్ష్యసాధన మరి.." అనడంతో ఈ కథ ముగుస్తుంది. అక్కడ మన ఆలోచన మొదలౌతుంది. చాలా మారిందనుకుంటున్న సమాజం పైపైన మాత్రమేనన్న వాస్తవాన్ని అంగీకరించాల్సిందే. ఆమెలా స్థిర చిత్తంగా నిలబడాల్సిందే. తాను నిలబడటమే కాక ఎందరెంద రికో చైతన్యాన్ని కలిగించడమనేది ఈ కథల వల్ల సాధ్యమైంది. అందుకుగాను ఈ రచయిత్రికి వినయపూర్వక అభినందనలు.

"పిడికిటి ఇసుక" పేరుతో ఒక మంచి పుస్తకాన్ని తిరునగరి దేవకీదేవి రాశారు. మీరూ చదవండి. ఆలోచించండి. చేతనైనంత మార్పును ఆకాంక్షించండి. అవరోధాలుగా మిగలొద్దు.. పాఠకుల్లో నిజాయితీని పెంచడానికి దోహదపడే కథలివన్నీ

## సాహితీ వార్తలు

### 25 న 'క్రియ ఒక జీవన లయ' ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి డా. ఎన్. గోపి రచించిన కవితా సంపుటి 'క్రియ ఒక జీవన లయ' ఆవిష్కరణ ఈ నెల 25న ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు)లో నిర్వహించనున్నారు. డా. వోలేటి పార్వతీశం అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్ర మూర్తి పుస్తకావిష్కరణ చేస్తారు. కిల్లాడ సత్యనారాయణ (IPS) కృతిని స్వీకరిస్తారు. డా. మామిడి హరికృష్ణ, వంగల హర్షవర్ధన్, డా. ఎస్. రఘు, కుడికాల వంశీధర్ పాల్గొంటారు.

### జాతీయస్థాయి కథల పోటీ

మలిశెట్టి సీతారామ్ స్మారకార్థం నిర్వహిస్తున్న ఎమ్మెస్సార్ సాహితీ పురస్కారం 2023 జాతీయ స్థాయి కథల పోటీని నిర్వహిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5,000/, రూ3,000/-, రూ.2,000/- అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు జూలై 15లోగా పలమనేరు బాలాజీ, పలమనేరు రచయితల సంఘం, 6/219 గుడియాత్తం రోడ్, పలమనేరు, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 517408 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు యుగంధర్ - 93947 82540, శాస్త్రి - 88857 62720 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

### 25న మైసూరులో శ్రీశ్రీ కళావేదిక 'తెలుగు- కన్నడ కవితాగోష్టి'

శ్రీశ్రీ కళావేదిక కర్ణాటక రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జూన్ 25 న కర్ణాటక రాష్ట్రం రాచనగరి మైసూరులోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ హాల్ నందు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు తెలుగు - కన్నడ కవితా గోష్టి నిర్వహిస్తున్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ప్రభాశాస్త్రి నిర్వహణలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ హాజరు కానున్నారు. సుమారు 120 మంది కవులు, సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తెలుగు - కన్నడ సాహిత్యం, సంస్కృతి, సాంప్రదాయాలు, భాషా పరిరక్షణ అనే అంశాలపై సదస్సు, జాతీయస్థాయి శత కవిసమ్మేళనం జరగనుంది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవ అధ్యక్షులు ఇంద్రకుమార్ రాజు దుబాయి నుండి ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు నిర్వాహకులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### 21, 22లలో జాగృతి సాహిత్య సభలు

జూన్ 21 22 తేదీలలో భారత జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సాహిత్య సభలు సారస్వత పరిషత్‌లో జరగనున్నాయి. 21వ తేదీ ఉదయం 10 నుంచి 22వ తేదీ సాయంత్రం వరకు ఈ సభలు కొనసాగుతాయి. ఈ సభలకు గోరేటి వెంకన్న, నందిని సిద్ధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఏనుగు నరసింహారెడ్డి, అనిశెట్టి రజిత, గోగు శ్యామల, తుమ్మేటి, దేవకీదేవి తిరునగరి మొదలైన వాళ్ళు అతిథులుగా పాల్గొంటారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, వడ్డేపల్లి కృష్ణ, సంగనభట్ల నరసయ్య, నిత్యానందరావు, సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండ శ్రీధర్ తదితరులు పత్ర సమర్పణలు చేస్తారని డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### వాకాటీ పాండురంగారావుపై రచనలకు ఆహ్వానం

బహుముఖ ప్రజ్ఞాశాలి వాకాటి పాండురంగారావు ప్రతిభాపాండిత్యాలను, సృజనాత్మక కళానైపుణ్యాలను, వ్యక్తిత్వ సౌశీల్యాలను వెల్లడి చేసేట్టు ఒక విశేష సంకలనాన్ని వెలువరించాలనుకుంటున్నాం. ఇదివరకే వెలువడిన ఇతరుల లేదా మీ రచనలు పంపడం, సూచించడంతో పాటు కొత్తగా రాసి కూడా పంపవచ్చు. ఆయన కథలు, వ్యాసాలు, సంపాదకీయాలు, నవలలు, కవితలు, గేయాలు, ప్రసంగాలు, ముందుమాటలలో మీకు బాగా నచ్చినవేమిటో కూడా సూచించవచ్చు. ఆసక్తి కలిగిన వారు ఆగస్ట్ 15లోగా వాకాటి పి.ఆర్., 208, ఫిఫ్త్ ఫ్లోర్, లుంబినీ రాక్ కాస్టల్ అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 4, బంజారాహిల్స్, హైదరాబాద్ - 03 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు మెయిల్ ఐడి : vakati.pr@gmail.com, 8790007042 నంబరు నందు సంప్రదించవచ్చు.




అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం 19 జూన్ 2023




## టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీగా నంబూరు

**నవ తెలంగాణ-మధిర**

ఉపాధ్యాయులు, సీనియర్ న్యాయవాది, మధిర మజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సిరిపుర గ్రామస్తుడు నంబూరు జనార్దన్ తెలంగాణ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాక్షలు తెలిపినారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ కనబరిచిన సాధం రామకృష్ణ

**నవ తెలంగాణ-మధిర**

జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో మాటూరు పేటకు చెందిన సాదం రామకృష్ణ ఆల్ ఇండియా బీసీ కేటగిరిలో 477 ర్యాంక్ సాధించారు. ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 2734 ర్యాంక్ సాధించాడు.



## అవుట్ సోర్సింగ్ అటెండర్స్, వాచ్ మెన్స్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

**నవతెలంగాణ-గాంధీ చౌక్**

ఖమ్మం పత్తి యార్డ్ నందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అవుట్‌సోర్సింగ్ అటెండర్స్, వాచ్మెన్ ఉద్యోగుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన బాడీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టి కిరణ్ కుమార్, టీఎన్జీవోస్ కల్లూరు యూనిట్ అధ్యక్షులు ఎండి వజీరిద్దిన్, టీఎన్జీవోస్ జిల్లా కోశాధికారి ఎండి హిమాయత్ హుస్సేన్, రాష్ట్ర సెక్యూరిటీ గార్డ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రాము, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ముస్తాక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా సెక్యూరిటీ గార్డ్స్ జిల్లా అధ్యక్షులు ఎండి మహమూద్, జిల్లా కార్యదర్శి బి నాగేశ్వరరావు, జిల్లా సెక్యూరిటీ గార్డ్స్ ఉపాధ్యక్షులు ఆర్ కన్నయ్య పాల్గొన్నారు.

**నూతన కమిటీ**

సంఘం అధ్యక్షునిగా కేయం నరసింహస్వామి (చిన్న) ఖమ్మం, ప్రధాన కార్యదర్శి ఎం డి ఆసిఫ్ ఖాన్ ఖమ్మం, కోశాధికారి రవి భద్రాచలం, ఉపాధ్యక్షులుగా నరసింహారావు ఏన్కూరు, ఉపాధ్యక్షులు 2 నాగేశ్వరరావు దమ్మపేట, సహాయ కార్యదర్శి 1 ఆర్ నాగరాజు నేలకొండపల్లి, సహాయ కార్యదర్శి 2 మధు ఇల్లందు, గౌరవ అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు ఖమ్మం, గౌరవ సలహాదారులు జీడి ఉపేందర్ ఖమ్మం, ఈసీ మెంబర్స్ సిహెచ్ ఉమా ఖమ్మం, పద్మ మద్దులపల్లి, సురేష్ చర్ల, వెంకటేశ్వర్లు కొత్తగూడెం, సుబ్బారావు బూర్గంపాడు ఎన్నికయ్యారు.

## వృద్ధులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ

**నవతెలంగాణ ఖమ్మం**

అమ్మల దినోత్సవం.. నాన్నల పండుగ ఇలాంటి వేడుక ఏదైనా సరే.. వారి కండ్లల్లో ఆనందం చూడటానికి ఆమె ముందుకొస్తుంది. కడుపులో పుట్టిన పిల్లలు కర్కశంగా మారి ఆ తల్లిదండ్రులను అనాథలుగా మారిస్తే సత్య మార్గం యూత్ సర్వీస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ శ్రీలక్ష్మి మాత్రం ఆ అనాథ వృద్ధులకు దుస్తులు, స్వీట్లు అందజేస్తూ వారి అభిమానం చూరగొంటోంది. గడిచిన 20 సంవత్సరాలుగా ఖమ్మం నగరంలో ఆమె నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఫాదర్స్ డే వేడుకను పురస్కరించుకుని ఖమ్మంలోని భవాని వృద్ధాశ్రమంలో ప్రతి సంవత్సరంలాగానే ఈ ఏడాది కూడా అక్కడున్న అనాథ వృద్ధులకు (మగవారికి) దుస్తులు, మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాచర్ల నగేష్, సాయి, మౌనిక, మంజుల, రాధిక, ట్రెజరర్ నగేష్ పాల్గొన్నారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

**నవ తెలంగాణ-ఖమ్మం రూరల్**

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తనగంపాడులో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తనగంపాడు గ్రామానికి చెందిన నంద్యాల సైదులు (46) గొర్రెలను మేపుకుంటూ సమీపంలోని చెరువు పక్కనే ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లి కాళ్లు, చేతులు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

## డాక్టర్ దయానంద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలు కుటుంబాలు

**నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్**

మున్సిపాలిటీలోని రాజీవ్ నగర్‌లో పలు కుటుంబాలు కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ విజయకుమార్, డాక్టర్ రాగమయి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా దయానంద్ రాగమయి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో నచ్చి రాజీవ్ కాలనీలో 160 కుటుంబాలు చేరటం చాలా సంతోషంగా వుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీ, పేద వర్గాల ప్రజలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ నున్నా రామకృష్ణ, సహకార సంఘం సొసైటీ ఉపాధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, ఫయాజ్ మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, కమల్ పాషా, షరీపుద్దీన్ పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా.. ఐదుగురికి గాయాలు

**నవతెలంగాణ -కూసుమంచి**



మండలంలోని నాయకన్ గూడెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై కెవిఆర్ ట్రావెల్స్ బస్సు ఆదివారం అదుపుతప్పి బోల్తాపడింది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఇందులో. ఐదుగురికి గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళ్ళుతున్న బస్సు అదుపు తప్పి బోల్తా పడిపోయిందని తెలిపారు. గాయాల పాలైన ప్రయాణికులను ఖమ్మం హాస్పిటల్ కు తరలించారు.

## రాయపట్నంలో మంచి నీళ్ల పండుగ

**నవ తెలంగాణ-మధిర**

మండలంలోని రాయపట్నంలో మంచి నీళ్ల పండుగ ఘనంగా నిర్వహించారు. జిల్లా జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాల్లో అత్యుత్తమవంతమైన మంచినీటి పథకం గొప్ప విషయం అన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నంద్రు సుశీల, మండల కమిటీ పార్టీ అధ్యక్షులు రావూరు శీను, పాల్గొన్నారు.

## వడదెబ్బకు యువకుడి మృతి

**కారేపల్లి :** వడదెబ్బకు యువకుడు మృతి చెందిన ఘటన ఉసిరికాయలపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అవివాహితుడు గుంపెన్న ప్రభాకర్ (35) శనివారం గ్రామంలో వ్యవసాయ కూలీ పనికి వెళ్ళాడు. సాయంత్ర వడ దెబ్బ తగిలి నిరసంతో వాంతులు చేసుకున్నాడు. ఆదివారం తీవ్రమైన జ్వరం, వాంతులు కావటంతో అతనిని ఇల్లందు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు.

## నేడు గ్రీవెన్స్ రద్దు

**ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం (గ్రీవెన్స్ డే)ను నేడు రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల నిర్వహణ నేపథ్యంలో అధికారులు వారికి కేటాయించిన విధులలో పాల్గొనాల్సి ఉందని పేర్కొన్నారు. కావునా జూన్ 19న సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం (గ్రీవెన్స్ డే) రద్దు చేసినట్లు వివరించారు.

## ఐలూ రాష్ట్ర అధ్యక్షుడిగా కొల్లి సత్యనారాయణ

**నవతెలంగాణ-ఖమ్మం లీగల్**



జూన్ 17, 18వ తేదీల్లో యాద్రాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన ఐలు రాష్ట్ర మూడో మహాసభలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కే.పార్థసారధి ఎన్నికయ్యారు. ఈ మహాసభలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మహా సభలో న్యాయ వాదులు ప్రతినిధులు న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేశారని ఐలు ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు నల్లమల నవీన్ చైతన్య, చింతనిప్పు వెంకట్‌లు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా మీసాల వెంకటేశ్వర్లు, మందడపు శ్రీనివాసరావు, ఏడునూతుల శ్రీనివాసరావు, నల్లమల నవీన్ చైతన్య, చింతనిప్పు వెంకట్, రామాలక్ష్మిలు ఎన్నికైనారు.

# ‘సుడా’ చక్కని అభివృద్ధి

- స్తంబాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి మూడేళ్లు
- మంత్రి అజయ్ సహకారంతో శరవేగంగా ప్రగతి
- 'నవతెలంగాణ'తో చైర్మన్ బచ్చు విజయ్ కుమార్

**నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:**

తెలంగాణలో అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న నగరాల్లో ఖమ్మం ఒకటి. నగర అభివృద్ధి నమూనాను ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు పరిశీలించి.. ప్రశంసించారు. పట్టణ ప్రగతిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు నగర స్వరూపాన్నే మార్చాయి. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కృషితో నగరాభివృద్ధికి దండిగా నిధులు వస్తుండగా... ఖమ్మం సుడా ఓ వైపు ఆదాయాన్ని సమకూర్చుకుంటూ మరో వైపు దశలవారీగా మంజూరవుతున్న నిధులతో అభివద్ధి పథంలో నడుస్తుందని చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ తెలిపారు. 15 మందితో సుడా మొదటి పాలకవర్గం ఏర్పడి మూడేళ్ల పూర్తయిన సందర్భంగా 'నవతెలంగాణ'తో మాట్లాడారు.

**రూ.వేల కోట్లతో అభివృద్ధి..**

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో మంత్రి అజయ్ రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేయించి ఖమ్మం నగర రూపురేఖలు మార్చి వేశారు. ఖమ్మం నగరం దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా అభివద్ధి చెందుతున్నది. రాబోయే 20 ఏళ్లలో సుడా పరిధిలోని జనాభా 20 లక్షలకు చేరుకుంటుందని అంచనాతో విద్యా,వైద్యం, రవాణా అవసరాలను దష్టిలో పెట్టుకొని సమగ్రాభివద్ధి లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నారు. ఇప్పటికే రూ. వేలకోట్లతో పనులు పూర్తి కాగా పలు పనులు కొనసాగుతున్నాయి. సుడా పరిధిలోని గ్రామాల



అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు చేపట్టాం. రోడ్లు, డ్రెయిన్లు, లైటింగ్, బృహత్ ప్రకతి వనం తదితర కార్యక్రమాలకు రూ.43.97 కోట్లు వెచ్చించి నిర్దేశించిన విధంగా 90% పనులు పూర్తి చేశాం. సెంట్రల్ డివైడర్లు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణం చేసి గ్రామ స్వరూపాలు మార్చాం. వి. వెంకటాయపాలెంలోనూ రూ.2 కోట్లతో నిధులు మంజూరు చేసి సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డివైడర్ ను నిర్మించాం.

**సుడా ఏర్పాటు ఆవశ్యకత...**

రాష్ట్రంలోని పట్టణాలతో పాటు వాటి సమీప గ్రామాల్లో ప్రణాళికాబద్ధ అభివృద్ధి కోసం పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యే నాటికి తెలంగాణలో కేవలం రెండు పట్టణాభివద్ధి సంస్థలు మాత్రమే ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 10కి చేరింది. దేశంలో అత్యంత వేగంగా పట్టణీకరణ జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందున్నది. రానున్న కొన్ని సంవత్సరాల్లో సగం మంది తెలంగాణ ప్రజలు పట్టణాల్లోనే ఉంటారన్న అంచనాల



నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 8 పట్టణాభివద్ధి సంస్థలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాకు స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) ఖమ్మం కార్పొరేషన్ తో పాటు సమీప 46 గ్రామాలను తీసుకొని అక్టోబర్ 24, 2017న ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

**సుడా విధుల్లో ప్రధానమైనవి..**

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు చెరువులు, నాలాలు, కుంటలు, వాగులు, నదులు, ఉపనదులను పరిరక్షించడం సుడా ప్రధాన బాధ్యత. పట్టణాలు, గ్రామాల్లో స్థలాలను వెంచర్లుగా వేసి విక్రయిస్తున్నారు. ప్రతి ప్రాంతంలో కనీసం వెయ్యి ఎకరాల భూమిని వెంచర్లుగా వేసి కాలనీలు, వాణిజ్య భవన సముదాయాలకు అనువుగా అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక సదుపాయాలు కల్పనలోనే కాదు రియల్ వ్యాపార రంగంలోనూ సుడా ప్రగతి పథంలో సాగుతున్నది. సుడా ఏర్పడక ముందు 10 ఏళ్లలో లే అవుట్ల ద్వారా స్థానిక సంస్థలకు గిఫ్ట్ చేసిన ఓపెన్ స్పేస్, గ్రీన్ బెల్ట్ స్థలాల వైశాల్యం 21.26 ఎకరాలు ఉంటే సుడా ఏర్పడిన 3 ఏళ్లలో స్థలాల వైశాల్యం సుమారు 100



ఎకరాలకు చేరుకుంది. ఇప్పటి వరకు 79 వెంచర్లకు సుడా అనుమతులు మంజూరు చేసింది.

**సుడా పరిధిలోనే తొలి పల్లె ప్రకృతి వనం..**

రఘునాథపాలెంకి మణిహారంగా 14 ఎకరాల సువిశాల స్థలంలో రూ.2 కోట్ల వ్యయంతో సుడా పార్క్, రాష్ట్రంలోనే తొలి బృహత్ పల్లెప్రకృతి వనంను సుడా అధ్వర్యంలో నిర్మించి పర్యాటకంగా అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

**ప్రత్యేక రాష్ట్రంతోనే సాకారం..**

తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టణాలు, నగరాల రూపురేఖలు మారిపోయాయి. గతంలో పురపాలక సంఘాలను పట్టించుకునే వారే కరువు. సీఎం కేసీఆర్ చొరవ, మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్రంలో అనేక నగరాలకు మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేస్తూ పట్టణాభివృద్ధి సంస్థలను సైతం బలోపేతం చేస్తున్నారు. గజిబిజి గందరగోళానికి చెక్ పెడుతూ భవిష్యత్తు ప్రజల అవసరాలను దష్టిలో పెట్టుకుని చక్కని ప్రణాళికలను అందుబాటులోకి తెస్తున్నారు.ద నిధుల లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రాథమ్యాలవారీగా మంత్రి అజయ్ మాతో పనులు చేయిస్తున్నారు.

# నేను ప్రమాదకరంగా ఉన్న జాగ్రత్త ?

- కార్యాలయం గోడలన్నీ పగుళ్లు బిక్కుబిక్కుమంటూ కాలం
- గడుపుతున్న అధికారులు, సిబ్బంది

**నవతెలంగాణ-బోనకల్**

35 ఏళ్ల కిందట నిర్మించిన బోనకల్ మండల పరిషత్ కార్యాలయం ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. బిక్కుబిక్కుమంటూ అధికారులు, కార్యాలయ సిబ్బంది కాలం గడుపుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నారు. నాటి ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మండల వ్యవస్థ ఏర్పాటు చేసినప్పుడు బోనకల్ మండల కేంద్రంలో 26 సెప్టెంబర్ 1987లో బోనకల్ మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్మించారు. ఆనాడు సుమారు ఆరు లక్షల రూపాయల వ్యయంతో ఈ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆనాటి అవసరాల నిమిత్తం కార్యాలయాన్ని నిర్మించారు. మండల పరిషత్తు కార్యాలయానికి మొట్టమొదటి ఎంపీపీగా సిపిఎంకు చెందిన నాగటి కుటుంబరావు వ్యవహరించాడు. 1987 నుంచి మండల ప్రజలకు ఈ కార్యాలయం సేవలు అందిస్తుంది. మండల పరిషత్తు కార్యాలయం నిర్మించిన స్థలం నల్ల రేగడ స్థలం కావటంతో నిర్మించిన కొన్ని సంవత్సరాలకే గోడలు పగుళ్లు ప్రారంభమయ్యాయి. మధ్య మధ్యలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టుకుంటూ వస్తున్నారు. ఒక దశలో కొత్త మండల పరిషత్ కార్యాలయ నిర్మాణానికి జిల్లా స్థాయి అధికారులు ప్రణాళికలు కూడా రూపొందించారు. కానీ మధ్యలో ఏమీ జరిగిందో ఏమో గాని మండల పరిషత్ నూతన నిర్మాణ కార్యాలయం ఆదిలోనే ఆగిపోయింది. తాత్కాలిక మరమ్మతులు చేపడుతూ అందులోనే అధికారులు, సిబ్బంది పరిపాలన సాగిస్తున్నారు. వర్షాలు వచ్చిన సమయంలో కార్యాలయం ఎక్కువ భాగం చెమ్మ దిగుతుంది. దీంతోపాటు అనేక గదుల గోడలు పగుళ్లు ఇచ్చాయి. దీంతో కార్యాలయం దాదాపు ప్రమాదకరంగా మారింది. దీంతో అధికారులు మరో మార్గం లేక అందులోనే విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఎక్కువ భాగం గోడలు పగళ్ళు రావటంతో పాటు చెమ్మ దిగటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకునే దానికంటే ప్రమాదం జరగకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



'మండలాభివృద్ధి కార్యాలయ' పరిస్థితి ఇలాగా ఉంటే ఎలా అని ప్రజా ప్రతినిధులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నేను ముందుగానే జిల్లా ఉన్నతాధికారులకు చెబుతున్నా, నేను ప్రమాదకర స్థితిలో ఉన్నాను. నావల్ల ప్రమాదం జరగకముందే అధికారులు, సిబ్బంది వెంటనే తనను ఖాళీ చేసి సురక్షితమైన భవనంలోకి వెళ్లిపోవాలని మండల పరిషత్ కార్యాలయం హెచ్చరిస్తుంది. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి నూతన మండల పరిషత్ కార్యాలయానికి యుద్ధ ప్రాతిపదిక మీద నిధులు మంజూరు చేసి నిర్మించాలని మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## బోనకల్ గ్రామంలో వడదెబ్బతో వ్యక్తి మృతి

**నవతెలంగాణ-బోనకల్**

బోనకల్ గ్రామానికి చెందిన పారుపల్లి సత్యనారాయణ చారి(65) ఆదివారం వడదెబ్బతో మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గత పది రోజులుగా భానుడు భగభగమంటున్నాడు. దీంతోపాటు ఉదయం 8 గంటల నుంచి తీవ్రమైన వడగాలిపులు వీస్తున్నాయి. ఈ ప్రభావంతో అనేకమంది అస్వస్థతకు గురవుతున్నారు ఈ క్రమంలో పారుపల్లి సత్యనారాయణ చారి తీవ్ర వడదెబ్బకు గురయ్యారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో మండలంలో తొలి వడదెబ్బ మృతి కేసు నమోదు అయింది. మృతదేహాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు రావుట్ల సత్యనారాయణ, పంతంగి శ్రీనివాసరావు, రావుట్ల వెంకటాచారి, సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సంఘ సభ్యులు రావుట్ల కోటా చారి, రావుట్ల లక్ష్మాచారి, రావుట్ల హరి, రావుట్ల శివ తదితరులు ఉన్నారు.

## గీత కార్మికుడి కుటుంబానికి జాగృత్ ట్రస్ట్ చేయూత

**నవతెలంగాణ - బోనకల్**

ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీద నుంచి జారిపడి దుర్మరణం చెందిన గీత కార్మికుడి కుటుంబానికి ఖమ్మం నగరానికి చెందిన జాగృత్ ట్రస్ట్ అండగా నిలిచింది. 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బోనకల్ మండలం ముష్టికుంట్లకు చెందిన బంధం నాగేశ్వరరావు (53) గీత కార్మికుడు పది రోజుల క్రితం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు నుంచి కింద జారిపడ్డాడు. తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం పైగా ఇద్దరు ఆడపిల్లలు సంతానం కావడంతో నాగేశ్వరరావు భార్య రోదన వర్ణాతీతంగా ఉంది. ఆ కుటుంబం పరిస్థితిని తెలుసుకున్న ఖమ్మం నగరానికి చెందిన జాగృత్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కేసగాని రాజశేఖర్ గౌడ్ ఆదివారం ముష్టికుంట్లకు వెళ్లారు. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతిని కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా అండగా ఉంటానని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాజశేఖర్ గౌడ్ తో పాటు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుల తోట రామాంజనేయులు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, భారత రాష్ట్ర సమితి మండల నాయకులు బంధం నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బంధం వెంకట రాజ్యం, ట్రస్ట్ ప్రతినిధులు కేశగాని నరసింహ రావు, తోట నాగకృష్ణ, సంపెట కృష్ణ, గ్రామస్తులు బోయినపల్లి కొండలరావు, అమరేసి సీతయ్య, బంధం వెంకన్న ఉన్నారు.

# సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు వేగినాటి మృతి

- నివాళులర్పించిన తమ్మినేని, పోతినేని పలువురు నాయకులు

**నవతెలంగాణ-ఖమ్మం రూరల్**

మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు, ప్రజా నాట్య మండలి జిల్లా కమిటీ సభ్యుడు వేగినాటి వెంకటేశ్వర్లు (73) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేశ్వర్లు మరణ వార్త తెలిసిన వెంటనే పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్ర దిగ్భ్రాంతికి గురై వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వరరావు, భూక్య వీరభద్రం, వై. విక్రమ్, మాదినేని రమేష్, ఝాన్సీ, బండారు రమేష్, తుమ్మ విష్ణు, యర్రా శ్రీనివాసరావు, మీరా, నవీన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు, సిద్దినేని కోటయ్య, అఫ్రోజ్ సమీనా, ఖయ్యుము, ఆంధ్రా బ్యాంక్ సొసైటీ వైస్ చైర్మన్ తమ్మినేని విజయలక్ష్మి, సీపీఎం మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్,





నాయకులు పి.మోహన్ రావు, పి.సంగయ్య, తమ్మినేని వెంకట్రావు, కమలమ్మ, ఉమ, ఖమ్మం కార్పొరేటర్లు యల్లంపల్లి వెంకట్రావు, బుర్రి వెంకట్ కుమార్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నర్సింహ, సీనియర్ నాయకులు మోటమర్రి జగన్ మోహన్ రావు, ఏఎస్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, నందిగామ కృష్ణ, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు పిట్టల రాంబాబు, జాజుల నాగేశ్వరరావు, తెలంగాణ సాహితీ రాష్ట్ర కన్వీనర్ కే.ఆనందచారి, బి.వి.కే ఇంచార్జ్ వై.శ్రీనివాసరావు, వాసిరెడ్డి వీరభద్రం, మధు విద్యాసంస్థల అధినేత మల్లంపాటి వీరభద్రం, జెవివి నాయకులు అలవాల నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు దోనోజు లక్ష్మయ్య, పాపయ్య, షేక్ రంజాన్, ఖాసీం, ఇతరులు కన్నెకంటి నర్సయ్య జోజి తదితరులు పాల్గొన్నారు.



## మంచినీళ్ల పండగలో ఉత్తమ అవార్డు అందుకున్న 'మర్రి'

**నవతెలంగాణ-బోనకల్**

మండల పరిధిలోనే ఆళ్ళపాడు గ్రామ సర్పంచ్ మర్రి తిరుపతిరావుని ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తనికెళ్లలో జరిగిన మంచినీళ్ల పండుగ 2023 మిషన్ భగీరథ విభాగంలో బోనకల్ మండలంలో అత్యధిక పంపు కనెక్షన్లు ఇచ్చినందుకు, అదేవిధంగా మిషన్ భగీరథ నీటిని నిర్విరామంగా సరఫరా చేస్తున్నందుకు ఆళ్లపాడు సర్పంచ్ మర్రి తిరుపతిరావుని ఉత్తమ అవార్డుకు ఎంపిక చేశారు. ఆళ్ళపాడు గ్రామపంచాయతీని బోనకల్ మండలంలోనే మొదటి స్థానంలో నిలబెట్టిన సర్పంచ్ మర్రి తిరుపతిరావు ను జిల్లా పరిషత్ చైర్ ర్సన్ లింగాల కమల్ రాజు వైర ఎమ్మెల్యే రాముల నాయక్ డిసిసిబి చైర్మన్ కూరకుల నాగభూషణం అదనపు కలెక్టర్ మొగిలి స్నేహలత కొనిజర్ల మండలం తనికెళ్లలో ఉత్తమ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ బోనకల్ మండలంలో ఆళ్లపాడు గ్రామపంచాయతీని మండలంలోనే మొదటి స్థానంలో నిలబెట్టిన సర్పంచ్ మర్రి తిరుపతిరావు కృషిని చొరవని అభినందించి ప్రశంసించారు. ప్రతి ప్రజా ప్రతినిధి గ్రామాభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని అప్పుడే ఇటువంటి అవార్డులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, వివిధ మండలాల ఎంపిపిలు, జేడీపీటీసీలు, సర్పంచ్‌లు మిషన్ భగీరథ ఏఇ ఎర్ర శ్రీనివాసరావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితోనే అవార్డుకు ఎంపిక

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- టీఎస్-బీపాస్ అవార్డు రావడంపై

చైర్మెన్, కమిషనర్‌లను సన్మానించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-సత్తుపల్లి**

భవన నిర్మాణ అనుమతుల్లో తెలంగాణలోనే సత్తుపల్లి మున్సిపాలిటీకి టీఎస్-బీపాస్ అవార్డు రావడం ఇక్కడి పాలకవర్గం, కమిషనర్, సిబ్బంది సమిష్టి కృషితోనే అవార్డు ఎంపికకు కారణమైందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. టీఎస్-బీపాస్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, కమిషనర్ కోడూరు సుజాతను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో గృహాలు నిర్మించుకొనే ప్రజలకు నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన నిర్మాణ మంజూరును చేయడం రాష్ట్రంలోనే సత్తుపల్లి మున్సిపాలిటీ ప్రథమస్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీ మరిన్ని అవార్డులు సాధించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర ఆకాంక్షించారు. చైర్మెన్, కమిషనర్‌లతో పాటు పాలకవర్గ సభ్యులు వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే సండ్ర అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ చాంద్‌పాషా,



దేవరపల్లి ప్రవీణ్, అద్దంకి అనిల్‌కుమార్, నాగుల్‌మీరా, గుంట్రు రాఘవేంద్ర, నాయకులు నడ్డి ఆనందరావు, నరుకుళ్ల శ్రీనివాసరావు, వేములపల్లి మధు, మల్లూరు అంకమరాజు, గఫార్, మేకల నరసింహారావు, అబ్దుల్లా, కంటె అప్పారావు పాల్గొన్నారు.

## జేఈఈలో ఖమ్మం నారాయణ విద్యార్థుల ప్రభంజన

**నవతెలంగాణ-ఖమ్మం**

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన జేఈఈ అడ్వాన్స్ - 2023 పరీక్షా ఫలితాల్లో ఖమ్మం నారాయణ విద్యార్థుల ప్రభంజన సృష్టించారని కళాశాల కోర్ డీన్ వెంకటరెడ్డి, డీన్ పాటి మాధవరావు అన్నారు. విద్యార్థులు ఆల్ ఇండియాలో వివిధ కేటగిరిలలో 283, 354వ ర్యాంకులను సాధించారని తెలిపారు. తక్కువ విద్యార్థులతో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఏకైక విద్యాసంస్థ మన ఖమ్మం నారాయణ అని అన్నారు. గత నెలలో ప్రకటించిన జేఈఈ మెయిన్స్, ఎంసెట్ ఫలితాలలో కూడా ఉత్తమ ర్యాంకులను సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ,ఏజియమ్ సురేష్ బాబు, ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకలు విద్యార్థులను అభినందించారు.

## 5న క్రీడా పాఠశాలకు ఎంపికలు

**నవతెలంగాణ-కల్లూరు**

2023-24 విద్యా సంవత్సరంలో క్రీడా పాఠశాలలో చదువుకోవాలనే విద్యార్థులకు జులై 5న క్రీడా పోటీల ద్వారా ఎంపిక చేయబడుతుందని పీఈటి వీర రాఘవ తెలిపారు. కల్లూరు మండలం నుండి ఈ విద్యా సంవత్సరం ప్రస్తుతం నాలుగో, ఐదో తరగతి, చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ప్రాథమిక అప్పర్ ప్రైమరీ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో చదువుతున్న శక్తి ఉన్న విద్యార్థులను క్రీడా పాఠశాలల ఎంపికలు చెప్పాల్సిందిగా కోరారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు వారి వయస్సు 01/9/2014, నుండి 31/08/2015 ఉండి మూడో తరగతి పూర్తి చేసి ఉండవలెను. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు వారి వయసు 01/09/2013.. నుండి 31/08/2014 ఉండి నాలుగో తరగతి పూర్తి చేసి ఉండవలన్నారు. విద్యార్థులకు ముందుగా మండల స్థాయి పోటీలు జూలై 5వ తారీఖున నిర్వహించబడతాయి ఇక్కడ ఎంపికైనటువంటి విద్యార్థులు జిల్లా స్థాయికి పంపబడతారు. అక్కడ ఎంపికైనటువంటి విద్యార్థులు రాష్ట్రస్థాయికి పంపబడతారు. వీరికి బ్యాటరీ టెస్టు నిర్వహించబడును. బ్యాటరీ టెస్ట్ అనగా 9 రకాల ఆటలతో మిల్లమైన అంశములు. ఈ నిర్వహణ బాధ్యతను కల్లూరు మండల విద్యాశాఖ అలాగే కల్లూరు మండల వ్యాయామ విద్యా విభాగం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడును. దీనికి కన్వీనర్‌గా కల్లూరు మండల విద్యాశాఖ అధికారి దామోదర ప్రసాద్, కో కన్వీనర్‌గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ రమేష్ అలాగే ఎంపికల నిర్వహణ బాధ్యతను కల్లూరు మండల వ్యాయామ దర్శకులు వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించబడును. వివరాలకు పసుపులేటి వీర రాఘవయ్య 9440 669401ను సంప్రదించగలరు.

## ఎస్సీ బాలుర వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తులు

**నవతెలంగాణ-కామేపల్లి**

ఎస్సీ బాలుర వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ముచ్చర్ల వసతి గృహ వార్డెన్ వేణు తెలిపారు. ప్రభుత్వ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహం ముచ్చర్ల, కామేపల్లి మండలం నందు 2023- 24 విద్యా సంవత్సరానికి గాను బాలురకు 70 సీట్లు ఖాళీలు కలవు. 3వ తరగతి నుండి పదవ తరగతి వరకు అడ్మిషన్లు ఇవ్వబడును. ఎస్సీ కులానికి ప్రథమ ప్రాధాన్యత తదుపరి బీసి, ఓసి, కులాల విద్యార్థులకు ఇవ్వబడును. ఉచిత భోజనం, ఉచిత వసతి, ఉచిత విద్య ఈ వసతి గృహం నందు కల్పించబడును. వివరాలకు 94923 09964, 99854 35759 సంప్రదించాలన్నారు.



## మిషన్ భగీరథ దేశానికి ఆదర్శం

### ఎమ్మెల్యే లావుడ్య రాములు నాయక్

**నవతెలంగాణ-వైరా**

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మారు మూల పల్లెకు స్వచ్ఛమైన మంచినీరు అందిస్తున్న మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శం అని వైరా ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం తాగునీటి దినోత్సవాన్ని నిర్వహించారు. వైరా ప్రాజెక్ట్ నుండి "రా" వాటర్ తరలించి కొణిజర్ల మండలం తనికెళ్ళ గ్రామ సమీపంలో లోని ముక్రీ గుట్టపై నిర్మించిన నీటి శుద్ధి ప్రాజెక్టును ఎమ్మెల్యే రాములు నాయక్, జడ్పి చైర్మన్ లింగాల కమల్ రాజు, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం ఇతర ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్లకు కూడా తాగటానికి నీళ్ళు లేని దైన్యం మనం చూశామని, నేడు కెసిఆర్ దార్శనికత అందరికీ మంచినీరు అందిస్తున్నదన్నారు. తన చిన్నతనంలో మంచినీటి కొరత చూశానని, బురద నీరు తాగానన్నారు. ఆరోగ్య తెలంగాణగా మార్చటం ముఖ్యమంత్రి లక్ష్యం అన్నారు. ఆ ప్రయత్నం లో బాగానే మిషన్ భగీరథ అన్నారు. గతం లో ఫ్లోరైడ్ సమస్య వేధించిందని నేడు అది కనుమరుగైందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ స్నేహ లతా మొగిలి, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ అధికారులు, బిఆర్ఎస్ వైరా, కొణిజర్ల మండలాల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, చిరంజీవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### రేపు వాసవి కళ్యాణ మండపం నందు

**నవతెలంగాణ-వైరాటౌన్**



మార్పు స్వచ్ఛంద సంస్థ, వైరా ఆధ్వర్యంలో జిల్లాలోని 350 మంది తలసేమియా బాధిత పిల్లల సహాయం కోసం మంగళవారం స్థానిక వాసవి కళ్యాణ మండపం నందు "రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మోహన్ రావు మాట్లాడుతూ సామాజిక కార్యకర్తలు, రక్త దాతలు స్పందించి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు వాసవి కళ్యాణ మండపానికి వచ్చి రక్త దానం చెయ్యాలని, ఇతరుల ద్వారా చేపించాలని, మానవతా దృక్పథంతో తలసేమియా బాధిత పిల్లలకు తమ సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ

**నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్**



ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) విడుదల చేసిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (అడ్వాన్స్) ఫలితాల్లో బేతపల్లి గంగారం సత్తుపల్లిలోని 15వ బెటాలియన్ పోలీస్ పటాలమ్మలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జే.విజయ్ కుమార్, ఆర్ఎస్ఐ-363 కుమార్తె బిందు ఉత్తమ ప్రదర్శనను కనపరిచి దేశవ్యాప్తంగా 174వ ర్యాంకు సాధించింది. అదేవిధంగా ఇంటర్ నందు 981 మార్కులు, టెన్త్ క్లాస్ 10 / 10 సాధించి జేఈఈ మెయిన్స్ నందు 98% సాధించినందుకు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇల్లూరులో కాంగ్రెస్ పార్టీలో చేరిక

**నవతెలంగాణ-మధిర**

మధిర మండలం ఇల్లూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇల్లూరు గ్రామంలో సొసైటీ డైరెక్టర్ పత్తెపరపు సంగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నారై సైదులు వార్డ్ మెంబర్ షేక్ కాసింబి, షేక్ హుస్సేన్, షేక్ మస్తాన్ బి, షేక్ హుస్సేన్ బి, షేక్ నాగు పటాన్, జాన్ పటాన్, సైదా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి తెలంగాణ రాష్ట్ర సీఎం లీడర్ మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తూమాటి నవీన్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు,బీసీ సెల్ మండల అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య పాల్గొన్నారు.

## టీ- 9 టికెట్స్ పై ప్రయాణికులకు అవగాహన

### మొదటి టికెట్ కొనుగోలు చేపించిన వీబీఓ ఆనంద్

**నవతెలంగాణ-కల్లూరు**

టీఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ ఆదేశాను సారం పల్లె వెలుగు బస్సులలో మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం నుండి ప్రవేశపెట్టిన టీ9 60పై ప్రయాణికులకు కల్లూరు విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు అవగాహన కల్పించారు. ఆదివారం సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజలక్ష్మి ఆదేశానుసారం కల్లూరు బస్టాండ్ లో ప్రయాణికులకు అవగాహన కల్పించి మొదటి టికెట్ ను కల్లూరు నుండి ఖమ్మంకు చంద్రుపట్ల గ్రామానికి చెందిన పి.లీలావతి మొదటి టికెట్‌ను కండక్టర్ కేవి.లక్ష్మి కొనుగోలు చేసి బస్సు నెంబర్ 0268 లో ఖమ్మం ప్రయాణం చేశారు. పల్లె వెలుగు బస్సులలో 60 కిలోమీటర్ల వరకు వంద రూపాయలు చెల్లించి ప్రయాణం చేయవచ్చు. ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం 6 గంటల వరకు ఒక అప్ అండ్ డౌన్ ప్రయాణించవచ్చునని వారు తెలిపారు. ఈ టికెట్ పొందుటకు 12 సంవత్సరాలు దాటిన మహిళలు, 60సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్స్ పొందవచ్చునని అన్నారు. దీనివల్ల ఒక్కొక్కరికి 20 నుండి 40 రూపాయల వరకు ఆదా అవుతుందని తెలిపారు. నిత్యం పల్లె వెలుగు బస్సులలో ప్రయాణించే మహిళా ప్రయాణికులు, సీనియర్ సిటిజన్స్ ఈ టికెట్స్‌ను ఉపయోగించుకోవాలని వీబీవో ఆనంద్ ప్రయాణికులను కోరారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో శ్రీచైతన్య ప్రభంజనం

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**



జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 పరీక్షా ఫలితాలలో ఖమ్మం శ్రీచైతన్య విద్యార్థులు ఆల్ ఇండియా14వ ర్యాంకుతో పాటు 66, 83, 147, 172, 190, 214, 217, 219, 221, 264, 267, 369, 383, 410, 518,533, 602, 603, 703, 752, 779, 962, 984, 9905 506 ర్యాంకులు సాధించారు. విద్యార్థుల మేధస్సుకు అసలైన పరీక్ష అయిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరీతో పాటు వివిధ కేటగిరీలలో 100లోపు, 1000లోపు ఆల్ ఇండియా ర్యాంకుల వరదను సృష్టించారు. ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరీతో పాటు వివిధ కేటగిరీలలో టాప్ ర్యాంకులు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు, 20లోపు 1 ర్యాంకు, 500 లోపు 15, 1000 లోపు 26, 2000 లోపు 42 ర్యాంకులు, 5000 లోపు 66 ర్యాంకులు, 10000లోపు 85 ర్యాంకులు సాధించడం ద్వారా మన ఖమ్మంలో శ్రీ చైతన్య విద్యార్థులు రికార్డును సృష్టించారని శ్రీ చైతన్య యాజమాన్యం తెలిపింది. బి . భరత్ కుమార్ ఆలిండియా 14 ర్యాంకు, జి . విశాల్ ఆలిండియా 66 ర్యాంకు, జి . మాణిప్రకాష్ ఆలిండియా 83 ర్యాంకు, బి . వివేక్ వర్ధన్ ఆలిండియా 147 ర్యాంకు, యం . జగన్ చంద్ర ఆలిండియా 172 ర్యాంకు, కే . ట్వినకలే పర్ణిక ఆలిండియా 190 ర్యాంకు, ఏ . ఇందు ఆలిండియా 214 ర్యాంకు, బి . నరేష్ ఆలిండియా 217 ర్యాంకు, జె . ప్రణీత్ ఆలిండియా 219 ర్యాంకు, కే . శివ గుప్తా ఆలిండియా 221 ర్యాంకు, వి , భాను ప్రసన్న ఆలిండియా 264 ర్యాంకు, టి . హర్షవర్ధన్ ఆలిండియా 267 ర్యాంకు, ఎస్. యం . నాగేంద్ర ఆలిండియా 369 ర్యాంకు, పి . హర్షిత్ ఆలిండియా 383 ర్యాంకు, బి . ప్రవీణ్ ఆలిండియా 410 ర్యాంకు, యం . వంశీ ఆలిండియా 518 ర్యాంకు,యం . అరుణ్ కుమార్ ఆలిండియా 533 ర్యాంకు, బి . ప్రేమిందర్ ఆలిండియా 602 ర్యాంకు, యం . ఉపేంద్ర ఆలిండియా 603, బి . భానుప్రకాష్ ఆలిండియా 703, కే . సాయి వైష్ణవి 752, బి . కే . చక్రవర్తి ఆలిండియా 779 ర్యాంకు, పి.భరత్ చంద్ర ఆలిండియా 830, బి . జగదీశ్ ఆలిండియా 962 ర్యాంకు, బి . పూజిత ఆలిండియా 984, బి . కీర్తన వర్మ ఆలిండియా 990 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. మారుతున్న పరీక్షా విధానాలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే తులనాత్మక విద్యాప్రణాళికతో పాటు రాష్ట్రంలోనే బెస్ట్ అనదగ్గ లెక్చరర్ చే విద్యాబోధనను అందిస్తూ, నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉంచుతూ వారి పెర్ఫార్మన్స్ ను ఎప్పటికప్పుడు సమీక్షించడం వల్లనే తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సూనాయాసంగా సాధించగలిగారని తెలిపారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, కలిసి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అకడమిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక, డి.జి.యమ్. సి.హెచ్, చేతన్ మాథుర్, అకడమిక్ డీన్ ఎన్.ఆర్.యస్.డి వర్మ, ఏజీఎంలు సి.హెచ్. బ్రహ్మం, జి. ప్రకాష్, శ్రీ జి. గోపాలక్రిష్ణ, ప్రిన్సిపాల్స్ మరియు అధ్యాపక బందం కలిసి విజయం సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులను ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.



## జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 'హార్వెస్ట్' కు ఉన్నత శ్రేణి ఫలితాలు

**నవతెలంగాణ-ఖమ్మం**

దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించుటకు, కేంద్ర విద్యాశాఖ వారు ఎన్‌టిఏ వారి ఆధ్వర్యంలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ ఇంజనీరింగ్ ప్రవేశ అర్హత పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి ఉన్నత శ్రేణి ఫలితాలు సాధించినట్లు 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్. పార్వతిరెడ్డి తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను ఇంజనీరింగ్ విద్యనభ్యసించుటకు ప్రవేశ అర్హత పరీక్ష జేఈఈ అడ్వాన్స్ ఈనెల 4న నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో తమ విద్యార్థినీ, విద్యార్థులు వివిధ కేటగిరీలలో ఉత్తమ ర్యాంకులు సాధించామన్నారు. తమ కళాశాల విద్యార్థిని ఎల్.వెన్నెల 548 ఆలిండియా క్యాటగిరీ ర్యాంకు సాధించడం హర్షనీయమన్నారు. బి. సంతోష్ కుమార్ 692 , ఎం.వినయ్ కుమార్ 832 , టి. సౌమ్యశ్రీ 992 , ఎ.భానుప్రకాశ్ 1066 , యు. మోహన్సాయి 1183 , కె.భావన శ్రీ 1000 , ఎ.జస్వంత్ 2441 తనుష్కా పదాని 2967, ఎల్. ప్రహ్లాద్ 3409 కె. నవదీప్ 3424, యు. హర్షదీప్ సాయి 3461, పి.లతాశ్రీ 4021 , వి. దేదీప్య 4662 , జి. రిషిత 7826 , ఎస్. అక్షర 13,489 సెంట్రల్ ర్యాంకు, పి. శివలాస్య 13,873 , ఎం.ప్రీతమ్ గాంధీ 18,216 , టి. చేతన్ తన్మయి 19516 , వి. గాయత్రి కృష్ణ 22,498 సెంట్రల్ ర్యాంకులు సాధించడం జరిగిందని వారు తెలిపారు. ఆదివారం కళాశాల ఆవరణలో 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతిరెడ్డి విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరిలో - 220తో న్యూవిజన్ విజయ ప్రభంజనం

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**



జేఈఈ అడ్వాన్స్‌డ్ - 2023 ఫలితాలలో నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల మరోసారి తమదైన ముద్రను కొనసాగించింది. ఈ ఫలితాలలో ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో జి. నీరజ రెడ్డి 220, బి.రిత్విక్ 340 ర్యాంకుతో ఖమ్మం జిల్లా చరిత్రలో అత్యుత్తమ ర్యాంకులు సాధించటమే కాకుండా తెలంగాణాలో హైదరాబాద్ మినహా ఏ ఇతర జిల్లాలో సాధించని ఘనత కేవలం న్యూవిజన్ కు మాత్రమే సాధ్యం అయినది. కేటగిరిలో 52వ ర్యాంకు, వివిధ కేటగిరిలో 1000 లోపు 20, 5000 లోపు 44 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

అంతేకాకుండా ఎన్‌టిఏ వారు ప్రకటించిన నీట్ ఫలితాలలో 720 మార్కులకు 695 మార్కులతో ఓపెన్ కాటగిరిలో 460వ ర్యాంకులు సాధించారని కళాశాల చైర్మన్ సి. హెచ్.జి.కె. ప్రసాద్ తెలిపారు. వివిధ కేటగిరిలో బి. రిత్విక్ - 52, టి. జాస్మిత - 89.లూథెర్ కింగ్-95, వి.వెంకట సాత్విక్-110, పి.ఉభయంద్ర -192, జి నీరాజ రెడ్డి-220, పి. రాహుల్ - 258, పి . రోహిత్ సాయి అన్వేష్-267, బి. రిత్విక్ -340, ఎం.దేనతేజ -395, బి. ప్రియాంక -106, పి.ప్రమోద్ -414, డి. సాయి శ్రీ రామ్-415, కే. భవ్య -446.బి. ఇందు-473,గణేష్ సాయి - 482,యం .గోకుల్ సాహితీ-513, పి. రోహిత్ -529, పి .బిన్ను -643, బి. జానీత్ -647, జె . చేతన్ -667, ఎల్. లోహిత్ నందు నాయక్ -730, గ్రీత్విక్ -772, బి. జశ్వంత్ సింగ్రాథోడ్-825, ఏ. లిఖిత పవన్ 901,ఏ .రాహుల్ సాల్-1046, జి .విజయ్ భవాని - 1053. పి . వరుణ్ - 1081, టి. వివేక్ - 1204.వి . వెంకట సాత్విక్ -1229 వ ర్యాంకు వంటి ఆలిండియా ర్యాంకులు వివిధ కేటగిరిల నుండి సాధించినట్లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను అందుకు సహకరించిన తల్లిదండ్రులను, అధ్యాపకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అందుకు సహకరించిన తల్లిదండ్రులను న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్.జి.కె. ప్రసాద్, డైరెక్టర్ సి.హెచ్. గోపిచంద్, అకాడమిక్ డైరెక్టర్ సి.హెచ్. కార్తిక్ కలిసి ప్రత్యేకంగా విద్యార్థులను అభినంధించారు. అనంతరం ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు, అధ్యాపక బృందం కలిసి విజయం సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



## జేఈఈ అడ్వాన్స్ 2023 ఫలితాలలో రెజొనెన్స్ ప్రభంజనం

**నవతెలంగాణ-ఖమ్మం**

జేఈఈ అడ్వాన్స్ 2023 ఫలితాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఖమ్మం జిల్లాలోనే అగ్రగామిగా నిలిచారని డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, కె.శ్రీధర్ రావు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐఐటి జేఈఈ విభాగంలో సి.హెచ్. పాంటింగ్ 324, ఎల్. భరత్ కుమార్ 341, రాజేష్ 379, మల్లేష్ 724, అశోక్ 802, ప్రభాస్ 1827, సాయి చరణ్ 1834, లక్ష్మీసాయి 3668 వంటి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించడానికి పటిష్ఠమైన ప్రణాళిక, అనుభజ్ఞులైన అధ్యాపక బృందం, బోధనానుభవం కలిగిన మేనేజ్ మెంట్ ఈ విజయానికి కారణమని తెలిపారు. ఇంటర్ తో పాటే జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, నీట్ వంటి పోటీ పరీక్షలకు తగు శిక్షణ ఇవ్వడం ద్వారా ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. సాధారణ విద్యార్థులతో సైతం అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను, అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ సతీష్, ఎం. భాస్కర్ రెడ్డి అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డ్రైవర్లు, పాదచారులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ ఫెడరేషన్
- అధ్యక్ష కార్యదర్శులు వై. విక్రమ్, జిల్లా. ఉపేందర్

**నవతెలంగాణ-ఖమ్మం**



ఖమ్మం రైల్వే స్టేషన్, వన్ టౌన్ ప్రాంతంలో స్టేషన్ రోడ్‌లో అల్లరి ముకలు గంజాయి, మందు తాగుతూ ప్రతిరోజు సాయంత్రం నుండి ఉదయం దాకా ఆటో డ్రైవర్లు, పాదచారులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) అధ్యక్ష కార్యదర్శులు వై. విక్రమ్, జిల్లా. ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం రైల్వే స్టేషన్, వన్ టౌన్ ప్రాంతంలో స్టేషన్ రోడ్లో వచ్చిపోయే పాదాచారుల దగ్గర డబ్బులు తీసుకోవడం కొట్టడం అలాగే ఆటో డ్రైవర్లను కూడా కొట్టడం నిత్యం జరుగుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేయగా అధికార పార్టీ అనుచరులమని స్టేషన్లోకి ఫోన్లు చేపించి కేసులు లేకుండా చేయడం నిత్యం జరుగుతుందని ఆరోపించారు. అలాగే ఆదివారం ఉదయం ఐదున్నర గంటలకు గంజాయి దాటిన ముగ్గురు యువకులు పాదాచారులను కొట్టి డబ్బులు తీసుకోవడంతో పాటు ఖమ్మం మండలం పడమటి తండాకు చెందిన ధరావత్ రామకృష్ణ విజయవాడ నుండి ఖమ్మం వచ్చి ఇంటికి వెళ్లే క్రమంలో అతనిని కొట్టి అతని దగ్గర 300 రూపాయలు తీసుకోవడే కాకుండా అతనిని కొడుతుండగా ఆపి అడ్డుగా ఉన్నారని జరగమున్నందుకు ఆటో డ్రైవర్ ఎస్‌కె కమల్ పాషా అనే రైల్వే స్టేషన్ డ్రైవర్‌ని కొట్టారని తెలిపారు. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయని, అల్లరి మూకలను రోజు ఇదే పద్ధతిలో చేస్తున్నారని, పోలీసులు దృష్టిపెట్టి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటి కారణం రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న పాన్ షాపులు, టీ షాపులు తెల్లవార్లు తెరిచి ఉండడమేనని పోలీసు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ డ్రైవర్ల బొడ్డు సైదులు, ఎస్.కె నూరుద్దీన్, తురుగంటి వెంకటేశ్వర్లు, తూగంటి నాగేశ్వరావు ఎస్.కె హుస్సేన్ ఉన్నారు.

## బోడేపూడి కళానిలయం వైద్య శిబిరం విజయవంతం

### 96 నెలలుగా వైద్య శిబిరం నిర్వహణ

**నవతెలంగాణ-వైరాటౌన్**

బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ ఆదివారం నిర్వహించే వైద్య శిబిరాన్ని 96వ నెల విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, బోడేపూడి కళానిలయం కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ తీవ్ర వాతావరణ మార్పులు ప్రజల జీవన విధానం తోపాటు ఆరోగ్యంపైన ప్రభావితం చేస్తుందని అన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ పరిశుభ్రమైన మంచి నీరు తాగాలని సూచించారు. ప్రపంచంలో అత్యంత బాధాకరమైన ఆహార సంక్షోభం వచ్చే పరిస్థితి ఉందని నిపుణులు సూచిస్తున్నారని, ఆహార ఉత్పత్తి పైన గుత్తాధిపత్యం కార్పొరేట్ సంస్థలు సాధిస్తే స్వాతంత్ర్యం పూర్వం వచ్చిన కరువు, కాటకాలను మరో సారి భారత దేశం చవిచూడాల్సి ఉంటుందని అన్నారు. వైద్య రంగంలో మరింత ప్రగతి సాధించాల్సి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, మల్లెంపాటి ప్రసాదరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, మాదినేని రజినీ, గుడిమెట్ల మోహనరావు, అనుమోలు రామారావు, కంభంపాటి సత్యనారాయణ, శీలం నారాయణ రెడ్డి, మందడపు నాగేశ్వరరావు, మాదినేని ఉదయ్, కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో కృష్ణవేణి కళాశాల విద్యార్థులు విజయకేతనం

**నవతెలంగాణ-ఖమ్మం**

జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో కృష్ణవేణి కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వర్ రావు, యార్లగడ్డ వెంకటేశ్వరావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ కోర్స్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు జి. విజయ్ - 31, టి.జనేషు - 153, టి.నేహా శ్రీ - 523, బి. కౌశిక్ - 534, డి. విగ్నేష్ - 585, డి. మనోజ్ - 701, బి. యశ్విత - 722, డి. యశ్వంత్ తేజ - 758, సోనే 831, బి.నిశాంత్ - 878, బి.గోపి - 1014, ఎస్. వెంకట సాయి తేజ - 1112, %దీ%. సాత్విక - 1140, కె.శ్రీమాన్ రావు - 1145, బి. చైతన్య - 1199 ర్యాంకులు సాధించారని తెలిపారు. జాతీయ స్థాయి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో అత్యధిక - ర్యాంకులు సాధించిన విద్యార్థులను కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వర్ రావు, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ గుర్రం రామచందర్, ఏవో నిరంజన్ కుమార్ అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా నీళ్ల పండుగ

**నవతెలంగాణ-కామేపల్లి** :కామేపల్లి మండలంలో నీళ్ళపండుగను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాణోత్ సునిత, ఎంపిడిఓ విజయభాస్కర్ రెడ్డి, తహాశీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందించి ప్రజల దహార్తిని తీర్చారు. ఇంట్లోకి నల్లానీరు రావడంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, మిషన్ భగీరథ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





కాత్యా ఇడా కోయెల్హో... గోవాలో పుట్టి పెరిగిన ఈమె 2014లో యూత్ ఒలింపిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన మొదటి, ఏకైక భారతీయ నావికురాలు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనూ పారిస్‌లో జరగబోయే ఒలింపిక్స్‌కు మన దేశం నుండి రెండవ సారి ప్రాతినిధ్యం వహించబోతున్న సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...

# మొదటి మహిళా విండ్‌సర్ఫర్

మెరిసే నీలి సముద్రంలో 11 ఏండ్ల కాత్యా మొదటిసారిగా విండ్‌సర్ఫ్ చేయాలని నిర్ణయించుకుంది. ఆ బోర్డ్‌పై నిలబడినప్పుడు గుండె వేగంగా కొట్టుకోవడంతో పాటు ఆమెలో భయం, ఉత్సాహం కలగలిసి ఉన్నాయి. దృఢమైన ఆత్మ విశ్వాసంతో ఒక స్తంభం లాంటిదాన్ని పట్టుకొని తాను చేరాల్సిన గమ్యంవైపు చూసింది. గాలులతో పోరాడటానికి తన కండరాల బలాన్ని పెంచుకుంది. తన పట్టును బిగించింది. గోవాలో విపరీతమైన ఎండ రోజున సర్ఫింగ్ పట్ల తనకెంత అభిరుచి వుందో నిరూపించుకుంది.

### నీరు నా ఇల్లు

"ఆ క్షణంలో నన్ను నేనూ సముద్రంలో ఓ భాగంగా భావించాను. ఇది నా లక్ష్యాన్ని రూపొందించిన సంతోషకరమైన అనుభవం. నీటిలో నేను సౌకర్యంగా ఉన్నాను. అయితే మొదటిసారి విండ్‌సర్ఫ్ చేసినప్పుడు చాలా భయపడ్డాను. సర్ఫింగ్ ప్రారంభించిన కొత్తలో నాకు దగ్గరగా వచ్చిన జెల్లీ ఫిష్, డాల్ఫిన్‌లను చూసి కొంచెం భయపడ్డాను. అయితే ఇప్పుడు నీరు నా ఇల్లుగా మారింది" అని ఆమె చెప్పారు.

ప్రస్తుతం 23 ఏండ్ల కాత్యా 2014లో యూత్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన మొదటి, ఏకైక భారతీయ నావికురాలు. 2018లో ఆసియా క్రీడల్లో కూడా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. 2022లో థాయిలాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ విండ్‌సర్ఫింగ్ కప్‌లో రెండవ స్థానాన్ని సంపాదించారు. ఈ ఏడాది సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 8 వరకు చైనాలోని హాంగ్‌జౌలో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నారు.

### లోతుగా మునిగిపోతుంది

కాత్యా ఊహతెలిసిన నాటి నుంచి సముద్రాన్ని ప్రేమిస్తూనే ఉంది. ఆమె తండ్రి డొనాల్డ్ కోయెల్హో మూడుసార్లు జాతీయ ఛాంపియన్. అలాగే అన్న డేన్ కోయెల్హో కూడా విండ్‌సర్ఫ్ క్రీడాకారుడు. తండ్రితో పాటు టోర్నమెంట్‌లు, ప్రాక్టీస్ సెషన్‌లకు క్రమం తప్పకుండా హాజరయ్యేది. "ఎగిసి పడుతున్న అలల మధ్య నాన్న అప్రయత్నంగా ప్రయాణించిన విధానం ఆ క్రీడ పట్ల నాలో ఓ కొత్త ఆసక్తిని రేకెత్తించింది" అంటూ ఆమె గుర్తు చేసుకున్నారు. వేసవి సెలవుల్లో విండ్‌సర్ఫింగ్‌ని ఆమె ఎక్కువగా ఆస్వాదించేవారు.

### ప్రతిరోజూ సాహసమే

ప్రతి ప్రదేశానికి దాని సొంత ప్రత్యేకమైన వాతావరణం, నీటి పరిస్థితులు ఉంటాయి. అందువల్ల ఒక అథ్లెట్ తప్పనిసరిగా కొత్త వాతావరణాలకు అను గుణంగా ఉండగలరని ఆమె నొక్కి చెబుతున్నారు. దీని కోసం ఈవెంట్‌కు కొన్ని రోజుల ముందే పోటీ జరిగే ప్రదేశంలో ఆమె ప్రాక్టీస్ చేస్తారు.



"విండ్‌సర్ఫింగ్‌లో అన్ని రోజులు ఒకేలా ఉండవు. ప్రతిరోజూ మనకు సాహసం లాంటిదే. నేను క్రీడలో ఈ థ్రిల్‌ను కచ్చితంగా ఇష్టపడతాను" అంటున్నారు కాత్యా.



### శారీరక పటుత్వం అవసరం

"నా తండ్రిని చూస్తూ పెరిగాను. తర్వాత కాలంలో ఆ అభిరుచినే వృత్తిగా మార్చుకున్నాను. విండ్‌సర్ఫింగ్ ఓ సాహస క్రీడ. సవాలుగా ఉంటుంది. మన చుట్టూ ఉండే పరికరాలను నిర్వహించడానికి చాలా బలం అవసరం. అందుకే ఈ క్రీడకు శారీరక పటుత్వం చాలా అవసరం. వీటితో పాటు వాతావరణం, సముద్ర నీటి పరిస్థితులపై మంచి అవగాహన ఉండాలి. క్రీడలో నైపుణ్యం ఉన్నంత మాత్రాన మనం గెలవేము. నైపుణ్యంతో పాటు మనకు సహకరించే పరికరాలు కూడా చాలా అవసరం" అని ఆమె చెప్పారు.

### సవాళ్లు ఎదుర్కొంది

ఈ క్రీడను కొనసాగించడానికి ఆమె అనేక సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. 2018 ఆసియా క్రీడల సందర్భంగా యూనివర్సల్ జాయింట్ (పరికరంలో ఒక భాగం) విరిగిపోయింది. ఇది ఆమె బోర్డు నుండి పడిపోయింది. ఆ ప్రమాదంలో ఆమె రెండు మోకాళ్లకి తీవ్ర గాయాలయ్యాయి. కోలుకోవడానికి కొంత సమయం పట్టింది. విండ్ ఫాయిలింగ్‌తో వేగంగా వెళ్లడానికి గాలి దిశలో వేగాన్ని పెంచడానికి అథ్లెట్ మరింత కండరాల బరువును పెంచుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు ఆమె. కండరాల బరువును నిర్మించడానికి నిరంతర ప్రయత్నాలు, సమయం అవసరం. ఈ క్రీడలో మహిళల భాగస్వామ్యం లేకపోవడం ఆమెకు మరో సవాలు. దాంతో ఆమె చాలాసార్లు పురుషుల విభాగంలో పాల్గొనవలసి వచ్చింది. అయితే తాను ఆసియా గేమ్స్‌లో పాల్గొనడం వల్ల ఇతర మహిళలు కూడా ఈ క్రీడ పట్ల ఆసక్తి పెరిగే అవకాశం ఉంటుందని ఆమె అంటున్నారు.

### ముందుకు సాగుతోంది

ఆసియా క్రీడలు సమీపిస్తున్న కొద్దీ కాత్యా తన సన్నాహాలు ముమ్మరం చేశారు. కండరాల బలాన్ని పెంపొందించడంపై దృష్టి సారిస్తూ, వ్యాయామానికి, విండ్‌సర్ఫింగ్ ప్రాక్టీస్‌కు రెండు గంటల చొప్పున సమయం కేటాయిస్తున్నారు. గాలి బలంగా వీచే సమయంలో కూడా సర్ఫ్ చేయగల నైపుణ్యం సంపాదించడం తన లక్ష్యంగా పెట్టుకున్నారు. గోవాలో రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి కాత్యా శిక్షణ కోసం ఇటలీ వెళ్లింది. 2024లో పారిస్‌లో జరగబోయే ఒలింపిక్స్‌లో కూడా ఆమె పాల్గొంటున్నారు. ఈ ఛాంపియన్‌షిప్ ఆగస్టు 10 నుంచి 20 వరకు నెదర్లాండ్స్‌లో జరగాల్సి ఉంది. కొత్త సెయిల్ కూడా కొనుగోలు చేశారు. అయితే ఆసియా క్రీడల కోసం రూ. 10 నుంచి 12 లక్షల వరకు ఖర్చయ్యే పరికరాల కొనుగోలు కోసం తనకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. "రాబోయే పోటీలలో నా ప్రదర్శనలతో దేశం గర్వపడేలా చేస్తాను. తద్వారా ఈ క్రీడలో మరింత మంది మహిళలకు అవకాశం కల్పించగలనని నేను ఆశిస్తున్నాను" అంటూ ఆమె తన మాటలు ముగించారు.

## కదలిక తప్పనిసరి...

ప్రస్తుత రోజుల్లో జీవితాలు ఎలా గడుస్తున్నాయో చెప్పనవసరం లేదు. ఉదయం లేచిన దగ్గర నుంచీ, రాత్రి పడుకునే వరకు ఎక్కువ సమయం కూర్చునే వుండాల్సిన పరిస్థితి.. టీవీ ముందరా, కంప్యూటర్ ముందరా, ఇలా కూర్చుని కూర్చుని ఒంట్లో కొవ్వుని పెంచేసుకుంటున్నాం. ఈ కొవ్వును తగ్గించుకోవడానికి వాకింగ్, జాగింగ్ లాంటి వ్యాయామాలు చేద్దామని అనుకోవడమే కానీ రోజువారీ హడావుడిలో చేసేందుకు సమయం కేటాయించుకోలేక పోతున్నాం. ఇటువంటి పరిస్థితికి ఓ పరిష్కారం ఉందంటున్నారు పరిశోధకులు..



కూర్చుని ఉండటమే అలవాటుగా ఉన్న అన్ని వయసుల వారిని కొంత మందిని ఎంపిక చేసుకున్నారు. అందరూ రోజు మొత్తం మీద కనీసం 5 నుంచి 9 గంటలు ఇండ్లలో, కార్యాలయాలల్లో కూర్చునే గడిపేస్తున్నారని అర్థమైంది. ఇలా కూర్చుని ఉండే సమయంలో ఎంతో కొంత మార్పు తీసుకువచ్చే అవకాశం ఉండేమో చూడమని సదరు అభ్యర్థులందరికీ సూచించారు. వారి సూచన మేరకు అభ్యర్థులంతా తమ జీవనశైలిలో చిన్నపాటి మార్పులు చేసే ప్రయత్నం చేశారు. పని మధ్యలో కాస్త లేచి అటూఇటూ తిరుగుతుండటం, మగవారైతే ఇంట్లో చిన్నాచితకా పనులు చేస్తుండటం, పిల్లలతో కాసేపు ఆడుకోవడం లాంటివి ప్రయత్నించారు. ఏడాది తర్వాత వారి జీవితాలని మరోసారి గమనించారు పరిశోధకులు. ఆ సందర్భంగా వారు కూర్చుని ఉండే సమయం అరగంట వరకు తగ్గినట్లు గ్రహించారు.

ఈ పాటి తగ్గుదలతో ఏమంత మార్పు వస్తుంది అనుకోవడం పొరపాటే.. ఈ చిన్న మార్పుతోనే షుగర్ లెవెల్స్ అదుపులోకి రావడం గమనించారు. కాలి కండరాలు కూడా బలంగా మారాయట. గుండెజబ్బు వచ్చే ప్రమాదం కూడా తగ్గినట్లు వెల్లడించారు. అంటే మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజూ పడీపడీ వ్యాయామాలు చేయనవసరం లేదు. ఉన్నంతలోనే కాస్త కాలుని కదిపే ప్రయత్నం చేస్తే చాలా రకాల దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈ పరిశోధన తేటతెల్లం చేసింది.

## ఆరోగ్యానికి పుదీనా

**నేడు ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న సమస్య సరైన జీర్ణక్రియ లేకపోవడం.. తిన్న ఆహారం పూర్తిగా జీర్ణం అవ్వక మలబద్దకం ఏర్పడి అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పుదీనా క్రమం తప్పకుండా వాడితే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పుదీనాను ఏయే పదార్థాలతో ఏ విధంగా ఉపయోగించవచ్చో ఓ సారి తెలుసుకుందామా..!**

- పుదీనా ఆకుల రసంలో అల్లంరసం, కలబంద గుజ్జు, ఏలకులు, దాల్చిన చెక్క కలిపి నూరి ప్రతి రోజూ 2-3 చెంచాలు సేవిస్తూ వుంటే అరుగుదల పెరుగుతుంది.



- జీర్ణకోశ వ్యాధులకి, కడుపు నొప్పికి, పుదీనా గింజలు కొన్ని నమిలి తర్వాత ఒక గ్లాసుడు వేడినీళ్ళు తాగితే ఉపశమనం కలుగుతుందట.
- పుదీనా కషాయం ఎలాంటి జ్వరాన్నైనా తగ్గిస్తుంది. అంతేకాదు ఈ కషాయం వల్ల కామెర్లు, ఛాతిమంట, కడుపులో మంట, మూత్ర సంబంధవ్యాధులు కూడా తగ్గుముఖం పడతాయి.
- పుదీనా, మిరియాలు, ఇంగువ, ఉప్పు, జీలకర్ర, ఎండుద్రాక్ష, ఖర్జూరాలు కలిపి మొత్తం నూరుకుని సేవిస్తే ఉదరసంబంధిత వ్యాధులు నివారణ అవుతాయి. ఆకలి ఎక్కువగా లేని వారు, పుల్లటి తేన్పులతో బాధపడేవారు, కడుపులో గ్యాస్ పేరుకుపోయి ఇబ్బంది పడేవారు కూడా దీన్ని తినవచ్చు.
- గర్భం దాల్చిన మొదటి రోజుల్లో కొంతమంది వాంతులతో బాధపడుతూ ఉంటారు. అలాంటివారు చెంచాడు పుదీనా రసంలో అదే కొలతలో నిమ్మరసం, తేనే కలుపుకుని తాగుతూ ఉంటే వాంతులు, వికారం తగ్గుతాయి.
- నిద్రలేమితో బాధపడేవారు రాత్రి పడుకోవటానికి ముందు ఈ ఆకుల్ని ఒక గ్లాసుడు నీళ్ళల్లో వేసి మూతపెట్టి అరగంట తర్వాత తాగితే మంచి నిద్ర పడుతుంది. మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది.
- అరికాళ్ల మంటలకు పుదీనా ఆకులను మెత్తగా రుబ్బి పేస్టులా చేసుకోవాలి. ఫ్రిజ్‌లో కాసేపు ఉంచిన తరువాత బయటకు తీసి చల్లగా ఉన్నప్పుడు అరికాళ్లకు రాస్తూ ఉంటే మంటలు క్రమంగా తగ్గుముఖం పడతాయి.
- పుదీనా ఆకుల్ని ఎండబెట్టి దానిని టీ పొడిలో కలిపి టీ చేసుకుని తాగితే గొంతునొప్పి తగ్గుతుంది.
- చెవి, ముక్కుల్లో ఏర్పడే ఇన్‌ఫెక్షన్‌కి తాజా పుదీనా ఆకులు కొన్ని చేతితో రసంలా తీసి ఆ రసంలో దూదిని ముంచి ఆ డ్రాప్స్ చెవిలో, ముక్కులో వేస్తూ ఉంటే ఇన్ఫెక్షన్ క్రమంగా తగ్గిపోతుంది.
- నోరు దుర్వాసన వచ్చేవారు పుదీనా ఆకుల్ని ఎండబెట్టి పొడిచేసి అందులో కాస్త ఉప్పు వేసుకుని ఆ పొడితో రోజూ పళ్ళు తోముకుంటే నోటి దుర్వాసన మాయం అవ్వటమే కాదు చిగుళ్ళు కూడా గట్టిపడతాయి.

## బస్సు యాత్రను అడ్డుకునేందుకు ఖాకీ కుట్ర

నవతెలంగాణ - మహబూబాబాద్

మహబూబాబాద్ పోలీసులు మరోసారి దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు గుడిసెలు వేసి పోరాటం చేస్తున్న పేదలపై దమనకాండ సాగించిన పోలీసులు, ఇప్పుడు వారిని పరామర్శించేందుకు వెళ్లినవారిపై కూడా అదే దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. తెలంగాణా ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకత్వం పేదలను పరామర్శించేందుకు ఆదివారం ప్రత్యేక యాత్ర బస్సులో వెళ్తుండగా దానికి బ్రేకులేసేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. ఘటనా స్థలానికి యాత్ర బస్సును వెళ్లకుండా తొలుత పోలీసులు అడ్డుకున్నారు. అయినా వేదిక నాయకులు బస్సు దిగి నడిచి ఘటనా స్థలానికి వెళ్లారు. నాయకులు కొద్దిదూరం వెళ్లగానే రెచ్చిపోయిన పోలీసులు యాత్ర బస్సు డ్రైవర్ సురేష్‌పై చేయి చేసుకున్నారు. బలవంతంగా బస్సును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్‌నూ అరెస్టు చేశారు. ఈ ఘటనను చిత్రీకరించేందుకు ప్రయత్నించిన కెమెరామెన్లపై దాడి చేశారు. సెల్ ఫోన్లు లాక్కున్నారు. విషయం తెలుసుకున్న పేదలు ఒక్కసారిగా పోరాట కేంద్రం నుంచి రోడ్డు మీదకు వచ్చే ప్రయత్నం చేయడం, మరోవైపు అన్ని వైపుల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో పోలీసులు వెనక్కు తగ్గి బస్సును వదిలేశారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లాలోని కోదాడకు బస్సు ప్రయాణమైంది. ఆదివారం మహబూబాబాద్‌లో ప్రజాసంఘాల పోరాట వేదిక బస్సు యాత్రను జెండా ఊపి ప్రారంభించిన 20నిమిషాలకే పై ఘటన జరిగింది. యాత్ర ప్రారంభానికి ముందు మార్కెట్ యార్డు వద్ద ఉన్న స్థలంలో భారీ బహిరంగ సభ జరిగింది. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అందులో మాట్లాడారు. సభ జరుగుతుండగానే సభా ప్రాంగణం పక్కనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పోలీసులకు సకల మర్యాదలు చేశారు. ఈ విషయాన్ని కూడా బహిరంగ సభలో వక్తలు ఎండగట్టారు. బహిరంగ సభ ముగిసి, బస్సు యాత్ర ప్రారంభమైన 20 నిమిషాల అనంతరం పోలీసులు విశ్వరూపం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ వీరయ్య మాట్లాడుతూ.. 'పేదల ఇండ్లస్థలాల కోసం చేపట్టిన తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక బస్సు యాత్రను మహబూబాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. దీనిని ఆపివేయాలని కుట్ర చేశారు. 'బ్రేకులు బస్సులకుంటాయి.. యాత్రకుండవ్.. ఒకవేళ యాత్రను ఆపేందుకు ప్రయత్నిస్తే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. దీనికి పోలీసులదే పూర్తి బాధ్యత' అని అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ప్రోద్బలంతో పేదలపై ఇప్పటికే అనేక సార్లు మహబూబాబాద్ పోలీసులు దాడి చేశారని, వాస్తవానికి పేదల సంక్షేమమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదానికి వ్యతిరేకంగా వీరు పని చేస్తున్నట్టుందని వీరయ్య విమర్శించారు.

## పేదల జోలికొస్తే ఖబడ్దార్

(మొదటిపేజి తరువాయి)

ప్రశ్నించారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు కోసం మహిళలంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలంతా భూపోరాటంలో ఐక్యంగా పాల్గొని ఇండ్ల స్థలాలను సాధించాలన్నారు. మీ పోరాటానికి అండగా ఉంటామని స్పష్టంచేశారు.

**బీజేపీ విధానాలను తిప్పికొడతాం..**

బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య సంఘటన ఏర్పడాల్సిన అవసరముందని బృందా కరత్ అన్నారు. కేంద్రంలో ప్రధాని మోడీ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. మోడీ విధానాలతో దేశంలో లౌకికవాదం ప్రమాదంలో పడిందన్నారు. మోడీ 75 ఏండ్ల స్వాతంత్ర్య ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అమృతోత్సవ్ కార్యక్రమం అంటే ఏమిటో దేశ ప్రజలకు ఎవరికీ తెలియదన్నారు. బీజేపీ పాలనలో పెట్టుబడిదారుని ఒక్కరోజు ఆదాయం రూ.1,216 కోట్లు ఉంటుంటే.. ఒక గిరిజన మహిళకు రోజు కూలీ రూ.250 కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ బీజేపీ నేతలు కొత్త నినాదాన్ని తెచ్చారని, కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ సర్కార్ ఉంటే డబుల్ ఇంజన్ సర్కార్ అని నిర్వచిస్తున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో సీఎం యోగి బుల్డోజర్ పేదల ఛాతిని తొక్కుతూ పోతుందన్నారు.

**ఎర్రజెండా ఊరుకోదు..**

బీజేపీపై పోరాడుతామని సీఎం కేసీఆర్ చెబుతున్నారని, ఇందుకు మన తోడ్పాటు ఉంటుందన్నారు. కాని ఇక్కడ కూడా పేదలపై బుల్డోజర్ నడిపిస్తే ఎర్రజెండా ఊరుకోదన్నారు. ఈ భూపోరాటం విజయవంతమయ్యే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. మహబూబాబాద్‌లో కలెక్టర్ భూపోరాటం చేస్తున్న పేద మహిళలపై దాడులు చేయించారని,వారి ప్రయత్నాలు ఫలించవని, ఎర్రజెండా నేతృత్వంలో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

**మీ అబ్బ సొత్తా..?**

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల నిధులు ఇచ్చినట్టు చెబుతున్నారని, మీ అబ్బ సొత్తు ఇస్తున్నారా అని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచే రాష్ట్రాలకు నిధులను కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. అందులోనూ రాష్ట్రాలకు అన్యాయమే జరుగుతోందని విమర్శించారు. మహబూబాబాద్ పట్టణంలో పోలీసుల దాడిలో గాయపడ్డ మహిళలను బృందాకరత్ పరామర్శించారు. వారు చేస్తున్న పోరాటాన్ని అభినందించారు.

## కబ్జా భూముల్లో ఎర్రజెండాలు పాతుతాం : జి. నాగయ్య

(మొదటిపేజీ తరువాయి)

ఈ భూములను అసైన్డ్ చేసినట్టు అధికారులు ప్రకటించాలని, లేనిపక్షంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కబ్జాదారుల భూముల్లో ఎర్రజెండాలు పాతుతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య హెచ్చరించారు. భూపోరాటం చేస్తున్న సీపీఐ(ఎం)పై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని అధికారులకు హితవు పలికారు. మీ అవినీతిని బయటపెడుతామని హెచ్చరించారు. తప్పుడు రిజిస్ట్రేషన్లతో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని, అధికారులు చర్యలు తీసుకోకపోతే మేమే ఎర్రజెండాలు పాతుతామన్నారు. హన్మకొండ నడిబొడ్డున బాలసముద్రంలో నాటి మంత్రి హయగ్రీవాచారి ఆక్రమించిన 22 ఎకరాలను సీపీఐ(ఎం) 20 ఏండ్లపాటు న్యాయపోరాటం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిందన్నారు. కలెక్టర్‌తో సహా రెవెన్యూ అధికారులు ఆ భూమి ప్రభుత్వానిది కాదని, అయ్యగారిదేనని సాక్ష్యమిచ్చారని గుర్తు చేశారు. ఈ భూమిని కాపాడి ఇచ్చినందుకు నాటి సీపీఐ(ఎం) నగర కార్యదర్శి జి.రాములుకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చిందన్నారు.

## ముంచేశారు

ఘరానా మోసాలకు పాల్పడ్డారు. గుజరాత్ వారే కాదు.. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ యజమాని, లిక్కర్ వ్యాపారి విజయ్ మాల్యా ఎస్‌బీఐ, ఇతర బ్యాంకులను రూ.10,000 కోట్ల మేర మోసం చేశాడు. రిషి కమలేష్ యాజమాన్యంలోని ఏబీజీ షిప్‌యార్డ్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థ బ్యాంకుల నుండి రూ.22,842 కోట్లు కొల్లగొట్టాయి. ఇలాంటి వ్యక్తులు, సంస్థలు ఈ తొమ్మిదేండ్లలో అనేకం.

**పారు బకాయిలు గరిష్టం**

పారు బకాయిలు (ఎన్‌పీఏలు) లేదా మొండి బాకీలు వసూలు చేసుకునేందుకు బ్యాంకులు సంవత్సరాల తరబడి ప్రయత్నాలు చేస్తాయి. అసలుతో పాటు ఎంతో కొంత వడ్డీని వసూలు చేసుకొంటాయి. చివరికి మిగిలిన రుణాన్ని రద్దు చేస్తాయి. బ్యాంకులకు రుణాలు ఎగవేసే వారందరూ నేరచరితులు కారు. కంపెనీలు నష్టాల ఊబిలో కూరుకుపోవడానికి అనేక కారణాలు ఉంటాయి. ప్రపంచంలోని అనేక దేశాలలో పారు బకాయిలు ఒకటి రెండు శాతం మాత్రమే ఉంటాయి. మన దేశంలో మాత్రం ఇవి 2018 మార్చి 31 నాటికి 11.46% మేర ఉన్నాయని ఆర్థిక మంత్రి బాహాటంగానే ప్రకటించారు. గత ఏడు సంవత్సరాలలో పారు బకాయిలు 12.17% గరిష్ట స్థాయికి చేరాయట!

## పోరాటం ఆగదు : ఎస్.వీరయ్య

(మొదటిపేజి తరువాయి)

ఈనెల 27వ తేదీ వరకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 61 భూపోరాట కేంద్రాలలో ఈ జాత తిరుగుతుందన్నారు. 48 వేల మంది పేదలు ఇండ్ల కోసం గుడిసెలు వేసుకొని భూపోరాటంలో పాల్గొంటున్నారన్నారు. మహబూబాబాద్‌లో మహిళలపై దాడులు చేయడంలో భాగంగా పోలీసులు ఇష్టమొచ్చిన చోటా చేతులు వేసే ప్రయత్నం చేశారన్నారు. పోలీసుల కుటుంబాల్లో ఆడోళ్లు లేరా అని ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో 5 వేల ఎకరాలు కబ్జా చేస్తే మీరేం చేశారని పోలీసులు, రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. వరంగల్ జక్కలొద్ది భూ పోరాటం మొదలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భూపోరాటాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం విధించిందన్నారు. జనగామలో భూపోరాటం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టారని, ఆ పోరాటంలో పాల్గొన్నవారంతా ఎస్సీ, ఎస్టీలేనని గుర్తించని పోలీసులకు కనీసం మెడపై తలకాయ ఉన్నట్టు లేదన్నారు. ఇండ్లు సాధించే వరకు ఈ పోరాటం ఆగదన్నారు. అధ్యక్షత వహించిన సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటేసిన వాళ్లకే ఇండ్లు ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో పేదోన్ని పాతాళానికి తొక్కితే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల ఇండ్ల విషయంలో అశ్రద్ధ వహిస్తుందన్నారు. కోటి ఇండ్లు కట్టిస్తామని మంత్రివర్గంలో నిర్ణయించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. సభకు ముందు పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సభలో బస్సు జాత బృందం సభ్యులు టి.సాగర్, ఆర్.వెంకట్రాములు, మల్లు లక్ష్మీ, వంగూరు రాములు, టి.స్కైలాబ్‌బాబు, పైళ్ల ఆశయ్య, కోట రమేష్, రాష్ట్ర నాయకులు డీజీ నర్సింగరావు, పాలడుగు భాస్కర్, మాచర్ల భారతి జిల్లా నేతలు గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, అలువాల వీరయ్య, ఆంగోతు వెంకన్న, సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మనోళ్లే

**న్యూఢిల్లీ :** అత్యంత ప్రతిష్టాత్మక ఐఐటీ ప్రవేశ పరీక్ష జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్ జోన్‌కు చెందిన వావిలాల చిద్విలాస్ రెడ్డి (నాగర్‌కర్నూల్)కి ఈ ఫలితాల్లో మొదటి స్థానం లభించింది. అలాగే, టాప్-10 ర్యాంకుల్లో ఆరుగురు తెలుగు విద్యార్థులే ఉండటం గమనార్హం. మొత్తం 43 వేల మందికి పైగా విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక పరీక్షను క్లియర్ చేశారు. ఫలితాలతో పాటు తుది ఆన్సర్ కీని కూడా ఐఐటీ గువహతి విడుదల చేసింది. ఐఐటీ గువహతి విడుదల చేసిన ఫలితాల ప్రకారం.. ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో చిద్విలాస్‌రెడ్డి 360 మార్కులకు గానూ 341 మార్కులు సాధించాడు. ఇదే హైదరాబాద్ జోన్‌కు చెందిన నాయకంటి భవ్య శ్రీ 298 మార్కులతో బాలికలలో మొదటి స్థానాన్ని పొందారు. ఐఐటీ-జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో రెండు పేపర్లకు గానూ మొత్తం 1,80,372 మంది హాజరు కాగా.. వీరిలో 43,773 మంది అర్హత సాధించారు. వీరిలో బాలురు 36,204 మంది, బాలికలు 7,509 మంది బాలికలు పరీక్షను క్లియర్ చేశారు. ఈ నెల 4న ఈ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా, జాయింట్ సీట్ అలొకేషన్ (జేఓఎస్ఏఏ లేదా జోసా) కౌన్సిలింగ్ సోమవారం (19న) నుంచి ప్రారంభం కానున్నది. పరీక్షలో కటాఫ్ మార్కులు నిర్ణయించి సుమారు 45 వేల మందిని 'జోసా' కౌన్సిలింగ్‌కు అర్హత కల్పిస్తారు.

**టాప్-10లో ఆరుగురు హైదరాబాద్ జోన్ వారే..!**

కాగా, టాప్ పది ర్యాంకుల్లో ఆరుగురు ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచే ఉండటం గమనార్హం. హైదరాబాద్ జోన్‌కు చెందిన రమేష్ సూర్య తేజ రెండో ర్యాంకును సాధించగా, రూర్కీ జోన్‌కు చెందిన రిషి కల్రా మూడో స్థానం పొందారు.

ఆ తర్వాతి ర్యాంకుల్లో రాఘవ్ గోయల్ (రూర్కీ), అడ్డగడ వెంకట శివరామ్ (హైదరాబాద్), ప్రభవ్ ఖండేల్వాల్ (ఢిల్లీ), బిక్కిన అభినవ్ చౌదరీ(హైదరాబాద్), మలేయ్ కెడియా (ఢిల్లీ), నాగిరెడ్డి బాలాజి రెడ్డి(హైదరాబాద్), యన్మంటి పాణి వెంకట మహేందర్ రెడ్డి (హైదరాబాద్) లు వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచారు.

**అర్హత సాధించినవారు హైదరాబాద్ జోన్ నుంచే అధికం**

హైదరాబాద్ జోన్ నుంచే అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో అర్హతను సాధించారు. ఆ తర్వాత ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే జోన్‌లు ఉన్నాయి.

టాప్ 500 మంది అభ్యర్థులలో ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి 174 మంది, ఐఐటీ ఢిల్లీ జోన్ నుంచి 120 మంది, ఐఐటీ బాంబే జోన్ నుంచి 103 మంది ఉన్నారు. మొత్తం 13 మంది విదేశీ విద్యార్థులు పరీక్షలో అర్హత సాధించారు. అలాగే 155 మంది ఓవర్సీస్ సిటిజెన్స్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) అభ్యర్థులు పరీక్షను క్లియర్ చేశారు.

## పేదలపై అక్రమ కేసులు ఎత్తేయాలి...

### మహిళలను వెంటనే విడుదల చేయాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం సాయిబ్‌నగర్‌లో అరెస్టు చేసిన పేదలు, మహిళలను వెంటనే విడుదల చేయాలనీ, వారిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో ఇండ్ల జాగాల కోసం పోరాడుతున్న పేదలపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేయడంతో పాటు వారిని అరెస్టు చేసి అర్ధరాత్రి జైలుకు పంపారని పేర్కొన్నారు. సాయబ్‌నగర్ సర్వే నెం.71లో ఉన్న 26 ఎకరాల ప్రభుత్వ భూమిలో తమకు ఇండ్లస్థలాలు ఇప్పించాలని కోరుతూ తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది పేదలు ఉద్యమిస్తున్నారని తెలిపారు. జానెడు స్థలం కోసం పోరాడుతున్న పేదలపై స్థానిక సీఐ ఆధ్వర్యంలో పోలీసులు లాఠీఛార్జి చేసిప్రజాసంఘాల నేతలు, ఆందోళనకారులను అరెస్టు చేశారని తెలిపారు. వీరిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, సీపీఐ(ఎం) స్థానిక నాయకులు గణేష్ గౌడ్, తొమ్మిది మంది మహిళలతో కలిపి మొత్తం 19మంది ఉన్నారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలోని దళితవాడ మీద పోలీసులు దాడి చేసి, స్థానికులతో పాటు మహిళలను తీవ్రంగా గాయపర్చారని తెలిపారు.. రాజు అనే వ్యక్తి చేయి విరిగి ఆస్పత్రి పాలయ్యాడని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేటు వ్యాపారులు ఆక్రమిస్తుంటే..పట్టించుకోని సర్కారు ఇండ్ల జాగాలు అడుగుతున్న పేదలపై కేసులు పెట్టటమేంటని ప్రశ్నించారు. పేదలపై తప్పుడు కేసులు బనాయించి జైలుపాలు చేయటం అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు.

## అక్షర శిల్పి మోటూరి..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అక్షర శిల్పి, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ దక్షుడు, వర్గశత్రువుపై సైద్ధాంతిక యుద్ధాన్ని ప్రకటించిన మార్క్సిస్టు మేధావి మోటూరి హన్మంతరావు(ఎంహెచ్) జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) కేంద్ర కమిటి సభ్యులు బి. వెంకట్ అన్నారు. మార్క్సిస్టు సిద్ధాంత వేత్తగా, సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, ప్రజాశక్తి ప్రధాన సంపాదకులుగా పనిచేసిన ఎంహెచ్ 22వ వర్ధంతి సభను నవతెలంగాణ కార్యాలయంలో ఆదివారం జనరల్ మేనేజర్ ఎ వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్, నవతెలంగాణ సీజీఎం పి. ప్రభాకర్, ఇన్‌ఛార్జి ఎడిటర్ రాంపల్లి రమేష్, మేనేజర్లు, బోర్డు సభ్యులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి అనేక సందర్భాల్లో స్పష్టమైన మార్క్సిస్టు సిద్ధాంత అవగాహనతో సైద్ధాంతిక భావాజాలాన్ని అందించటంలో ఎంహెచ్ కృషి మరవలేనిదన్నారు. అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెంపొందించటంలో ఆయనకు ఆయనే సాటి అని తెలిపారు. పత్రికలు, పుస్తక ప్రచురణల ద్వారా కార్యకర్తల్లో పత్రిక పట్ల అవగాహన, ఆలోచన, చైతన్యం కల్పించేవారని గుర్తుచేశారు. ఇబ్బందుల్లో, బాధల్లో ఉన్నవారిని ఆదుకోవడం ఆయన సహజ లక్షణంగా ఉండేదని తెలిపారు. ఆదర్శంగా, నిరాడంబరంగా, కమ్యూనిస్టు విలువలతో జీవించారని గుర్తుచేశారు. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, చీలిక తర్వాత కూడా సాహిత్య రంగంలో ఆయన అత్యంత కీలక భూమిక పోషించారని చెప్పారు. ప్రజాశక్తి, విశాలాంధ్ర, జనత, జనశక్తి, అ తర్వాత ప్రజాశక్తికి జీవితకాలం సంపాదకులుగా పనిచేశారన్నారు. ఆయన ఉపన్యాసాలు, సంపాదకీయాలు, శీర్షికలు పాఠకుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపేవని గుర్తుచేశారు. మితవాద అతివాద శక్తుల నుంచేకాక, వర్గశత్రు మూకల నుంచి కూడా పార్టీని కంటికి రెప్పలా కాపాడారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యులుగా ఆయన కృషి నేటి రాజకీయ వేత్తలకు చక్కటి పాఠ్యాంశం అవుతుందని చెప్పారు. ప్రభాకర్ మాట్లాడుతూ మోటూరి జీవితం పత్రికా రంగంతో పెనవేసుకున్నదని గుర్తుచేశారు. దాన్నుంచి ఆయన్ను వేరు చేయలేమని చెప్పారు. చనిపోయేంత వరకూ ప్రజాశక్తి ఎడిటర్‌గా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన సంపాదకీయాల కోసం ఎదురు చూసేవారమంటూ విద్యార్థి నాయకుడిగా ఉన్న కాలాన్ని ప్రభాకర్ గుర్తుచేశారు. 1985 నుంచి ఆయనతో తనకు అనుబంధం ఉందని చెప్పారు. ఆయన స్ఫూర్తిని తీసుకోవటమంటే..ప్రజల దైనందిన ఈతి బాధలను కథనాలు, వ్యాసాలు, సంపాదకీయాల ద్వారా వామపక్ష భావాజాలాన్ని ప్రజలకందించటమేనని చెప్పారు. అదే ఆయనకు నిజమైన నివాళని చెప్పారు. రాంపల్లి రమేష్ మాట్లాడుతూ నవతెలంగాణ పత్రిక ప్రయాణంలో సైతం మోటూరి ప్రభావం ఉందన్నారు. సంక్షోభం సంభవించిన ప్రతి సందర్భంలోనూ ఆయన దిశానిర్దేశం స్ఫూర్తి నింపుతుందని వివరించారు.

నవతెలంగాణ

# మా కాలేజీ మా ఇష్టం...



## దోస్త్‌లో లేని ప్రయివేటు డిగ్రీ కళాశాలల ఇష్టారాజ్యం

- అడ్డగోలుగా ఫీజు దోపిడీ
- నిబంధనలకు యథేచ్ఛగా తూట్లు
- రిజర్వేషన్లు పాటించని వైనం
- అందులో చేరితే ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదు

రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) పరిధిలో లేని ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విశ్వవిద్యాలయం నిర్ణయించినవి కాకుండా సొంతంగా అడ్డగోలుగా ఫీజును ఖరారు చేసి వసూలు చేస్తున్నాయి. విద్యార్థులను దోపిడీ చేస్తున్నాయి. ఇంకోవైపు విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపును మాత్రం పొందుతున్నాయి. కానీ నిబంధనలకు మాత్రం యథేచ్ఛగా తూట్లు పొడుస్తున్నాయి. విశ్వవిద్యాలయం నిర్ణయించిన ఫీజులను వసూలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనం.

**పేద విద్యార్థులకు తీరని అన్యాయం**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీకాం కంప్యూటర్స్ కోర్సుకు భారీగా డిమాండ్ ఉన్నది. ఓయూ పరిధిలో రూ.10,950 వసూలు చేయాలి. దానికి అదనంగా రూ.10 వేలు విద్యార్థుల నుంచి వసూలు చేసుకునేందుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. కానీ దోస్త్ పరిధిలో లేని కాలేజీలు ఎంత ఫీజు వసూలు చేస్తాయన్న దానికి ప్రాతిపదిక లేదు. హైదరాబాద్‌లో ఓ ప్రముఖ ప్రయివేటు డిగ్రీ కాలేజీ బీకాం కంప్యూటర్స్ కోర్సుకు రూ.1.10 లక్షలు వసూలు చేస్తున్నట్టు తెలిపింది. ఇంకోవైపు డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను దోస్త్ ద్వారా ఓ షెడ్యూల్ ప్రకారం చేపడతారు. కానీ దోస్త్ పరిధిలో లేని ప్రయివేటు డిగ్రీ కాలేజీలు ఆ షెడ్యూల్‌ను పాటించకుండా కాలపరిమితి లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నాయి. దీంతో విద్యాసంవత్సరం సజావుగా నడవడం లేదన్న అభిప్రాయం విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి అధికారుల నుంచి వ్యక్తమవుతున్నది. 'మా కాలేజీ మా ఇష్టం' అన్నట్టుగా ఆ కాలేజీలు వ్యవహరిస్తున్నాయి.



2016-17 విద్యాసంవత్సరంలో దోస్త్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో దోస్త్ ద్వారానే ప్రవేశాలు జరుగుతున్నాయి. అయితే మైనార్టీ, గురుకుల డిగ్రీ కాలేజీలకు దోస్త్ నుంచి మినహాయింపు ఉన్నది. కానీ కొన్ని ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు హైకోర్టు అనుమతితో దోస్త్ పరిధిలో చేరకుండానే సొంతంగా ప్రవేశాలు చేపడుతున్నాయి.

**దోస్త్ ద్వారా చేరితేనే ఫీజు రీయింబర్స్‌మెంట్**

దోస్త్ ద్వారా చేరిన విద్యార్థులకే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుంది. వారికే కాలేజీ ఫీజుతోపాటు స్కాలర్‌షిప్ వస్తుంది. దోస్త్ పరిధిలో లేకుండా సొంతంగా ప్రవేశాలు చేపట్టే ప్రయివేటు డిగ్రీ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదు. అంటే ఆ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాదు. అయితే మైనార్టీ, సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలు, గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలు, బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలకు దోస్త్ నుంచి ప్రభుత్వమే మినహాయింపు కల్పించింది. అందుకే వాటిలో చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుంది. 2022-23 విద్యాసంవత్సరంలో దోస్త్ పరిధిలో లేకుండా మైనార్టీ, ప్రయివేటు డిగ్రీ కాలేజీలు కలిపి 63 ఉన్నాయి. వాటిలో 36,817 సీట్లుంటే, 18,421 మంది చేరారు. 64 గురుకుల డిగ్రీ కాలేజీల్లో 15,774 సీట్లకుగాను 8,509 మంది ప్రవేశం పొందారు. ఇంకోవైపు దోస్త్ పరిధిలో లేని ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో ఫీజులూ భారీగా ఉంటాయి. ఆ ఫీజుల మొత్తాన్ని విద్యార్థులే భరించాలి. అంటే డబ్బున్నోళ్లకే ఆ కాలేజీల్లో సీట్లు దొరుకుతాయి. ఆ కాలేజీల్లో చదవాలన్న ఆశ ఉన్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం లేని కారణంగా పేద విద్యార్థులు తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారు. ఇంకోవైపు ఆ కాలేజీల్లో రిజర్వేషన్లు పాటించడం లేదు. మెరిట్ లేకుండానే అడ్మిషన్లు కల్పిస్తున్నారు. కేవలం డబ్బు చెల్లించిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా అన్ని విషయాల్లోనూ ఆ కాలేజీలు నిబంధనలకు తిలోదకాలిస్తున్నాయి. అయితే దోస్త్ పరిధిలో లేని ప్రయివేటు డిగ్రీ కాలేజీలను కట్టడి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగానే కొత్త కోర్సులను మంజూరు చేయడం, సీట్లు పెంచడం వంటి అవకాశాలను కల్పించకూడదని నిర్ణయం తీసుకున్నది.

**దోస్త్ పరిధిలోకి రావాలి : ఆర్ లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మెన్**

రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీలన్నీ దోస్త్ ద్వారానే ప్రవేశాలు చేపట్టాలి. కోర్టు ద్వారా అనుమతి పొందిన కాలేజీలు కూడా దోస్త్ పరిధిలోకి రావాలి. ఇటీవల ఆ కాలేజీ యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించాం. విశ్వవిద్యాలయం నిర్ణయించిన ఫీజు తక్కువగా ఉన్నందునే దోస్త్ పరిధిలో రావడం లేదంటూ మా దృష్టికి తెచ్చాయి. దోస్త్ పరిధిలోకి వస్తే ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తాం. ఇప్పటికే ఓయూ పరిధిలో రూ.10 వేలు విద్యార్థుల నుంచి వసూలు చేసుకునేందుకు అవకాశమిచ్చాం. అవసరమైతే యాజమాన్య కోటా అమలుకు చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలోని విద్యార్థులందరూ అన్ని కాలేజీల్లో సీట్లు పొందే అవకాశముండాలి. దీన్ని ఆ కాలేజీలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

## సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వేగినాటి మృతి

- నివాళులర్పించిన తమ్మినేని, పోతినేని



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఖమ్మం జిల్లా రూరల్ మండలం తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, ప్రజా నాట్య మండలి జిల్లా కమిటీ సభ్యులు వేగినాటి వెంకటేశ్వర్లు (73) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేశ్వర్లు మరణ వార్త తెలిసిన వెంటనే పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు జీవితాంతం ఎర్రజెండా అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. వెంకటేశ్వర్లతో తనకున్న బంధాన్ని, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మృతునికి భార్య సత్యవతి, ఇద్దరు కుమారులున్నారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వరరావు, భూక్య వీరభద్రం, వై. విక్రమ్, మాదినేని రమేష్ తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ఆటంకం కలిగించొద్దు

### హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ భుయాన్

- రాజ్యాంగం న్యాయ వ్యవస్థపై సెమినార్
- ఐలూ మహాసభలు విజయవంతం

భువనగిరి : రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ఆటంకం కలిగించకుండా పరిపాలన కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్వల్ భుయాన్ ఉద్బోధించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఆదివారం రెండవరోజు యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో కొనసాగాయి. ఈ సందర్భంగా 'రాజ్యాంగం న్యాయవ్యవస్థ' అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు రాజ్యాంగం మౌలికసూత్రాలకు లోబడి ఉండాలని విస్తృత ధర్మాసనం వెలువర్చిన తీర్పును, కేశవానంద భారతి కేసులో అంశాలను ప్రత్యేకంగా గుర్తించామన్నారు. దేశంలో అత్యవసర పరిస్థితి సమయంలో ఆనాటి ప్రభుత్వం పౌరులహక్కులను కాల రాసినప్పుడు.. న్యాయ వ్యవస్థ వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రభుత్వాలు తమ వ్యక్తిగత ఎజెండాల కోసం కాలరాసినప్పుడు ఆ హక్కులు కాపాడే బాధ్యతని పౌరులు తీసుకోవాలని కోరారు. పౌరుల హక్కులను రక్షించే విషయంలో న్యాయవాదులు చాలా ప్రముఖమైన పాత్ర వహించాలని కోరారు. ఐలూ లాంటి సంస్థలు ఇలాంటి వాటిల్లో ముందుంటాయని తెలిపారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మెన్ ఏ.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఐలూతో సత్సంబంధాలను కలిగి ఉన్నారని, తన కార్యనిర్వహణలో ఐలు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని వివరించారు. భవిష్యత్‌లో ఐలూ తీసుకునే కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఉన్న ప్రతి న్యాయవాది చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐలూ ఆలిండియా కార్యదర్శి సురేంద్రనాథ్ పాల్గొనగా, మహాసభలకు అధ్యక్షవర్గంగా రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, నాయకులు అనంతల శంకరయ్య, శైలజ వ్యవహరించారు. కాగా, రెండు రోజులుగా నవ తెలంగాణ బుక్ హౌస్ ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనలో ప్రతినిధులు పుస్తకాలు కొనుగోలు చేశారు. మహాసభలకు 400 మంది ప్రతినిధులు హాజరై సభను విజయవంతం చేశారు. మహాసభకు విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికి ఆహ్వాన సంఘం అధ్యక్షులు నాగారం అంజయ్య, ఐలూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మామిడి వెంకరెడ్డి, ఎండీ స్మైల్ అభినందనలు తెలిపారు. మహాసభలో ఆహ్వానసంఘం గౌరవ అధ్యక్షులు కొత్త బుచ్చిరెడ్డి, కార్యదర్శి ఎండీ. ఇస్మాయిల్, ఐలు జిల్లా అధ్యక్షులు మామిడి వెంకటరెడ్డి, నాయకులు నర్సింగ్‌యాదవ్, కేశవరెడ్డి, కుక్కదూగ సోమయ్య, బాబురావు, చింతల రాజశేఖర్ రెడ్డి, బొలెపెల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పలు అంశాలపై తీర్మానాలు**

మహాసభల సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు. న్యాయవిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని, మృతి చెందిన న్యాయవాదికి రూ.6లక్షలు చెల్లించాలని తీర్మానించారు. న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు ఉచితంగా లేదా కనీస ధరకు ఇవ్వాలన్నారు. న్యాయవాదులకు జీవితబీమా, ఆరోగ్య కార్డులు జారీ చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో పూర్తిస్థాయిలో కోర్టు భవనాలు నిర్మించి మౌలికవసతులు కల్పించాలని, న్యాయశాఖ ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేయాలని తీర్మానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ న్యాయవాదులకు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, బ్యాంకు, జీవితబీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని కోర్టులు ఆ చట్టాలకు అనుగుణంగా పనిచేసేలా రెగ్యులర్ న్యాయాధికారులను నియమించాలన్నారు. ఈ తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

## ఇద్దరూ...'రహస్య' మిత్రులు

### ప్రజల సొమ్మును లూటీ చేస్తున్న తెలంగాణ సర్కార్

- రైతుబంధుతో ఒరిగిందేమీ లేదు

పేదల పార్టీ అంటే కాంగ్రెస్సే : ఏఐసీసీ సెక్రెటరీ, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

బీజేపీ, బీఆర్ఎస్ రహస్య మిత్రులని, రెండూ కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయని ఏఐసీసీ సెక్రెటరీ, కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఆరోపించారు. ఆదివారం నల్లగొండ జిల్లా చందన పల్లి వద్ద సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు హాజరై మద్దతు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి పలు దర్యాప్తు సంస్థలు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ అక్రమాలపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ బహిరంగంగానే విమర్శలు చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని, దానికి గల కారణం వారిద్దరి మధ్య ఉన్న స్నేహమేనని స్పష్టం చేశారు. కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి వచ్చే విషయంలో ఏఐసీసీ పెద్దలదే తుదినిర్ణయమన్నారు. భట్టి విక్రమార్క పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతుందన్నారు. దారి వెంట ప్రజలు తమ సమస్యలను, కష్టాలను, ఇబ్బందులను భట్టికి చెప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచడానికే భట్టి పాదయాత్ర చేస్తున్నారన్నారు. 2024లో 100 శాతం కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల సంపద లూటీ చేసి ఇతర రాష్ట్రాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభిస్తున్నారన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో పేదలకు పంపిణీ చేసిన భూములను బలవంతంగా తిరిగి వెనక్కి గుంజుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పెద్దలకు కట్టబెడుతున్నదన్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయలేదని, తాగునీటి కోసం గ్రామాల్లో ప్రజలు తండ్లాడుతున్నారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందన్న సంకేతాలు రావడంతో బీఆర్ఎస్, బీజేపీలో ఉన్న చాలామంది నాయకులు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేతలతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. సరైన సమయంలో నిర్ణయం తీసుకొని వారిని పార్టీలోకి చేర్చుకుంటామన్నారు.

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గమ్యం, గమనం లేని నేత పొద్దుతిరుగుడు పువ్వు గుత్తా సుఖేందర్‌రెడ్డి మాత్రమేనన్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ అధికారం చుట్టూ తిరిగే వ్యక్తి అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేస్తున్న నాకు గమ్యం, గమనం ఉందని, భగ భగ మండుతున్న ఎండలు, గాలివానలతో టెంట్లు కూలిన, అకాల వర్షంలో తడుస్తూ నడిచానే తప్ప పాదయాత్ర ఎక్కడ ఆపలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మీడియా సాక్షిగా దేశానికి చూపించామన్నారు. రూ.42 వేల కోట్ల నిధులతో ఇంటింటికి నీరు అందించే మిషన్ భగీరథ నీళ్ళు నేను పాదయాత్ర చేసిన గ్రామాల్లో 90 శాతం కనిపించలేదన్నారు. ఖాళీగా ఉన్న పైపులు, కట్టిన ట్యాంకులను ప్రజలు చూపించారన్నారని తెలిపారు. నీళ్ల పండుగ పేరుతో జలాల్లో పసుపు, కుంకుమ వదులుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ టన్నెల్, నక్కలగండి పెండింగ్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### పూర్తి రుణ మాఫీ చేయాలి

- ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి
- ఎడమ కాలువ పెండింగ్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి
- విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 100శాతం అమలు చేసినప్పుడే బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించి మళ్ళీ అవకాశం ఇస్తారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని ఈ ఎన్నికల ముందే అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటి వరకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని విమర్శించారు. ఇంకా రూ.13,700 కోట్ల రుణమాఫీ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించి పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేసినప్పుడే రైతులు ఈ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, మళ్లీ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకునే సదుపాయం ఉంటుందన్నారు. యాసంగి సీజన్‌లో ధాన్యం అమ్ముకున్న రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదని, దాంతో రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే ధాన్యం డబ్బులను చెల్లించాలని కోరారు. ఈ సీజన్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు మార్కెట్‌లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. 11 లక్షల ఎకరాలకు పోడు భూములకు పత్రాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ నేటికీ అమలు లేదని చెప్పారు. వెంటనే పోడు పత్రాలు వచ్చి ఆ రైతులకు అన్ని రకాల రాయితీలు కల్పించాలని కోరారు. ధరణిలో ఉన్న లోపాలను సరి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల జీవితాలతో ఆడుకోకుండా వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని సూచించారు. ఎడమ కాలువ ఆధునీకరణ చేపట్టినప్పుడు ఆయా మేజర్ల పరిధిలో లైనింగ్ పనులు మధ్య మధ్యలో వదిలేశారని, దానివల్ల గండ్లు పడే ప్రమాదం ఉందని, వెంటనే పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభం కాకముందే లైనింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ఏర్పడితే ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రాజెక్టు అందులో అంతర్భాగంగా ఎత్తిపోతలను పరిగణలోకి తీసుకొని రిపేర్లు చేయించి పూర్తి నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, సీనియర్ నాయకులు నూకల జగదీష్‌చంద్ర, రెమిడాల పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి,రామ్మూర్తి, వినోద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



నవతెలంగాణ-శంషాబాద్

విదేశాల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్, ఎయిర్ ఇంటలిజెన్స్ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆదివారం పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమిరేట్స్ విమానం ఈకే-524లో దుబాయ్ నుంచి మహిళా ప్రయాణికురాలు హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం తెల్లవారుజామున 02:57 గంటలకు చేరుకుంది. అనుమానం వచ్చిన కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు ఆమెను అడ్డుకుని తనిఖీ చేశారు. ఆమె తన లో దుస్తుల్లో బంగారం పేస్ట్, రెండు చిన్న గొలుసులతో కూడిన ప్యాకెట్‌ను దాచిపెట్టినట్టు గుర్తించారు. ఆమె వద్ద రూ.45,37,500 విలువ చేసే 726 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

**మరో ప్రయాణికుని నుంచి 127 గ్రాముల బంగారం స్వాధీనం**

శనివారం దుబాయ్ నుంచి ఒక వ్యక్తి 6ఈ-1484 విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. అనుమానంతో అతన్ని కస్టమ్స్ ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు అడ్డుకొని తనిఖీ చేశారు. అతని వద్ద గోధుమరంగు పౌడర్‌తో కూడిన ప్లాస్టిక్ బాక్స్‌తో పాటు పిల్లల పాల డ్రింక్ మిక్స్ కనిపించింది. దాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అతన్ని ప్రశ్నించారు. బ్రౌన్ పౌడర్‌లో బంగారం పౌడర్ ఉన్నట్టు తేలింది. వెంటనే అధికారులు పౌడర్ నుంచి బంగారాన్ని వేరు వేశారు. మొత్తం 127 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.7,77,621 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## అమృత్‌కాల్ అంటే ఇదేనా..? మొదటిపేజీ తరువాయి)

సంకేతమన్నారు. కొంతమంది పెట్టుబడిదారి మిత్రుల ప్రయోజనం కోసం యువకుల ఉపాధి అవకాశాలపై కేంద్రం నీళ్లు చల్లుతున్నదని ధ్వజమెత్తారు. పీఎస్‌యూలు దేశానికి గర్వకారణమనీ, వాటికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రగతిశీల దేశంలో ఉద్యోగాలు తగ్గిపోతాయా? అని ప్రశ్నించారు. "పీఎస్‌యూలలో 2014లో 16.9 లక్షల ఉద్యోగాలు ఉండగా, 2022లో 14.6 లక్షలకు తగ్గిపోయాయి. ఉద్యోగాలు తగ్గించడమే దేశ ప్రగతా? బీఎస్ఎన్ఎల్‌లో 1,81,127 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఎస్ఎఐఎల్‌లో 61,928, ఎంటీఎన్ఎల్‌లో 29,140, ఎఫ్‌సీఐలో 28,063, ఓఎన్‌జీసీలో 21,120 మంది ఉద్యోగాలు కోల్పోయారు" అని ఓ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు.

**ఉద్యోగ హామీలు ఏమయ్యాయి?**

యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ బీజేపీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రాహుల్ ప్రశ్నించారు. ఉద్యోగాల కల్పనకు బదులు రెండు లక్షల పైగా ఉద్యోగాలను తగ్గించేసిందని విమర్శించారు.



## ఎమ్మెల్యేకు మద్దతుగా బీఆర్ఎస్ భారీ ర్యాలీ

### ఐటీ దాడులతో ఎమ్మెల్యే రాజకీయ ఎదుగుదలను ఆపలేరు



నవతెలంగాణ-భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి నియోజకవర్గంలో ఎన్నికల హడావుడి తలపించే విధంగా బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. భువనగిరి శాసనసభ్యులు పైళ్ల శేఖర్‌రెడ్డి ఇంటిపై నిర్వహించిన ఐటీ దాడుల్లో ఎలాంటి అక్రమ ఆస్తులు బయటపడలేదని ఎమ్మెల్యే కడిగిన ముత్యమని తెలుపుతూ యాదాద్రి భువనగిరి పట్టణంలోని స్థానిక పాలశీతలీకరణ కేంద్రం నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్‌టాప్ జీపుపై ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ జడల అమరేందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు కొలుపుల అమరేందర్ ఉండగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బైకులు నడిపిస్తూ బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువాలు వేసుకొని ఎమ్మెల్యేపై గులాబీ పూలవర్షం కురిపించారు. ఎమ్మెల్యేకు రాజ కిరీటం పెట్టి చేతికి తల్వార్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేరుగా, రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చర్యలు పూనుకుంటున్నారని ఆరోపించారు. ఇంట్లో సోదాలు జరిపిన ఎలాంటి అవినీతి అక్రమాలకు సంబంధించిన పత్రాలు లభించలేదని తెలిపారు. తాను చాలా ఏండ్లుగా వ్యాపారంలో ఉన్నానని, ప్రతిది అకౌంటబుల్‌గా తన నిర్వహణ ఉంటుందని తెలిపారు. ఇది తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఇతర పార్టీ నాయకులు తనపై ఇలాంటి సోదాలు నిర్వహించే విధంగా ప్రోత్సహించారని ఆరోపించారు. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మెన్ చింతల కిష్టయ్య, పార్టీ పట్టణ అధ్యక్షులు ఏవీ.కిరణ్‌కుమార్, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

- పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇప్పించే వరకు మా పోరాటం ఆగదు : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-కోదాడరూరల్

అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలిచ్చి, ఇండ్లు కట్టించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో ప్రారంభమైన బస్సు యాత్ర.. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చేరుకుంది. పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్‌లో సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో బస్సుయాత్రకు ఘన స్వాగతం పలికారు. క్రాస్‌రోడ్‌లోని భగత్‌సింగ్ విగ్రహానికి ప్రజా సంఘాల రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోదాడ మండలంలోని కాపుగల్లు గ్రామంలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారి వద్దకు వెళ్లారు. గ్రామానికి చేరుకున్న యాత్ర బృందానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పద్మావతి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని రైస్ మిల్లు నుంచి గుడిసెలు వేసుకున్న ప్రాంతానికి ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న మక్క శ్రీను మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఒక్క నిముషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా మల్లులక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు గతంలో పట్టాలిచ్చి హద్దులు కేటాయించలేదని విమర్శించారు. 5 ఎకరాల స్థలంలో ప్రకృతివనాలు, రైతు వేదికలు నిర్మించి పేదలకు అన్యాయం చేసిందని విమర్శించారు. పేదలు తాము నివాసం ఉంటున్న స్థలంలో వంటా వార్పు చేసుకుని జీవనం సాగించాలని కోరారు. గుడిసెలు వేసుకున్న గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గుడిసెవాసులు నిత్యం పాములు, తేళ్ల భయంతో బతుకుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు విషయంలో పేద ప్రజలకు మొండిచేయి చూపిందని విమర్శించారు. మహిళలు పాల్గొన్న ప్రతి ఉద్యమం విజయం సాధించిందని, ఇండ్ల స్థలాల కోసం చేస్తున్న పోరాటంలోనూ మహిళలు అధికంగా పాల్గొంటున్నారని, వారి పోరాటమూ ఫలిస్తుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి. సాగర్, ఆర్. వెంకట్రాములు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, వృత్తి సంఘాల రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వంగూరి రాములు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, జిల్లా ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

**పాల్వంచ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 19వ తేదీ నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 19వ తేదీ సోమవారం జిల్లా వ్యాప్తంగా తెలంగాణకు హరితోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు భాగస్వాములు కావాల్సి ఉన్నదని అందువల్ల ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, విజ్ఞాపనలు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ తెలిపారు.

## ఆకాశవాణి ప్రోగ్రాం అధికారి బదిలీ

**కొత్తగూడెం :** ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న రమేష్ సంకసారి బదిలీ అయ్యారు. గత ఆరు సంవత్సరాలుగా కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంకు బదిలీ అయ్యారు. ఆదివారం ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో వీడ్కోలు కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడారు. రమేష్ సుంకసారి అనేక వినూత్న కార్యక్రమాలకు రూపకల్పన చేశారని, ఆయన సారధ్యంలో అనేక సృజనాత్మక కార్యక్రమాలు ప్రసారం అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ సుంకసారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్ చల్లా జైపాల్ రెడ్డి, హైదరాబాద్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అవధానుల శ్రీహరి, బైరి శ్రీనివాసన్, కొలిపాక శంకరరావు, ఎస్ఎన్. రెడ్డి, ప్రభాకర్, బాబు సింగ్, ఆనంద్, కోటేశ్వరరావు, సుమన్, సుగ్రీవ, స్వామి, ఎల్లంకి సుబ్బారావు, క్యాజువల్ అనౌసర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో కింగ్ మేకర్‌గా బీఎస్పీనే'

**ఇల్లందు :** రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కింగ్ మేకర్‌గా బీఎస్పి నిలుస్తుందని రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయాకర్ మౌర్య, అభియేందర్ అన్నారు. స్థానిక ఫెన్షనర్స్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజవర్గ స్థాయిలో బూత్ కమిటీ ఏర్పాటు చేశామని, సమావేశాలు ఏర్పాటు చేస్తూ సమాయత్వం చేస్తున్నామన్నారు. స్థానికంగా ఎమ్మెల్యే హరిప్రియ సమస్యల పరిష్కారంలో ఖఫలమయ్యారని అన్నారు. అనంతరం నియోజవర్గ స్థాయి భూత్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇర్ప రవికుమార్, దామోదర్, జిల్లా మహిళా కన్వీనర్ బండి రమణి, ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జి బాదావత్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడికి అన్యాయం



**జూలూరుపాడు :** బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా 2001 నుండి 2014 తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చేవరకు ఎన్నో పోరాటాలు, త్యాగాలు, లాఠీ దెబ్బలు, అరెస్టులు, జైలు జీవితం గడిపి ప్రత్యేక రాష్ట్రం కోసం బరిగేసి కొట్లాడిన జిల్లాలోని అతి కొద్ది మంది ముఖ్యలలో ఒకరైన వేల్పుల నరసింహారావు ఒకరుగా ఉన్నారు. 2001 నుండి నేటి వరకు సుమారు 22 సంవత్సరాలుగా గులాబీ జెండా నే నమ్ముకుని కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తున్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కెసిఆర్ త్యాగాలు చేసినటువంటి తనని గుర్తించి ఎమ్మెల్యే గాను లేదా ఎమ్మెల్సీ గాను లేక ఏదో ఒక కార్పొరేషన్ చైర్మన్ గాను అవకాశం కల్పిస్తారని ఆశించారు. కానీ అటువంటి అవకాశాలు కేసీఆర్ ఇవ్వలేదు. ఎన్నో పర్యాయాలు కేసిఆర్‌ని, హరీష్ రావుని కలిసి నాకు పదవి అవకాశం కల్పించాలని ఈ పార్టీలో ఉద్యమంలో 22 సంవత్సరాలు సుదీర్ఘకాలం పనిచేస్తున్నానని ఒక మనిషి జీవితంలో 22 సంవత్సరాలు అత్యంత విలువైనదని అటువంటి విలువైన సమయాన్ని పార్టీ కోసం తమరు నాయకత్వాన్ని బలపరచడం కోసం వెచ్చించానని, నాకు కచ్చితంగా ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరినను నేటి వరకు ఎటువంటి అవకాశం ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేసీఆర్ నాలాంటి వారి పట్ల సరైన నిర్ణయం తీసుకోకపోతే పార్టీ పట్ల నాయకత్వం పట్ల దళితులలో ఎస్సీ వర్గాలలో తప్పుడు సంకేతం వెళ్లే అవకాశం ఉందని ఆయన అన్నారు.

## శుభోదయంలో ఉద్యమ నేత

- పేట ఎమ్మెల్యే బరిలో జారే

**నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి**

ఎన్నికల హడావుడి ఆరు నెలలు ముందే ప్రజా ప్రతినిధులతో ఎన్నో విచిత్ర పనులు చేయిస్తుంది. ఒకరు అభివృద్ధి అని, మరొకరు మాజీ శాసన సభ్యులు అంటూ ప్రచారాలు చేసుకుంటూ మండలాల్లో తిరుగుతుంటే మరొకరు శుభోదయం అంటూ తిరుగుతూ ప్రజల్లో మమేకమై పోతున్నారు. అశ్వారావుపేట నియేజక వర్గంలో 2014లో ఉద్యమ నేతగా టీఆర్‌యస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలై 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టికెలకు విజయం సాధించాలని పొంగులేటి వర్గం తరుపునో లేక ఎదో ఒక పార్టీ తరుపున పోటీ చేయాలని ధృడ సంకల్పంతో ప్రతి మండలంలో తెల్లవారుజామున నుండే శుభోదయం అంటూ ప్రజలను పలకరిస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి హలో శుభోదయం అంటూ వారిని పలకరిస్తూ ఓ ఇంట్లోకి వెళ్లి ఏకంగా అన్నం వండి వారికి వడ్డించడం, ఓ టిఫిన్ సెంటర్ దగ్గరకు వెళ్లి బజ్జీలు వేయడంతో అందరూ అచ్చర్యయపోయినారు. ప్రజలు కోసం ప్రభుత్వ ఉద్యోగాన్నే త్యాగం చేశానని ఉద్యమ నేతగా ఓ సారి శాసన సభ్యునిగా పోటీ చేసిన అవకాశం రాలేదని, అయిన అను నిత్యం ప్రజల్లో ఉంటూ ఎంతో మంది పేద ప్రజలకు సేవ చేస్తూ అనారోగ్యంగా బాధపడుతూ లక్షలు రూపాయలు ఖర్చు పెట్టి ఆర్థికంగా బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇప్పించి వారి కుటుంబాలకు అండగా వున్నానని రానున్న ఎన్నికల్లో ప్రజలు అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబాకులు రాము, పర్స వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితురాలికి ఆసరా

- నిత్యావసరాలు అందజేసిన వగ్గెల పూజ

**నవతెలంగాణ-అశ్వారావుపేట**



మండలంలోని మళ్ళాయి గూడెం పంచాయతీ తాటి నాగులు గుంపు అగ్ని ప్రమాద బాధితురాలు కంజ మంగమ్మకు టీపీసీసీ సభ్యురాలు వగ్గెల పూజ ఆసరాగా నిలిచారు. ఆదివారం ఆమె మంగమ్మను ఓదార్చి ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, కూరగాయలు అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పూజ వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉకే ముత్యాలు, నియోజకవర్గ యువజన నాయకుడు షేక్ బషీర్, రాచకొండ బంగారం, మరం దుర్గయ్య, మాడి వెంకట ముత్యాలరావు, తాటి నాగు, నారం వీరభద్రం, తాటి ముత్యాల రావు, మడివి వీరస్వామి, కలం శివ, పూసం జోగారావు, నారం లక్ష్మణరావు, కలం రాజేష్, మడివి గణేష్, గోరం నాగార్జున, మాడి వెంకటేష్, కొరసా సోమరాజు, మడివి శ్రీను, నారం ధర్మరాజులు ఉన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్ బాధితునికి ఆర్థిక సాయం

**బూర్గంపాడు :** ఐటీసీ అనుబంధ సంస్థ అయినా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సారపాక గ్రామానికి చెందిన ఎ.చందు అనే బ్రెయిన్ స్ట్రోక్ బాధితునికి ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. చంద్రశేఖర్ గత కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్ అటాక్‌తో యెడమ వైపు పక్షవాతంతో బాధపడుతున్నారని తెలుసుకున్న రోటరీ అధ్యక్షులు టి.సూర్య భాస్కరరావు, కార్యదర్శి డా.విజయ్ కుమార్‌లు రోటరీ తరపున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు టీఎస్ భాస్కరరావు మాట్లాడుతూ ఎ.చందు త్వరగా కోలు కోవాలని ఆ దేవుని ప్రార్థిస్తూ, దాతలు ముందుకు వచ్చి వారికి సహాయం చేయవలసిందిగా ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి డా.విజయ్ కుమార్, కృష్ణ రెడ్డి, సాయిరాం, మరదన శ్రీనివాస్, చాంద్ బాషా, ఖాదర్, బాధితుని తండ్రి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బకాయిల బిల్లును వెంటనే చెల్లించాలి : సీపీఐ

**బూర్గంపాడు :** బూర్గంపాడు మండలం సారపాకలో సిపిఐ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన కార్మికులతో సారపాకలో జిల్లా పరిషత్ స్కూల్లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన అన్నారు. కార్మికులు వారి సొంత ఖర్చులతో విద్యార్థుల కడుపు నింపుతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాంటివారికి దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్న వారు బిల్లులు ఇవ్వకపోవడం చాలా దారుణమని ఆయన అన్నారు. దాదాపు మన జిల్లాలో ఎనిమిది కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే ప్రభుత్వం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పేరాల శ్రీనివాస రావు, ఏఐటియుసి అధ్యక్షులు సాజిత్, ఏఐవైఎఫ్ నాయకులు జోహార్, మధ్యాహ్న భోజన కార్మికులు ఆకుల పద్మ, రమాదేవి, రాధా, లక్ష్మి, పుష్ప, సత్యవతి, ఈశ్వరి, సరిత రజని, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొమరం భీం విగ్రహ ఆవిష్కరణ

- హాజరైన ప్రముఖ ఆదివాసీలు

**నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)**



గుండాల మండల పరిధిలోని శెట్టుపల్లి గ్రామంలో ఆదివాసీ పోరాటయోధుడు కొమరం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణ లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుంపిడి వెంకటేశ్వర్లు, వట్టం ఉపేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, సర్పంచ్ కోరం సీతారాములు, మాజీ ఎంపీపీ పద్మ, మాజీ సర్పంచ్ శాంతయ్య, ప్రజాపంథా మండల కార్యదర్శి ఈసం శంకర్, ఆదివాసి ఉద్యోగులు గుమ్మడి సమ్మయ్య, మోహన్ రావు, ఆదివాసీ వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఐక్యపోరాటాల ద్వారానే హక్కుల సాధన

- టీఎస్‌యూఈఈయూ

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరరావు

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**



జూన్ 17, 18 తేదీలలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌యుఈఈయు) రాష్ట్ర శిక్షణ తరగతులు భద్రాచలం పట్టణంలో జరిగాయి. రెండవ రోజు ఆదివారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరరావు మాట్లాడారు. వర్కింగ్ ప్రెసిడెండ్ యస్.స్వామి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల హక్కుల కోసం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగంలోని విద్యుత్ సంస్థలన్నింటినీ అమ్మేస్తుందని విమర్శించారు. దేశ ఆర్థిక ప్రగతికి, పారిశ్రామిక ప్రగతికి ఇరుసు లాంటి విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం ద్వారా మొత్తం దేశ వ్యవస్థని విధ్వంసం చేయటానికి బిజెపి కుట్రలు చేస్తుందని సిఐటియు పేర్కొన్నది. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరచడం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు జాతీయ సంపదను దోచి పెట్టాలనే బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక సంఘాలు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఫి) ఆధ్వర్యంలో విద్యుత్తు రంగంలో పని చేస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు పోరాటాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల మద్దతు తోటి కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న పోరాటం ప్రైవేటీకరణ విధానాలను నిలువరించడం కోసం దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. జేఏసీలో ఉన్న అన్ని సంఘాల ఆమోదం లేకుండా ప్రభుత్వం, సీఎండీ ఏకపక్షంగా ఒప్పందాన్ని ప్రకటించడం కార్మిక చట్టాలకు వ్యతిరేకమని సీఐటీయూ పేర్కొన్నది. అందుకే ఏకపక్షంగా జరిగిన ఒప్పందంపై 1947 ఐడి ఆక్ట్ ప్రకారం (ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్) జాయింట్ లేబర్ కమిషనర్ ముందు ఫిర్యాదు చేయడం జరిగిందని సిఐటియు నేతలు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగంలోని ఉద్యోగులు కార్మికులకు నష్టదాయకమైన విధానాలను అమలు చేస్తున్నారని వాటికి వ్యతిరేకంగా బలమైన సమరశీల పోరాటాలు నిర్వహణకు సిఐటియు కృషి చేస్తుందని పేర్కొన్నారు. రానున్న కాలంలో విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, లేబర్ కోడుల రద్దు కోసం ,నూతన విద్యుత్ చట్టం రద్దు కోసం, పోరాటాలు చేయాలని ఆ పోరాటాల నిర్వహణ కోసం యుఈఈయు కార్యకర్తలకు, నాయకులకు అవసరమైన తర్ఫీదును ఇచ్చేందుకు రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జూన్ 17, 18 తేదీలలో భద్రాచలంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రభుత్వ విధానాలు విద్యుత్ రంగంపై ప్రభావం, విద్యుత్ రంగం పోరాటల చరిత్ర, విద్యుత్ రంగంలో వస్తున్న పోరాటాలు సీఐటీయూ పాత్ర, మతోన్మాద రాజకీయ విధానాలు-కార్మిక వర్గ ఐక్యతకు పొంచి ఉన్న ప్రమాదం తదితర అంశాల మీద సిఐటియు రాష్ట్ర నాయకులు యూఈఈయు నాయకులు కార్యకర్తలకు తర్ఫీదు ఇస్తారని యుఈఈయు రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బొల్లి వెంకటరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె బ్రహ్మచారి తెలిపారు. ఈ సమావేశంలో యుఈఈయు నాయకులు సీఐటీయూ జిల్లా అద్యక్షులు బ్రహ్మచారి, యూఈఈయూ రాష్ట్రనాయకులు బొల్లివెంకటరాజు సత్యం, చంద్రారెడ్డి, ప్రసాదరాజు, ప్రసాద్, అంకిరెడ్డి నర్సింహారావు, దిలంశ్రీను, కూనురాజు శ్రీను, వర్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.



## కష్టానికి ఫలితం దక్కింది..చైర్ పర్సన్

- అవార్డు గ్రహీతలు చైర్పర్సన్, కమిషనర్‌ను సన్మానించిన మున్సిపల్ సిబ్బంది

**నవతెలంగాణ-కొత్తగూడెం**

కొత్తగూడెం మున్సిపాలిటీకి తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలలో బాగంగా 50 వేల జనాభా పైబడి లక్ష లోపు ఉన్న మున్సిపాలిటీలకు శానిటేషన్ 'సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్' రంగంలో ఉత్తమ మున్సిపాలిటీగా కొత్తగూడెం మున్సిపాలిటీ ఎంపికైంది. హైద్రాబాద్ శిల్పకళావేదికలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సిడిఎంఏ సత్యనారాయణ, మాజీ చీఫ్ సెక్రటరీ రాజీవ్ శర్మ, మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అవార్డ్ కొత్తగూడెం మున్సిపల్ ఛైర్పర్సన్ కాపు సీతాలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ జి.రఘులు అందుకున్నారు. ఆవార్డు అందుకున్న వారిని ఆదివారం కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో సన్మానించారు. అనంతరం సిబ్బంది స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత చైర్పర్సన్ కాపు సీతా లక్ష్మి మాట్లాడుతూ అవార్డు రావడంలో మమ్ములను ముందుండి నడిపించిన కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభాకర్, ఆర్ఐ చందు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు అశోక్, చారి, జూనియర్ అసిస్టెంట్లు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేస్తున్న సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం

- సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

**నవతెలంగాణ-కొత్తగూడెం**



సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా చట్టబద్ధ బోనస్ సౌకర్యం కల్పించకుండా సింగరేణి యాజమాన్యం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తూ వారిచే వెట్టిచాకిరి చేస్తున్నారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు విమర్శించారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న అధ్యక్షతన జరిగిన సింగరేణి జిల్లా రీజనల్ జనరల్ బాడీ సమావేశంలో మధు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 32 వేల మంది ఉండి పర్మినెంట్ కార్మికులతో సమానంగా బొగ్గు ఉత్పత్తిలో లాభాల బోనస్‌లో భాగస్వామ్యం అవుతున్నాగాని వారిని పట్టించుకోకుండా కోలిండియా వేతనాలుగాని, జీవో నెంబర్ 22 గాని, కనీస వేతనాలు అమలు చేయకుండా వారి యామజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈ వివక్షతను ఎండకడుతూ జులై నెల మొత్తం కనీస వేతనాలు అమలకై పోరుబాట పేరుతో సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (ఎస్‌సీకేఎస్) సిఐటియూ ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలకి పిలుపు నివ్వడం జరిగిందని తెలిపారు. ఈ పిలుపులో సింగరేణి కాంటాక్ట్ కార్మికులు మొత్తం పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వారికి ఒరిగిందేమీ లేదన్నారు.

**గూడెంలో రాష్ట్ర మహాసభలు : ఏజే.రమేష్**

సింగరేణి రాష్ట్ర మహాసభలు కొత్తగూడెంలో జరుగుతున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్ తెలిపారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల్లో కనీస వేతనాలు, హై పవర్ కమిటీ వేతనాలు, జీవో నెంబర్ 22 తదితరు అంశాల పైన చర్చించబోతున్నామని, కాంట్రాక్ట్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని ఎండగడుతూ దశల వారి పోరాటాలకి పిలుపు నివ్వడం జరిగిందని తెలిపారు. ఈ పిలుపులో సింగరేణి పర్మినెంట్, కాంటాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి సూరం ఐలయ్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, కృష్ణ, నరసింహారావు, సింగరేణి నాయకులు రాజారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాటల్లో గొప్పలు.. ఆచరణలో శూన్యమే

- ప్రజా సంఘాల పోరాట వేదిక

**నవతెలంగాణ-ఇల్లందు**



ఇల్లు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూములు కట్టించి నిరుపేదలకు ఇస్తామన్న సీఎం కేసీఆర్ ఇవ్వడంలేదని మాటల్లో గొప్పలు ఆచరణలో శూన్యమే కనిపిస్తోందని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక విమర్శలు చేసింది. సున్నం రాజయ్య నగర్‌లో ఆదివారం ప్రజా సంఘాల పోరాట వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 2014 నుండి డబల్ బెడ్ రూమ్ ప్రతి ఒక్కరికీ నిరుపేద కుటుంబాలకి కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు నెరవేర్చలేదని, అక్కడక్కడ నూటికి 5 శాతం ఇచ్చారే తప్ప 95 శాతం నిరుపేదలకు ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదలనే వారు ఇల్లు లేకుండా ఉండే పరిస్థితి లేదని చాలా గొప్పగా చెప్పింది. కానీ ఇంత మట్టికి ఎక్కడ కూడా కేంద్ర ప్రభుత్వం నిధుల నుండి కట్టించిన పాపాన పోలేదన్నారు. కేంద్రం 10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.5 లక్షలు మంజూరు చేసి అందరికీ ఇల్లు ఇళ్ల స్థలాలు డబల్ బెడ్రూంలు కట్టించి ఇవ్వాలని అన్నారు. జూన్ 19న రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవ కార్యక్రమం చేపట్టారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ప్రభుత్వ స్థలాలలో ఇళ్ళు వేసుకున్న గుడిసె వాసులు అందరూ గుడిసె ముందు ఉదయ్యన్నే మొక్క నాటాలి, సాయంత్రం కొత్తగూడెంలో జరిగే బస్సు యాత్రలో పాల్గొనాలి అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ మన్యం మోహన్ రావు, రాందాస్, కోటమ్మ, వెంకన్న, హుస్సేన్, కౌసల్య సంతోష సుజాత, తాళ్లూరి పద్మ, జయసుధ, మహేశ్వరి, చాందినీ రాజు, రజియా, నాగమ్మ కుమారి రాణి విజయ జైతున్, తదితరులు పాల్గొన్నారు.



## మంచినీళ్ల పండుగ

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగ సందర్భంగా భద్రాచలంలో ర్యాలీ నిర్వహించి పాండవుల గుట్ట 12ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాలు వద్ద నిర్వహించిన గ్రామసభలో మిషన్ భగీరథ నీరు, బోరు నీరుకు ఉన్న తేడాను, నీటిని శుద్ధి చేయు విధానాలను అధికారులు వివరించారు. మిషన్ భగీరథ వాటర్ సప్లై చేయడంలో కార్మికులను సన్మానించారు. గ్రామ సభకు విచ్చేసినటువంటి విద్యార్థులకు, గ్రామ ప్రజలకు నీటిని శుద్ధి చేయు విధానాలను ప్రయోగపూర్వకంలో మిషన్ భగీరథ అధికారులు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బి.నాగలక్ష్మి, గ్రామపంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, డీఈఈ ఎస్.శ్రీనివాసరావు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొని మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు.

## ఘనంగా మంచి నీటి దినోత్సవం

**నవతెలంగాణ-అశ్వారావుపేట**



దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మంచినీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్వారావుపేట, పేరాయిగూడెం, కన్నాయిగూడెం పంచాయతీలో నిర్వహించే మంచినీళ్ల పండగ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో నడుస్తున్న తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో మహా సంకల్పంగా మిషన్ భగీరథకు 2015లో శ్రీకారం చుట్టింది అన్నారు. మండల వ్యాప్తంగా 118 ట్యాంకులు ద్వారా ఇంటింటికి నల్ల కలెక్షన్స్ 17,000, మండలంలో 160 కిలోమీటర్లు అంతర్గత పైప్ లైన్ ఏర్పాటు చేశారన్నారు. అనంతరం మిషన్ భగీరథ సిబ్బందికి అధికారులకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సర్పంచ్‌లు అట్టం రమ్య, నార్లపాటి సుమతి, గొంది లక్ష్మణ్ రావు, ఈఓ హరి క్రిష్ణ, కార్యదర్శి కోటమర్తి శ్రీరాం మూర్తి, ఎంపీటీసీలు, అధికారులు మండల నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం :** ప్రతి ఒక్కరూ శుద్ధి చేసిన జలాలు తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని వాటర్ గ్రిడ్ సూపర్వైజర్ సలీం అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో మంచినీళ్ల పండుగను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. పర్ణశాల క్రాస్ రోడ్‌లో గల మిషన్ భగీరథ ట్యాంకు వద్ద గోదావరి జలాలను ఏ విదంగా శుద్ధి చేస్తారో తెలియజేశారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు శుద్ధి జలాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో పాటు కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఆళ్ళపల్లి/గుండాల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకంతో మారుమూల పల్లె ప్రజల తాగునీటి సమస్య చాలా వరకు తీరిందని ఉమ్మడి ఆళ్ళపల్లి, గుండాల మండలాల మిషన్ భగీరథ ఏఈ పి.కిశోర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆళ్ళపల్లి, గుండాల మండలాల్లోని అనంతోగు, పాతూరు, దొంగతోగు, ముత్తాపురం, తదితర గ్రామ పంచాయతీలలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా "మంచి నీళ్ల పండుగ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆయా గ్రామాల సర్పంచ్, కార్యదర్శుల ఆధ్వర్యంలో ఉత్సవ ర్యాలీ నిర్వహించి, ఆయా జీపీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఆళ్ళపల్లిలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో ఎం.రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా జీపీల సెక్రటరీలు విజయ కుమారి, త్రివేణి, రామకృష్ణ, సతీష్, ప్రజలు పాల్గొన్నారు.

**భద్రాచలం :** దశాబ్ది ఉత్సవాల భాగంగా ఆదివారం మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాండవుల గుట్ట వద్ద గ్రామ సభ జరిపారు. ఈ సందర్భంగా నీటి శుద్ధి విధానాన్ని స్థానికులకు వివరించారు. మిషన్ భగీరథ వాటర్ సప్లై లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఉపకార్య నిర్వహక ఇంజనీర్ ఎన్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, గ్రామపంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, ఐకేపీ, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫలితాలపై ఉపాధ్యాయులు కొరత ప్రభావం

- భర్తీ చేసేది ఎప్పుడు..?

**నవతెలంగాణ-అశ్వారావుపేట**



విద్యాశాఖను ఉపాధ్యాయులు కొరత వేదిస్తున్నది. ఈ కొరత పదో తరగతి ఫలితాలు పై ప్రభావం చూపుతుంది. ఏ సబ్జెక్టు టీచర్లు లేరో అదే సబ్జెక్టులో ఈ ఏడాది విద్యార్థులు ఫెయిల్ అవడం దీనికి మంచి ఉదాహరణ. విద్యాశాఖ మండల అధికారి క్రిష్ణయ్య తెలిపిన వివరాలు ప్రకారం.

మండలంలో మొత్తం 97 పాఠశాలలు ఉన్నవి. ప్రాధమిక పాఠశాలలు-45, గిరిజన ప్రాధమిక పాఠశాలలు-21, ప్రాధమిక ఉన్నత పాఠశాలలు-13, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు -06, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు-06, ఆశ్రమ ప్రాధమిక పాఠశాలలు-02, బీ.సీ పాఠశాల-02, ఎయిడెడ్ పాఠశాల-01, మైనార్టీ పాఠశాల-01 అయితే ఈ పాఠశాలలకు మొత్తానికి మండలంలో మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు 255 కాగా ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాద్యాయులు 204 మంది. ఇంకా భర్తీ కావాల్సి ఉన్నవి 51 పోస్టులు. అయితే ఈ ఖాళీలను ఎంపీడీఓ నింపుతారు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

| సబ్జెక్టు | మంజూరు | వర్కింగ్ | ఖాళీ |
|---|---|---|---|
| గ్రేడ్ 2 హెచ్ ఎం | 04 | 01 | 03 |
| ఎస్ ఎ (మాథ్స్) | 16 | 10 | 06 |
| ఎస్ ఎ (పి.ఎస్) | 12 | 11 | 01 |
| ఎస్ ఎ (బి.ఎస్) | 13 | 08 | 05 |
| ఎస్ ఎ (ఎస్ ఎస్) | 17 | 09 | 08 |
| ఎస్ ఎ (తెలుగు) | 03 | 02 | 01 |
| ఎస్ ఎ (ఇంగ్లీష్) | 13 | 11 | 02 |
| పీఎస్ హెచ్ ఎం (టి) | 11 | 04 | 07 |
| ఎస్ జి టి(తెలుగు) | 132 | 111 | 15 |
| ఎల్పీ(హింధీ) | 2 | 1 | 1 |
| వొకేషనల్ ఇన్స్ట్రక్టర్స్ | 02 | - | - |
| **మొత్తం** | **255** | **200** | **47** |

గతేడాది విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాలు ఉపాద్యాయులు కొరతను వెక్కిరిస్తున్నాయి. ఇందులో మొత్తం 43 మంది ఫెయిల్ అయితే అత్యధికులు గణితం, సోషల్ స్టడీస్‌లో తప్పిన వారే కావడం గమనార్హం. సబ్జెక్టు వారీ ఉపాద్యాయులు కొరత లోను వీరే అధికంగా ఉండటం విశేషం.

**ఫెయిల్ అయిన సబ్జెక్టులు విద్యార్థులు వివరాలు:**

| సబ్జెక్టు | ఫెయిల్ |
|---|---|
| తెలుగు | 06 |
| ఇంగ్లీష్ | 03 |
| గణితం | 26 |
| సైన్స్ | 01 |
| సోషల్ స్టడీస్ | 20 |
| **మొత్తం** | **56** |

ఈ మండలంలో ఉన్న గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణయ్య నారాయణపురం పాఠశాలలో విధులు నిర్వహిస్తూ అశ్వారావుపేట, గుండాల, ఆళ్ళపల్లి మండలాలకు మండల విద్యాశాఖాధికారిగా వ్యవహరిస్తూ విధులు భారాన్ని మోస్తూ వ్యయ, మనోవేదనను అనుభవించడం బాధాకరం. మండలంలో ఖాలీలను భర్తీ చేసి, ఈ మండలానికే పరిమితం అయ్యేలా మండల విద్యాశాఖాధికారిగా పరిమితులు విధించాలని ఎస్.ఎం.సి చైర్మన్‌లు, తల్లిదండ్రులు, పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

## కోయగూడెం ఉపరితల గనిలో పర్యటించిన డైరెక్టర్(పిపి)


**నవతెలంగాణ-ఇల్లందు**

సింగరేణి సంస్థ డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర రెడ్డి ఆదివారం ఇల్లందు ఏరియాలోని కోయగూడెం ఉపరితలగనిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఓసీ పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుచున్న పనులను పరిశీలించారు. రోజు వారి బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జీఎం ఎం.షాలెం రాజును అడిగి తెలుసుకున్నారు. తరువాత డైరెక్టర్(పిపి) జి.వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జి.యం.ఎం.షాలెం రాజు, కేటీసి ప్రాజెక్ట్ ఆఫీసర్ యస్.వి.ఆర్ ప్రహలాద్, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ప్రశాంతంగా ముగిసిన రాత పరీక్ష

**కొత్తగూడెం :** సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న '114' ఫిట్టర్ ట్రైనీ కేటగిరి-1 పోస్టులను ఇంటర్నల్ అభ్యర్థులతో భర్తీ చేయుటకు ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 80 మంది అభ్యర్థులకు హాల్టికెట్లు జారీ చేయగా 70 మంది అభ్యర్థులు రాత పరీక్షకు హాజరైయ్యారు. సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జనరల్ మేనేజర్ పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య, జీఎం విజిలెన్స్ కె. ప్రసాదరావులు పర్యవేక్షించారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో డిజిఎం పర్సనల్‌లు ధన్ పాల్ శ్రీనివాస్, వేణుగోపాల్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద, ఎస్ఎస్ఓ పివిఎన్.శాస్త్రి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సైన్, డివైపిఎం నాగేశ్వర రావు, సీనియర్ పిఓ సంతోష్ కుమార్, ఇతర అధికారులు, ఆర్‌సి, విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# నవచిత్రం



దిల్ రాజు

## అంకిత భావమూ ఉండాలి

ప్రముఖ దర్శకులు 'అంకురం' ఉమామహేశ్వరరావు సారథ్యంలో అందరికీ అందుబాటులో, అత్యున్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్న 'దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్' ఆరవ స్నాతకోత్సవం ఆదివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. నటన, దర్శకత్వం, ఛాయాగ్రహణం, ఎడిటింగ్ వంటి పలు విభాగాల్లో సుశిక్షితుల్ని చేస్తూ, సినిమా రంగానికి ప్రతిభ కలిగిన సాంకేతిక నిపుణులను అందిస్తున్న ఈ ప్రతిష్టాత్మక సంస్థ స్నాతకోత్సవానికి నిర్మాత దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

క్రియేటివిటితో పాటు కృషి, పట్టుదల, అంకితభావం ఉన్నవారిని మాత్రమే సినిమారంగం విజయాలు అందిస్తుందని ఈ సందర్భంగా దిల్ రాజు పేర్కొన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం, దర్శక, నిర్మాత డాక్టర్ గౌతమ్ విశిష్ట అతిథులుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'దాదా సాహెబ్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్' డీన్ మధు మహంకాళి, ప్రిన్సిపాల్ నందన్ బాబు సమక్షంలో పలువురు విద్యార్థినీ విద్యార్థులకు దిల్‌రాజు సర్టిఫికెట్స్, పతకాలు అందించారు. శిక్షణలో భాగంగా స్టూడెంట్స్ తెరకెక్కించిన లఘుచిత్రాలపై అతిథులు ప్రశంసల వర్షం కురిపించారు.


## కొరియోగ్రాఫర్ రాకేశ్ మాస్టర్ కన్నుమూత



రాకేశ్ మాస్టర్

ప్రముఖ కొరియోగ్రాఫర్ రాకేశ్ మాస్టర్ (53) కన్నుమూశారు. వారం రోజుల క్రితం వైజాగ్‌లో షూటింగ్ ముగించుకుని హైదరాబాద్ వచ్చిన ఆయన అనారోగ్యం బారినపడ్డారు. ఆదివారం ఉదయం రక్త విరోచనాలు కావడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. డయాబెటిక్ పేషెంట్ కావడంతోపాటు సివియర్ మెటాబాలిక్ ఎసిడోసిస్ కారణంగా మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ జరగడంతో రాకేశ్ మాస్టర్ మృతి చెందినట్లు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు తెలిపారు. అలాగే ఆయన రెండు కండ్లను దానంగా చేసేందుకు రాకేశ్ మాస్టర్ కుటుంబ సభ్యులు అంగీకరించినట్టు ఆయన పేర్కొన్నారు.

'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాల్టీ షోల ద్వారా కెరీర్‌ను మొదలు పెట్టిన ఆయన ఎన్నో విజయవంతమైన చిత్రాలకు కొరియోగ్రఫీ అందించారు. దాదాపు 1500 చిత్రాలకు పైగా ఆయన పని చేశారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్‌తో సహా అగ్ర కొరియోగ్రాఫర్లు రాకేశ్ శిష్యులు కావడం విశేషం. అలాగే యూట్యూబ్ ఛానెళ్లతోపాటు సోషల్ మీడియాలో ఈయన పలువురు హీరోలు, కొరియోగ్రాఫర్లపై చేసిన వ్యాఖ్యలు చాలాసార్లు వివాదస్పద మయ్యాయి. అద్భుత ప్రతిభగల రాకేశ్ మాస్టర్ మృతి పట్ల పలువురు కొరియోగ్రాఫర్లు, సినీ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నేడు(సోమవారం) హైదరాబాద్ బోరబొండలో రాకేశ్ మాస్టర్ అంత్యక్రియలు జరుగనున్నాయి.



నిఖిల్

## స్పై.. రిలీజ్‌కి రెడీ

నిఖిల్ నటించిన 'స్పై' సినిమా వాయిదా పడిందనే రిపోర్ట్స్‌తో నిఖిల్ ఫ్యాన్స్, సినీ అభిమానులు నిరాశ చెందారు. సుభాష్ చంద్రబోస్ హిడెన్ స్టోరీ, సీక్రెట్స్ ఆధారంగా గ్యారీ బిహెచ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని గతంలో ప్రకటించిన తేదీకే (ఈనెల 29న) సినిమాని విడుదల చేస్తామని మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుతం శరవేగంతో గ్రాఫిక్స్ పనులు జరుగుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయడానికి 1000 మంది నైపుణ్యం కలిగిన సిజీ సాంకేతిక నిపుణులతో 4 కంపెనీలను నిర్మాతలు నియమించుకున్నారు. రిలీజ్ డేట్ వార్తని ధృవీకరిస్తూ నిఖిల్, 'క్వాలిటీ లాక్... టార్గెట్ లాక్... స్పై లాక్.. జూన్ 29న వరల్డ్‌వైడ్ థియేటర్లలో..' అని ట్వీట్ చేశారు. మెషిన్ గన్ పట్టుకుని, సుభాష్ చంద్రబోస్‌తో సహా స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల బ్యాక్‌డ్రాప్‌లో నిలబడిన పోస్టర్‌ను కూడా ఆయన ఫ్యాన్స్‌తో పంచుకున్నారు. ఈ సినిమా టీజర్‌కి అన్ని భాషల్లో అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. నిర్మాత కె రాజశేఖర్ రెడ్డి కథ అందించిన ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ వంటి ఐదు భాషల్లో విడుదల కానుంది.

ఆర్యన్ రాజేష్, ఐశ్వర్య మీనన్, సన్యా ఠాకూర్, అభినవ్ గోమతం, మకరంద్ దేశ్‌పాండే, జిషు సేన్ గుప్తా, నితిన్ మెహతా, రవివర్మ కృష్ణ తేజ, ప్రిషా సింగ్, సోనియా నరేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీవోపీ : వంశీ పచ్చిపులుసు, మార్క్ డేవిడ్, రచయిత : అనిరుధ్ కృష్ణమూర్తి.

## మా నాన్న సూపర్ హీరో



సుధీర్ బాబు

సుధీర్ బాబు హీరోగా 'లూజర్' సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. సిఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఫాదర్స్ డే సందర్భంగా మేకర్స్ సినిమా టైటిల్‌ను విడుదల చేశారు. 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ని ఖాయం చేశారు. తండ్రి, కొడుకుల ప్రేమ, అనుబంధాల నిజమైన అర్థాన్ని తెలియజేసి, సోల్‌ని కదిలించే అద్భుతమైన ప్రయాణంగా ఈ చిత్రం ఉండబోతుంది. ఆర్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సాయి చంద్, షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి సపోర్టింగ్ రోల్స్ పోషిస్తున్నారు.

ఈ మాన్సూన్‌లోనే విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి డివోపీ : సమీర్ కళ్యాణి, సంగీతం: జై క్రిష్, ఎడిటర్: అనిల్ కుమార్ పి, కొరియోగ్రఫీ: రాజు సుందరం, రచయితలు: ఎంవిఎస్ భరద్వాజ్, శ్రవణ్ మాదాల, అభిలాష్ రెడ్డి కంకర.

## సరికొత్త కాన్సెప్ట్‌తో మిషన్ తషాఫి

వైవిధ్యమైన కంటెంట్‌ను అందిస్తూ ప్రేక్షకుల హృదయాల్లో తనదైన స్థానాన్ని దక్కించుకున్న ఓటీటీ మాధ్యమం జీ 5. ఇప్పుడు సరికొత్త యాక్షన్ స్పై థ్రిల్లర్ 'మిషన్ తషాఫి' ఒరిజినల్‌తో ఆకట్టుకోవటానికి సిద్ధమవుతోంది. దర్శకుడు ప్రవీణ్ సత్తారు ఈ వెబ్ సిరీస్‌ను డైరెక్ట్ చేస్తున్నారు. సిమ్రాన్ చౌదరి, శ్రీకాంత్ అయ్యంగార్, అనీష్ కురువిల్లా, ఛత్రపతి శేఖర్, భూషణ్ కళ్యాణ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రధాన తారాగణంగా నటించబోయే నటీనటుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. హై ఇంటెన్స్ స్పై థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'మిషన్ తషాఫి' ఒరిజినల్ రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి ప్రారంభమైంది. 8 ఎపిసోడ్స్ ఉన్న ఈ వెబ్ సిరీస్‌ను ఫిల్మ్ రిపబ్లిక్ బ్యానర్‌పై ప్రణతి రెడ్డి నిర్మిస్తున్నారు. తెలుగు ఓటీటీ చరిత్రలో ఇప్పటి వరకు రూపొందని విధంగా ఈ హై ఇన్‌టెన్స్ యాక్షన్ థ్రిల్లింగ్ వెబ్ సిరీస్‌ను జీ 5 భారీ బడ్జెట్‌తో రూపొందిస్తుంది. ప్రముఖ అంతర్జాతీయ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చిత్రీకరించని సరికొత్త లొకేషన్స్‌లో ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు. ఈ వెబ్ సిరీస్‌కు నిర్మాత: ప్రణతి రెడ్డి, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: ప్రవీణ్ సత్తారు, సినిమాటోగ్రఫీ: నరేష్ రామదురై, ఆర్ట్: సాయి సురేష్, ఎడిటర్:ధర్మేంద్ర కాకరాల.



నరేష్ రామదురై, ప్రవీణ్ సత్తారు, ప్రణతి రెడ్డి, సిమ్రాన్ చౌదరి

## ఓ మంచి దెయ్యం

'ఓ మంచి ఘోస్ట్' (ఓఎమ్‌జీ) శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న వైవిధ్యమైన హారర్ కామెడీ చిత్రం. మార్క్ సెట్ నెట్ వర్క్స్ బ్యానర్ పై డా. అభినిక ఐనాభాతుని నిర్మిస్తున్న ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. వెన్నెల కిషోర్, షకలక శంకర్, నందితా శ్వేత, నవమి గాయక్‌తో పాటు రజిత్, నవీన్ నేని, రఘు తదితరులు నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ సాంగ్ 'పాప నువ్వు తోపు..' పాటను మీడియా సమక్షంలో రామానాయుడు స్టూడియోలో గ్రాండ్‌గా విడుదల చేసారు.



ఈ పాటను యువ రచయిత సింహాచలం రాయగా, 'అలవైకుంటపురంలో' సిత్తరాల సిరపడు పాటతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాలసురన్న పాడారు. అలాగే శకలక శంకర్ కూడా పాటలో కొంత భాగం పాడారు.

నిర్మాత డా.అభినిక తండ్రి రాధాకృష్ణ మాట్లాడుతూ,'మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ స్వరపరచిన ప్రతీ పాట అద్భుతంగా ఉంది' అని అన్నారు.

డైరెక్టర్ మార్తాండ్ శంకర్ మాట్లాడుతూ, 'హర్రర్ కథలకు నేపథ్య సంగీతం గుండె లాంటిది. అనూప్ రూబెన్స్ ప్రాణం పెట్టి మ్యూజిక్ ఇచ్చారు. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది' అని తెలిపారు. 'పైసా రే పైసా' మాదిరిగా 'ఓ పాప నువ్వు తోపు' కూడా వైరల్ సాంగ్ అవుతుంది' అని అనూప్ రూబెన్స్ అన్నారు.

## అందర్నీ మెప్పించే భారీ తారాగణం

సదన్, దీపికా రెడ్డి, రేఖ నిరోషి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'భారీ తారగణం'. శేఖర్ ముత్యాల దర్శకత్వంలో బివిఆర్ పిక్చర్స్ బ్యానర్‌పై బి.వి రెడ్డి నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'నేను రాసిన కథను నమ్మి నిర్మాత అవకాశం ఇచ్చారు. సినిమా మీద ఉన్న నమ్మకంతో విడుదలకు నెల రోజుల ముందే డిస్ట్రిబ్యూటర్లు, సన్నిహితులకు షో వేసి చూపించాం. మంచి స్పందన వచ్చింది. కథ బావుండటంతో పీవీఆర్ ఉదయ్ సినిమాను విడుదల చేయడానికి ముందు కొచ్చారు. సినిమా ప్రారంభం నుంచి అలీ ఇచ్చిన సపోర్ట్ మరచిపోలేను. ఈ నెల 23న వస్తున్న ఈ చిత్రాన్ని ఆదరిస్తారని నమ్ముతున్నా' అని అన్నారు.

'ఆస్ట్రేలియాలో బిజినెస్‌లో ఉన్న నాకు దర్శకుడు శేఖర్ పరిచయమయ్యారు. ఆయన చెప్పిన కథ నాకు కనెక్ట్ అయింది. లవ్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందింది. అన్ని వర్గాలను ఆకట్టుకునే చిత్రమిది. కథ, కథనంతోపాటు సంగీతం, అలీ, 7ఆర్ట్స్ సరయు చేసిన ప్రత్యేక గీతం సినిమాకు హైలైట్ అవుతాయి. మా చిత్రాన్ని విడుదల చేస్తున్న పీవీఆర్ సంస్థకు కృతజ్ఞతలు' అని నిర్మాత బి.వి.రెడ్డి చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: ఎం.వి గోపి.



సదన్, రేఖ నిరోషి

# ప్రకృతి పునర్జీవనం దిశగా తెలంగాణం

- హరితహారంతో పెరిగిన పచ్చదనం
- ఇప్పటిదాకా నాటిన మొక్కలు 273.33 కోట్లు
- పదేండ్లలో గ్రేటర్‌లో 147 శాతం పెరిగిన గ్రీన్‌కవరేజీ
- రాష్ట్రంలో 7.70 శాతం పెరిగిన పచ్చదనం
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు తెలంగాణ హరితోత్సవం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక అస్తిత్వం కోసం ఆరాటపడిన తెలంగాణ, రాష్ట్ర సాధన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు నేతృత్వంలో ప్రకృతి పునర్జీవనం దిశగా రాష్ట్రం వడివడిగా అడుగులు వేస్తున్నది. ఆయన ఆలోచనల్లోంచి పుట్టిందే తెలంగాణకు హరితహారం పథకం మంచి ఫలితాలను సాధిస్తున్నది. రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు కృషి చేస్తున్నది. ఆ పథకం కింద ఇప్పటిదాకా రాష్ట్రంలో 273.33 కోట్ల మొక్కలు నాటారు. దీని ఫలితంగా రాష్ట్రంలో పచ్చదనం 7.70 శాతం పెరిగింది. పదేండ్లలో గ్రేటర్‌లో గ్రీన్ కవరేజీ 147 శాతానికి చేరుకున్నది. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ హరితోత్సవాన్ని సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నది. ఈ నేపథ్యంలో సమాచార, ప్రజా సంబంధాల శాఖ తెలంగాణ హరిత ప్రగతి రిపోర్టును విడుదల చేసింది. అందులోని ముఖ్యాంశాలు ఇలా...

రానున్న తరాలకు ఆస్తులు పంచడం కన్నా స్వచ్ఛమైన గాలిని, నివాస యోగ్యమైన పచ్చని ప్రకృతి పరిసరాలను అందించాలనే గొప్ప సంకల్పమే హరితహారానికి పునాది. ఇలా ఆలోచించటంతో పాటు, ఆ దిశగా ప్రజలను ఒక సామాజిక కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికీ, సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. హరిత తెలంగాణ సాధనలో ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యమే పచ్చని విజయానికి సాక్షిగా నిలిచింది. ఇలా రాష్ట్రమంతటా పచ్చదనం వెల్లివిరియాలంటే తెలంగాణకు హరితహారం నిరంతర ప్రక్రియలా కొనసాగాలి. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ మన జీవన విధానంలో భాగం కావాలి.

### హరితహారం ఫలితాలు (2015-23)

- ఇప్పటిదాకా రాష్ట్ర వ్యాప్తంగా నాటిన మొక్కలు 273.33 కోట్లు.
- 14, 864 నర్సరీల ఏర్పాటు.
- హరితహారం నిర్వహణ కోసం ఇప్పటిదాకా 10,822 కోట్ల వ్యయం.
- 13,657 ఎకరాల్లో 19, 472 పల్లె ప్రకృతి వనాలు, 6,298 ఎకరాల్లో 2011 బృహత్ ప్రకృతి వనాల ఏర్పాటు
- రాష్ట్రమంతా 1,00, 691 కిలో మీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్. అందులో 12,000 కిలో మీటర్లు బహుళ రహదారి వనాలు.
- పర్యావరణంపై పిల్లలకు అవగాహన పెంచేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో 'వనదర్శిని' కార్యక్రమం చేపట్టారు.

### సాధించిన విజయాలు ఇలా...

- 13.44 లక్షల ఎకరాల అటవీ పునరుద్దరణ. 2.03 లక్షల ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి.
- పునరుద్దరణ ద్వారా పెరిగిన మొక్కలు 53.84 కోట్లు.

  - 10,886 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతాల చుట్టూ కందకాల తవ్వకం.
- అగ్ని ప్రమాదాల నివారణ కోసం 21,452 కిలోమీటర్ల మేర ఫైర్ లైన్లు ఏర్పాటు.
- నేల, తేమ పరిరక్షణ కోసం అడవుల్లో పెద్ద ఎత్తున నీటి యాజమాన్య పద్ధతుల అమలు. చెక్ డ్యాములు, ఇంకుడు చెరువులు/ కుంటలు మొదలైనవాటి నిర్మాణం.

### పట్టణ ప్రాంత అటవీ ఉద్యానవనాలు

- రాష్ట్ర వ్యాప్తంగా నగరాలకు సమీపంలో 75,740 ఎకరాల్లో 109 అర్బన్ ఫారెస్ట్‌లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసింది. 164 హరిత వనాల్లో వంద శాతం పచ్చదనం సాధించేందుకు 1.71 లక్షల ఎకరాల్లో 1.06 కోట్ల మొక్కలను నాటించింది.

### గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో...

గ్రేటర్‌లో సుమారు ఏడు కోట్ల మొక్కలు నాటడంతో పాటు, కొత్తగా 456 కాలనీ పార్కులను జీహెచ్‌ఎంసీ అభివృద్ధి చేసింది. 1120 కిలో మీటర్ల మేర అవెన్యూ ప్లాంటేషన్, 115 చోట్ల యాదాద్రి మోడల్‌లో (మియావాకి) పచ్చదనం పెంపునకు కృషి చేసింది. గ్రేటర్ పరిధిలో పది శాతం గ్రీన్ బడ్జెట్ కింద పచ్చదనం పెంపు కోసం సుమారు రూ.700 కోట్లను కేటాయించింది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం హరితహారం వల్ల గ్రేటర్ పరిధిలో పదేండ్లలో గ్రీన్ కవర్ భారీగా 147 శాతం పెరిగింది. 11.93 కోట్ల మొక్కలను నాటారు. ఔటర్ రింగ్ రోడ్డు, ఇంటర్ ఛేంజ్‌లు, సర్వీస్ రోడ్లు, పార్కులు పచ్చదనంతో హైదరాబాద్‌కు మణిహారంగా మారాయి. హైదరాబాద్ చుట్టూ 16 అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసింది. హెచ్‌ఎమ్‌డీఏ కృషి వల్ల గ్రీన్ సిటీ ఆఫ్ వరల్డ్‌గానూ మన్ననలు అందుకుంటున్నది.

విజయవంతమైన సంస్థగా ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పోరేషన్

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో ప్లాంటేషన్ చేసే సంస్థగా ఫారెస్ట్ స్టీవార్డ్ షిప్ కౌన్సిల్ (జర్మనీ) సర్టిఫికేషన్‌ను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌గా పేరు పొందింది. ఇలా దేశంలో గుర్తింపు పొందింది ఇది ఒక్కటే.

సంప్రదాయ యూకలిప్టస్ స్థానంలో ప్రత్యామ్నాయ మొక్కలు(టేకు, రోజ్‌వుడ్, గంధం, ఎర్రచందనం, సీతాఫల్, సరుగుడు) మొక్కల పెంపకంపై కార్పొరేషన్ దృష్టి సారించింది. ఎనిమిదేండ్లుగా సగటున 82. 69 కోట్ల రూపాయల రాబడి, గత ఆర్థిక సంవత్సరం (2022-23) 150 కోట్ల రెవెన్యూ వచ్చింది. ఈ యేడాది అంచనా 200 కోట్ల రూపాయలు. ఎఫ్‌డీసీ నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి ఎకో పార్కులుగా బొటానికల్ గార్డెన్, పాలపిట్ట సైక్లింగ్ పార్క్, ఫారెస్ట్ ట్రెక్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసింది.

ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా- స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు ప్రకారం హరితహారానికి అవార్డులిలా..

- 2015-21 మధ్య రాష్ట్రంలో ఫారెస్ట్ కవర్ 6.85 శాతం పెరిగింది. ఇది 3.36 లక్షల ఎకరాలకు సమానం.
- రాష్ట్రంలో పచ్చదనం (గ్రీన్ కవర్) 7.70 శాతం పెరిగింది. ఇది 5.13 లక్షల ఎకరాలకు సమానం.
- ట్రీ సిటీ ఆఫ్ ద వరల్డ్ -2020-21గా హైదరాబాద్‌కు గుర్తింపు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, ఆర్బర్ డే ఫౌండేషన్ ద్వారా అవార్డు.
- నీతి ఆయోగ్ సమీకృత అభివృద్ధి లక్ష్యాల సూచీల్లో (2020- 21) అటవీకరణ విభాగంలో తొలిస్థానం తెలంగాణదే.
- ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హార్టీకల్చర్ ప్రొడ్యూసర్స్, సౌత్ కొరియా ద్వారా వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్ -2022 దక్కించుకున్న హైదరాబాద్.
- వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ దేశవ్యాప్తంగా నగరాల్లో నిర్వహించిన సిటీ నేచర్ ఛాలెంచ్ - 2023లో మొదటి స్థానంలో నిలిచిన హైదరాబాద్. అత్యధిక జీవవైవిధ్యం గల నగరంగా గుర్తింపు.

  - సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ సంస్థ నివేదిక ప్రకారం పచ్చదనం పెంపులో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉంది.

# ఆటలు

భారత బ్యాడ్మింటన్‌లో మరో మైలురాయి. డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ కెరీర్ తొలి సూపర్ 1000 టైటిల్‌తో నయా చరిత్ర సృష్టించింది. టైటిల్ పోరులో ప్రపంచ చాంపియన్లు చియ, యిక్‌లపై గెలుపొందిన సాత్విక్, చిరాగ్.. సూపర్ 1000 టైటిల్ సాధించిన భారత తొలి డబుల్స్ జోడీగా రికార్డు సృష్టించారు.

## సాత్విక్, చిరాగ్ నయా చరిత్ర

- బిడబ్ల్యూఎఫ్ సూపర్ 1000 టైటిల్ కైవసం
- ఈ ఘనత సాధించిన తొలి భారత జోడీ
- ఫైనల్లో వరల్డ్ చాంప్స్‌పై ఘన విజయం

ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్

జకర్తా (ఇండోనేషియా)

జకర్తాలో సరికొత్త చరిత్ర సృష్టించబడింది. సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ భారత బ్యాడ్మింటన్‌కు మరో చారిత్రక టైటిల్ విజయాన్ని అందించింది. కెరీర్‌లో తొలిసారి సూపర్ 1000 ఫైనల్స్‌కు చేరుకున్న భారత మెన్స్ డబుల్స్ స్టార్స్.. టైటిల్ పోరులో ప్రపంచ చాంపియన్లు, మలేషియా స్టార్స్ అరోన్ చియ, సో వీ యిక్‌లపై వరుస గేముల్లోనే గెలుపొంది అదరగొట్టారు. 43 నిమిషాల మెగా ఫైనల్లో మలేషియా జోడీపై 21-17, 21-18తో గెలుపొందిన సాత్విక్, చిరాగ్ జోడీ ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్ మెన్స్ డబుల్స్ చాంపియన్స్‌గా అవతరించి, చారిత్రక విజయం నమోదు చేశారు. బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300 (సయ్యద్ మోడి), సూపర్ 500 (థాయ్‌లాండ్, ఇండియా ఓపెన్), సూపర్ 750 (ఫ్రెంచ్ ఓపెన్) సహా సూపర్ 1000 (ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్) టైటిళ్లు సాధించిన తొలి భారత షట్లర్లుగా సాత్విక్, చిరాగ్ సరికొత్త చరిత్ర లిఖించారు. ఆసియా చాంపియన్స్‌గా కొనసాగుతున్న సాత్విక్, చిరాగ్ జోడీ.. కామెన్‌వెల్త్ గేమ్స్ పసిడి, థామస్ కప్ స్వర్ణం సహా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కాంస్య పతకం సైతం సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

వరుస గేముల్లోనే.. : సాత్విక్, చిరాగ్‌లకు తొలి సూపర్ 1000 టైటిల్. ప్రత్యర్థి ప్రపంచ చాంపియన్స్, రెండో సీడ్ అరోన్ చియ, సో వీ యిక్‌లు. మలేషియా జోడీపై ముఖాముఖి రికార్డు 0-8తో మరీ పేలవం. ఈ పరిస్థితుల్లో సహజంగానే సాత్విక్, చిరాగ్‌లు టైటిల్ పోరులో అండర్‌డాగ్‌గా బరిలో నిలిచారు. తొలి గేమ్ ఆరంభంలో తడబాటుకు గురైన సాత్విక్, చిరాగ్ విరామ సమయానికి పుంజుకున్నారు. 11-9తో ఆధిక్యంలో కొనసాగారు. ద్వితీయార్థంలోనూ సాత్విక్, చిరాగ్‌లకు ఎదురులేకుండా పోయింది. మలేషియా స్టార్స్‌కు చెక్ పెట్టిన మనోళ్లు వరుసగా పాయింట్లు సాధిస్తూ ఆధిక్యంలో నిలిచారు. 21-17తో తొలి గేమ్‌ను గెల్చుకున్నారు. ఆరంభంలో 3-7తో నాలుగు పాయింట్ల వెనుకంజలో నిలిచినా.. వరుసగా ఆరు పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సాత్విక్, చిరాగ్ అదే దూకుడు తర్వాత కొనసాగించారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886